
అభిసారిక
జులై 1956
8 అణాలు

## ఈ సంచికలో

ధనికొండ, సులోచన, ఉమశ్రీ, మొదలైనవారి రచనలూ, హేవలాక్ ఎల్లీస్, వివాహ చరిత్ర; లైంగిక స్వేచ్ఛ, వంశపారం పర్యత, మొదలైన వైజ్ఞానిక వ్యాసాలు; సందేహాలకు-సమాధానాలు, వార్తా ప్రపంచం, మరెన్నో ఆకర్షణలు....


జులై సంచిక విడుదలయింది!

# జ్యోతి

ఎడిటర్ : ధనికొండ

ఈ సంచికలో:— మంజుశ్రీ, హేమంతకుమార్, భమిడి పాటి, మరామ, బులుసు-జీ-ప్రకాష్, వి. యస్. చెమ్నారి, 'రామకృష్ణ', వజ్రపాణి, మొదలైనవారి కథలు; వల్లపురెడ్డి రూపకం; ధృవ విజయం చిత్రకథ; తాళ్ళపూడి వెంకటరమణ, మొదలైనవారి గేయాలు; లోకసంచారం, బుల్లి కథ, వైజ్ఞానిక చిత్రాలు, గ్రంథ సమీక్షలూ, విజ్ఞాన చిత్రాలు, గల్పికలు, అవీ, ఇవీ, ఇంకా ఎన్నో విశేషాలు.

త్రివర్ణ ముఖచిత్రం

విడి ప్రతి: 0-8-0 | సం. చందా: 6-0-0

వివరాలకు:

జ్యోతి కార్యాలయం మద్రాసు-17.

నేడే చదవండి:

## శరత్ రచనలు

| | | |
|---|---|---|
| అరక్షణీయ | (నవల) | 0-8-0 |
| బడదీది | ,, | 0-8-0 |
| పరిణీత | ,, | 0-8-0 |

## ధనికొండ రచనలు

| | | |
|---|---|---|
| అనాథ | (కథలు) | 0-8-0 |
| దేవకన్య | ,, | 0-8-0 |
| కళారాధకులు | ,, | 0-8-0 |
| సేవిక | (పెద్ద కథ) | 0-8-0 |

## దాసు రచనలు

| | | |
|---|---|---|
| కాంతం-కనకం | (నవల) | 0-8-0 |
| మాయమైన మనిషి | ,, | 0-8-0 |
| నడిచి పోయిన శవం | ,, | 0-8-0 |

## భరద్వాజ రచన

| | | |
|---|---|---|
| ఆహుతి | (కథలు) | 0-8-0 |

## ఉమర్ ఖయ్యాం

(వర్ణచిత్ర సంపుటి) 0-8-0

ప్రతి పుస్తకానికీ ఆకర్షణీయమైన ముఖచిత్రాలు. పుస్తకాల ఖరీదుకు 0-8-0 అదనంగాపంపుతే రిజిస్టర్ పోస్టులో కాపీలు పంపబడతాయి.

వివరాలకు:

జ్యోతి కార్యాలయం, మద్రాసు-17.

# అభిసారిక

సచిత్ర విచిత్ర మాస పత్రిక

సంపాదకుడు: ధనికొండ హనుమంతరావు

| సంపుటి: 5 | జులై, 1956 | సంచిక: 1 |
|---|---|---|


ఈ సంచికలోని 'వంశ పారంపర్యత' అనే వ్యాసం చాలా మందికి కనువిప్పు కాగలదు. లైంగిక విజ్ఞానం నిత్య జీవితానికి ఎంత మేలు చేయగలుగుతోందో యీ వ్యాసం వివరిస్తుంది.

అంతే కాదు—శాస్త్రీయ విజ్ఞానం దిన దినాభివృద్ధి చెందుతోంది; అయితే మానవ జాతి దాన్ని ఉపయోగించుకోలేని దుస్థితిలో వుంటే, అది శాస్త్రకారుల తప్పు కాదు. అజ్ఞానంలో కొట్టుకొనే ప్రజల తప్పే!

ఉదాహరణగా, వధూవరుల్ని సమకూర్చే పెద్దలు 'ఎంత ఆస్తి వుంది? కుర్రాడు నలుపా? ఎరుపా? ఎంత వరకూ చదువుకున్నాడు?' మొదలైన వాటినే గమనిస్తారు. ఇదే విధంగా వధువు విషయంలో 'పిల్ల బాగుందా? సంగీతం వొచ్చా? ఎంత కట్నం ఇస్తారు?' మొదలైన ప్రశ్నలు వొస్తవి. వధూవరుల భావి జీవితాలకు అత్యవసరమైన ప్రశ్నల్ని గూర్చి ఎవ్వరూ ఆలోచించరు.

మచ్చుకు: 'వధువు వంశ పారం పర్యత ఏమిటి? వరుని వంశ వృక్షం ఎలాటిది? వీరి కలయిక వల్ల సంతానంలో వొచ్చి పడే లోపాలేమన్నా ఉన్నవా? వీరి ఆరోగ్యం ఎలాటిది? ముఖ్యంగా మనోభావాలూ, సంస్కారం ఎలా ఉన్నవి?' యీ ప్రశ్నలు చాలా అల్పమైనవిగా ధ్వనించి నప్పటికీ, వారి భావిజీవిత సౌఖ్యానికి వీటి జవాబులే, జవాబులనే విషయం బుర్ర ఉపయోగిస్తే అర్థం కానంత జటిలమైన విషయము కానేరదు కదా!

★

# వార్తా ప్రపంచం

ఆ మధ్య టెహరాన్‌లో శాస్త్రకారులు కార్పొరల్ అబల్ పగల్ అనే అతను కడుపు నెప్పితో బాధపడుతున్నాననీ, 16 పౌన్ల బరువు తగ్గాననే కంప్లెయింట్ మీద ఆపరేషన్ చేశారు. పొట్టలో నుంచి బైట పడవేయ వలసిన వస్తువుల జాబితా ఇది. 24 మేకులు, 12 పెద్ద చాకులు, 4 బ్లేడులు, 13 గాజుముక్కలు, 19 ఇనప గొలుసు లోని రింగులు, 2 చెప్పులకు ఉపయోగించే మేకులు, 2 గడియారపు గొలుసులు, 2 నట్లు, బోల్టులు, ఒక సన్నని లోహపు కడ్డీ, ఒక టీ స్పూన్! ఇదంతా ఏమిటని అడుగుతే రోగి—తాను 19 సం.లుగా మాజిక్ అభ్యసిస్తున్నాననీ, ఆ సందర్భంలో యీవస్తు చయాన్ని మింగాననీ అన్నాడు.

★

ముందు ముందు పశువుల ఆహారమైన గడ్డి గాదాల్ని చిన్న చిన్న మాత్రల రూపానికి దించటం వల్ల, చాలా చోటు శ్రమ కలిసి రాగలదు. యీ రకం గడ్డి గాదాల్లో చాలా భాగాన్ని సూక్ష్మ రూపాలకు దించ వొచ్చు; ఇందువల్ల పోషక పదార్థాల్లో ఎలాటి లోపమూ రాదు.

గాలి వొత్తిడి సహాయంతో యీ సూక్ష్మ రూపం సాధ్యమౌతోంది. చదరపు టంగుళానికి 20,000 పౌన్ల గాలి వొత్తిడిని ప్రయోగించటం, వల్ల ఎంతో చోటు ఆక్రమించుకునే గడ్డి సూక్ష్మ రూపానికి గురవుతుంది. సాధారణంగా యీ గాలి వొత్తిడి 4,000 పౌన్ల నుంచీ 6,000 పౌన్ల వరకూ ఉంటేనే చాలు.

★

పెద్ద మెదడు గొప్ప తెలివి తేట లుండేందుకు కారణ భూత మవగలదా? యీ విషయం మీద జరిగిన పరిశోధనా ఫలితాలు ఫిలిడల్ఫియా నుంచి, శాస్త్రకారులచే విడుదల చేయబడినవి.

మెదడు పరిమాణాన్ని బట్టి తెలివి తేట లుండవని వారు అంటున్నారు. పెద్ద మెదడును భరించటం కూడా కష్టం; ఎందు కంటే, మెదడు పెద్దదవటం వల్ల రక్తంలోని పంచదార భాగాన్ని అది ఎక్కువగా లాక్కుంటుంది.

ఒక పరిమాణంలో వున్న జంతువు తాలూకు మెదడు కన్న, అదే పరిమాణంలోని మానవుని మెదడు, ఆలోచనల కారణంగా అనేక రెట్లు పోషక పదార్థాలను కోరుతుంది. ఇందువల్ల ఇతర శరీరాంగాలకు పోషక పదార్థాలు తగినంతగా అందక పోవొచ్చు. ఏ ఇతర శారీరకమైన పని కన్నా, ఆలోచనలకే ఎక్కువ రక్తం అవసర మౌతూ వుంటుంది.

మెదడు ఎలా పని చేస్తుం దనేది మానవుడు ఇంకా సరిగా తెలుసు కోవాల్సిన విషయమే! అహర్నిశాలూ మెదడులోని సెల్స్‌లో వుండే సంబంధంవల్ల, రాడార్ పద్ధతిలో పనిచేస్తూ ఉండి ఉండొచ్చని ఊహించ బడుతోంది. మెదడు పనిచేసే విధానాన్ని గూర్చి చెప్పబడే ఇతర వివరాలు, వాదనకు నిలవవు; ఎందు కంటే ఆ విధానాలు, అమలు జరిగేందుకు మెదడులో తగినంత చోటు లేదు.

మెదడులో సుమారు 9,000,000 బూడిద రంగు సెల్సున్నవి కనీసం 1,000 000 సన్నని దారాలను పోలిన నరాలు, కంటి నుంచి వివిధానుభూతుల్ని మెదడు వెనుక భాగానికి పంపుతవి; అక్కణ్నుంచి ఆ వార్తలన్నీ మెదడులోకి సక్రమంగా పంపిణీ జరుగుతుంది. ఇదంతా క్షణాల్లో జరగాలి; చూడటం, చూడగానే గ్రహించి ఎలా నడవాలో నిర్ణయించటం మొదలైనవి, ప్రయత్నం లేకుండానే జరుగుతోందంటే, మెదడు ఎంత నిశితంగా పని చేస్తూండి ఉండాలో గ్రహించ వొచ్చు.

ప్రతి బూడిద రంగు సెల్, కంటి నుంచి వొచ్చే 1,000,000 సన్నని నరాల్లో ప్రతి దానితోనూ సంబంధాన్ని కలిగి వుంటుంది. ఇందు వల్ల కనీసం 90 వేల కోట్ల వివిధ వార్తా ప్రసారక మార్గాలు ఏర్పడు తూన్నవి. అంత చిన్న మెదడులో ఇన్ని కోట్ల ప్రసారక మార్గాలు ఇమిడి ఉన్నవంటే అదెలాగో, మన మెదడుతోనే ఆలోచించలేము! ఆ మధ్య జరిగిన మెదడులోని తరంగాల పద్ధతిలో పైన చెప్పిన రాడార్ పద్ధతి ఒక్కటే సాధ్యమనేందుకు ఎంతో అవకాశం ఏర్పడు తోంది.

ఈ సత్యాన్ని అనుసరించి తెలివి తేటలకూ మెదడు పరిమాణా నికీ సంబంధం ఉండక్కర్లేదు. శాస్త్రకారులకు తెలిసిన పెద్ద మెద ళ్ళలో, జర్మన్ ఛాన్సలర్ బిస్ మార్క్‌ది ఒకటి. కాని అంత పరిమా ణంలోనూ వున్న ఇతర మానవుల మెదళ్ళు, ఆయనంత తెలివితేటల్ని ఎన్నడూ ప్రదర్శించి ఉండలేదు.

మంచి తెలివి తేటలు దేనిమీద ఆధారపడి ఉంటవి? రక్త ప్రవాహం నుంచి మెదడుకు జేరే ఎన్‌జైమ్, కార్బన్ ఎన్‌హైడ్రజ్ మొదలైన రసాయనిక పదార్థాలని స్థూలంగా చెప్పవొచ్చు. యీ రెండు పదార్థాలూ బూడిద రంగు మెదడు సెల్స్‌కు కావలసిన శక్తి సామర్థ్యాలను ప్రాణవాయువునూ, బొగ్గు పులుసు వాయువునూ సర ఫరా చేస్తవి. మెదడు స్వీకరించే ఎన్‌జైమ్‌లోనే జంతు జాలానికీ, కోతికీ ఏంతో తేడా వుంది. అదే విధంగా కోతికీ మానవునికీ ఎంతో భేదం ఏర్పడుతోంది. స్థూలంగా చెప్పాలంటే, మెదడు పరిమాణం కన్న, అది పని చేసేందుకు తగిన వాతావరణం మీదనే తెలివితేటలు ఆధారపడి ఉంటవి.

★

రక్త పోటును కొలబెట్టడానికి బయోఫోన్ అనే ఒక కొత్త వైద్య పరికరాన్ని ఇర్‌కటన్స్ వైద్య సంస్థ ఉద్యోగులు కొంతమంది డిజైను చేసారు. ఈ పరికరం గామఫోను మాదిరిగా ఉంటుంది; దానికి

ఒక రిసీవరు (శబ్దం గ్రహించేది) ఏంప్లిఫయర్, (శబ్దాన్ని యెక్కువ చేసేది) ఒక రీ ప్రొడ్యూసర్ (శబ్దాన్ని విడుదల చేసేది) —యివి అమర్చబడి ఉంటాయి. ఈ యేర్పాటు వల్ల మనిషి యొక్క నాడినీ, హృదయ స్పందనాన్నీ ఒకేసారి చాలా మంది డాక్టర్లు వినవచ్చును. ఈ పరికరంవల్ల మరి యొక లాభం యేమిటంటే, మనిషియొక్క నాడి, హృదయ స్పందనాలను వినడానికి, ఆ మనిషి డాక్టరుకు సమీపంలో ఉండ నవసరం లేదు; బాగా దూరం నుండే ఆ స్పందనాలను విన వచ్చును; మనిషి నీటిలో ఉన్నప్పటికీ వినవచ్చును.

శస్త్ర చికిత్స జరిపే సమయంలో రోగియొక్క, రక్తపోటునూ, నాడీ వేగాన్నీ కొలబెట్టడానికి యీ కొత్త పరికరాన్ని జయప్రదంగా ఉపయోగించ వచ్చును.

★

సిలోనీయుల్లో నోటిలో కాన్సర్ వ్యాధి అధికంగా ఉండటాన్ని గూర్చి పరిశీలనలు జరుగుతూన్నవి. సిలోన్‌లో తమిళుల జనాభా అధికంగా వుండి, వారి అలవాట్లను అనుసరించి, ఎక్కువగా తాంబూల సేవనం, అదీ పొగాకుతో మిళితం చేసి వాడటమే—నోటిలోని కాన్సర్ వ్యాధికి కారణమని నమ్మబడుతోంది.

★

నేటి ప్రపంచంలో జరిగే అనేక శాస్త్రీయ శస్త్ర చికిత్సలు మతైకంగా ఎంత వరకూ అవినీతి కరాలో వివరిస్తూ పోప్ యీ కింది ప్రకటన చేశారు:

'కృత్రిమ విధానంలో జరిగే గర్భధారణ అవినీతికర మైనది; అక్రమ మైనది.'

'చనిపోయిన వ్యక్తి తాలూకు కంటి కార్నియాను, బతికివున్న అంధునికి, చూపు నిచ్చేందుకు ఉపయోగించటంలో చర్చికి ఎలాటి అభ్యంతరమూ లేదు.'

'జంతువు తాలూకు సెక్సు గ్రంథుల్ని, మానవునికి అతకటం అవినీతి కరం. జంతువు కంటి కొరోనా, మానవునికి చూపు నిచ్చేందుకు ఉపయోగిస్తే, చర్చికి అభ్యంతరం లేదు.'

'జంతువు దేహానికీ, మానవ దేహానికీ చాలా భేదం వుంది; మానవ దేహం మృత్యువు తర్వాతకూడా విలువైనది. దానిలోని ఆత్మ, పరమాత్మను కలవాలి. కనుక దాన్ని పవిత్రంగానే భావించ వలసి వుంటుంది. ఐతే శాస్త్రీయ విజ్ఞానాభి వృద్ధికి మానవ మృత శరీరాన్ని ఉపయోగించ వొచ్చు. మానవుడు తన మరణానంతరం, తన మృత శరీరాన్ని శాస్త్రీయ విజ్ఞానం కొరకు ఉపయోగించేందుకు సమ్మతించటంలో అవినీతి లేదు. ఇందుకు గాను, ఆ వ్యక్తి ధన రూపంలో ప్రతిఫలాన్ని పొందటం కొన్ని సందర్భాలలో పాపం కాదు.'

'రక్త దానానికి, ప్రతి ఫలాన్ని నిరాకరించటం దాత దాతృ త్వాన్నీ, విశాలత్వాన్నీ నిరూపిస్తుంది; ప్రతి ఫలాన్ని స్వీకరించటం తప్పు మాత్రం కాదు.'


★

గత20 సం.లుగా రష్యాలో కృత్రిమగర్భస్రావాలు నేరాలుగా ఉన్నవి. ఇప్పుడు కృత్రిమ గర్భస్రావాలు నేరం కాదని సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది.

రెండో ప్రపంచ యుద్ధంలో రష్యన్ జనాభా చాలా తగ్గింది. ఆ తరువాత ఏటా 3,000,000 జననాలు సరాసరిన జరిగినవి. తల్లి ఇష్టపడితే గర్భస్రావం చేసుకోవటాన్ని చట్ట సమ్మతం చేశారు. యీ గర్భ స్రావాన్ని డాక్టర్లు కాని వారు కానీ, అనారోగ్య పరిసరాల్లో చేయటాన్ని కానీ ప్రభుత్వం శిక్షిస్తుంది. ఇందువల్ల చేత కాని వారు కూడా గర్భస్రావాల్ని చేయటం అరికట్ట బడుతోంది.

జపాన్, డెన్మార్క్, స్వీడన్, ఫిన్లండ్‌లలో గర్భస్రావాలను గూర్చిన చట్టాలు చాలా సడలించ బడినవి. ఇతర దేశాల్లో డాక్టర్ అత్యవసరమని నిర్ణయిస్తే తప్ప, గర్భస్రావం చేసుకోవటం నేరంగా పరిగణించ బడుతోంది.

★




## దేశ దేశాలలోని మార్పులు

రాజకీయ వాతావరణం ఎలాటి దైనప్పటికీ మానవుని అవసరాలూ సమస్యలూ ప్రపంచంలో దాదాపు ఒకటిగానే ఉంటవి. అందుకనే కాలచక్రంతోపాటే వైవాహిక చట్టాలూ, విడాకులచట్టాలు దేశదేశాలలోనూ సవరించబడుతూనే ఉన్నవి.

అర్థ శతాబ్దం నుంచీ ఇంగ్లండులో మార్పులు ఆరంభమైనవి. యీ నాడు నాగరికతను ఆరాధించే ప్రతి ఇతర దేశమూ ఇంగ్లండు ఎటు కదిలిందో, అదే నడక సాగించింది. 1885కు పూర్వం మతాధికారుల నిరంకుశ చట్టాలతో, జరిగిన వివాహాన్ని రద్దుచేసే అవకాశం ఉండేదికాదు. అలాటిది1885లో పాత చట్టాలుతుడిచి వేయబడి, కొత్తవి ఏర్పరుచ బడినవి, యీ చట్ట భాగాలు కొన్ని చాలా న్యాయసమ్మతంగానూ, ఉచితంగానూ, ఉన్నవనేందుకు సందేహం లేదు.

భార్య వ్యభిచార నేరానికి జైలుశిక్ష అనుభవించవలసి ఉన్నప్పటికీ, భర్తతో సరిసమాన ఫాయిదాలో విడాకుల్ని బడయ గలదు; ఆమె ప్రియునికి కేసులో పెద్ద పాత్ర ఉండదు. తత్వరీత్యా వున్న లోపాలవల్ల విడాకు లివ్వబడవు. విడాకుల ముందే తన వ్యక్తిత్వపు హోదాలో న్యాయమూర్తి, దంపతు లిద్దరూ కలిసి ఉండేందుకు ఏమైనా సావకాశ మున్నదేమోనని ప్రయత్నించటం ఆరోగ్యకరమైన దన వొచ్చు. అన్నిటికన్నా ముఖ్యం కోర్టు వ్యవహారాలలో తాతముత్తాతల సుగుణ దుర్గుణాలనుంచీ తవ్వ నవసరం లేకుండా న్యాయమూర్తి రహస్యంగానే కేసు నడిపించి, విడాకుల్ని ప్రసాదించ వొచ్చు ..ఇలాటి మార్పులు ఫ్రాన్సులో 1885 లోనే జరిగినవి. ఇతర లాటిన్ దేశాలు ఫ్రాన్సు అడుగు జాడల్లో మార్పుల్ని చేసుకున్నారు.

ప్రష్యాలో—దంపతుల్లో పొత్తు పొసగదని నిర్ధారణగా తేలిన తర్వాత' బజారు కెక్కకుండానే వారు విడిపొయ్యే అవకాశాలుండేవి. అంటే ఉభయుల అంగీకారమే వారి విడాకులకు సరిపడే కారణంగా భావించబడేది. ఐతే 1900 ల్లో జర్మన్ స్మృతి మరికొన్ని నియమావళిని ప్రవేశ పెట్టింది. ఈ నియమావళి కొన్ని చోట్ల ఆంగ్ల చట్టాలకన్న విశాలదృక్పథాన్ని నిరూపించినా, మొత్తంమీద కఠినంగానూ, అమానుషంగానూ ఉన్నదనే చెప్పవలసి వుంటుంది. విడనాడటం, మతి భ్రమణ కారణాలుగా విడాకు లివ్వటం వరకూ, యీ చట్టాలు తమ విశాలత్వాన్ని నిరూపించినవి. మిగతా చోట్ల చట్టం కఠినరూపం దాల్చటం వల్ల, రెండు సంవత్సరాలలో విడాకుల కేసులు చాలావరకు తగ్గిపోయినవి.

ఆ తరువాత ప్రజలూ, న్యాయస్థానాలు కూడా వేరొక పద్ధతిని అవలంబించినవి. వ్యక్తిగతమైన హానిని ఆధారంగా విడాకులు పొందే వివిధ పద్ధతుల్ని అన్వేషించి, విడాకుల్ని పొందే తేలికైన కొత్తమార్గాన్ని కనిపెట్టినవి. ముఖ్యంగా దాంపత్య ధర్మాల్ని సక్రమంగా నిర్వర్తించ కుండటమనే అభియోగం గమనించదగింది. యీ కొత్తదారి పడగానే విడాకుల సంఖ్య అత్యధికంగా పెరిగింది.

హెర్ష్‌ఫీల్డ్ తన అభిప్రాయాలను ఇలా వెల్లడించాడు: 'ఏమైనా విడాకుల కేసునుగూర్చి చదవటం ఎంత బాధావహం! ఒకరు మరొకరి లోపాల్ని-ఉన్నవీ లేనివీ కల్పించి, చిలవలు పలువలల్లి నిందిస్తారు; అదే విధంగా రెండోవారు ఎదుటివ్యక్తి పుట్టుపూర్వోత్తరాలను తవ్వి, డిటెక్టివ్‌లను నియమించి, నానా అవస్థాపడి, కొంత నిజాన్ని, అధికభాగం కల్పనతో జోడించి, రుజూలూ, సాక్ష్యాలను సేకరించి నానా రభసా చేస్తారు. నీచమైన అవినీతికరమైన బతుకు భాగాల్ని గోరంతలు కొండంతలుగా న్యాయస్థానంలో విశదీకరించటం జరుగుతోంది. దంపతులు ఉభయులూ వైవాహిక జీవితానందాన్ని పొందలేక, ఒకరి వల్లనే మరొకరికి ఇబ్బంది కలిగి, జీవితమంతా పాడైందనే వరకూ వొస్తున్నారు. నిజమేమిటంటే దాంపత్య జీవితం ఎలాటిదో తెలియని అమాయకులు, తమ చేతకాని తనాన్ని ఒకరిమీద మరొకరు నిందలు మోపటంగా పరిణమిస్తోంది. లైంగిక శాస్త్రంలోని ప్రాథమిక సత్యాలనేకం వారికి తెలియక, తమ అమాకత్వానికి విశేషమైన విలువలను, జరిమానాలుగా చెల్లిస్తున్నారు.'

పైమాటలు ప్రత్యేకించి ఏ ఒక్క దేశానికీ సంబంధించిన వనటం కన్న, విడాకులు అమల్లో వున్న అన్ని దేశాల స్థితీ ఒకేవిధంగా వున్నదనటం సమంజసం. క్రమేపీ ఇంగ్లండ్‌లో లోగుట్టుకన్న పైగుట్టుకే ప్రాధాన్యతను ఇవ్వటం వల్ల, అసహ్యకరంగా కోర్టులో దంపతులు ఒకర్నొకరు నిందించుకోవటం కొంతవరకూ తగ్గింది.

## దాంపత్య జీవిత పరిణామాలు

విడాకులు అధికంగా ఇవ్వబడే దేశాల్లో దాంపత్య జీవితం అధోగతిలో వున్నదని వేరుగా చెప్పనక్కర్లేదు. అర్థశతాబ్దం క్రితం వెన్నిస్‌లో గ్రాస్‌హాఫింగర్

అయితే ఆయన 100 దాంపత్యాల నుంచి సేకరించిన అంచనాలు గమనించ దగినవి. ఆయన తన ఇష్టానుసారంగా దాంపత్యాలను ఎన్నుకోలేదు. సామాజికంగా అన్ని తరగతులవారూ యీ అంచనాల్లో ఉన్నారు. అంచనాల వివరం ఇది:

48 మంది తమ దాంపత్యంలో బొత్తిగా సుఖం లేదన్నారు. 16 మంది తమ దాంపత్యం సుఖదాయకమైనదని ఖచ్చితంగా చెప్పగలిగారు.

ఐతే యీ 16 మందిలోనూ ఒకరు—ఒకరిపట్ల వేరొకరికి వున్న నమ్మకం వల్లనే తాము సుఖంగా ఉన్నామన్నారు. మిగతా కేసుల్లో వారి నైతిక వర్తనను లెక్కచేయకుండానే సుఖాన్ని పొందగలుగుతున్నారు.

విశదీకరించి చూస్తే వైవాహిక జీవనం నాగరికత వల్ల దుఃఖభాజనమైనదా అనిపిస్తుంది. ఆస్ట్రియాలో పురోగమించేందుకు సిద్ధపడినసమాజం, వైవాహికజీవితాన్ని యీ విధంగా పరిశీలించింది: దంపతులు ఒకరికొకరు గొలుసులు వేయబడి, కట్టి వేయబడ్డారు. యీ గొలుసులో అనురాగసుగంధ అక్కడక్కడ ఉండొచ్చు. కాని చాలా గొలుసుల్లో కేవలం అవసరమూ, సామాజిక ఆచారాల వొత్తిడీ ఉండటం వల్ల, తాము చేయని నేరాలకు ఘోరశిక్షల్ని అనుభవించటం దంపతులకు తప్పని సరైంది.'ఇందులో కొంత అతిశయోక్తి ఉన్నప్పటికీ, మొత్తంమీద వైవాహిక జీవితము బైటినుంచి చూసేవారికి తోచినంత సౌఖ్యవంతంగా ఉండటంలేదనేసత్యాన్ని కాదనలేము.

## ఇతర దేశాల్లో విడాకులు

రష్యాలో మత గురువు, మరికొంతమంది సలహాదారులతో కలిసి చేసిన వివాహ చట్టాలు, ఇతర దేశాల్లో మరెక్కడా కనిపించవు. యీ చట్టాలు చాలామందికి తేలిగ్గా అర్థమయేవిగానూ, ముఖ్యంగా విడాకుల్ని సులభతరం చేసేవిగానూ ఉన్నవి. 1907 కు పూర్వం, రష్యాలో విడాకుల్ని పొందటం చాలా కష్టంగా వుండేది; అదే సంవత్సరంలో చట్టాలు సవరించ బడటం వల్ల సులభమార్గం ఏర్పడింది.

దంపతులు తమలో తాము సంప్రదించుకొని, ఒక సంవత్సరంపాటు విడిబడి ఉన్నట్లయితే, వారికి విడాకు లివ్వబడటమే గాక, పునర్వివాహం చేసుకునే హక్కు కూడా ఇవ్వబడుతోంది. సెక్సు విషయాల్లో రష్య మానవత్వాన్ని అర్థం చేసుకొని నిత్యజీవితంలో ప్రవేశ పెట్టిందనే చెప్పాలి. మిగతా పశ్చిమ దేశాల్లోవలె బ్రహ్మచర్యం పవిత్రమైనదనీ, దాన్ని ఆరాధించటంలోనే గొప్పవున్నదనే దురభిప్రాయాలు రష్యాలో కనిపించవు. యీస్టరన్ చర్చివారు, మతగురువులు కూడా వివాహము ఆడవొచ్చన్నారు; ఐతే ఆ ఉద్యోగంలో ప్రవేశించేముందే వారు వివాహానికి అర్హులు. ఇందువల్ల వెస్టరన్ చర్చివలె, యీస్టరన్ చర్చి సెక్సువిషయాల్లో విముఖతను ప్రదర్శించటం లేదు.

ఇక స్విజర్లెండ్‌లో—యీ దేశం యూరప్‌లోని రాజకీయాలకు పరిశోధ

నాలయమని ప్రసిద్ధి చెందింది—దాంపత్యం సక్రమంగా సాగని పరిస్థితుల్లో దంపతులు ఉభయుల అంగీకారంతోనూ తాత్కాలికంగా రెండు సంవత్సరాలపాటు విడాకుల్ని పొందే అవకాశం వుంది. అప్పటికీ వారి మనసులు అతకనట్లయితే శాశ్వతమైన విడాకులు ప్రసాదించ బడుతవి. యీ చట్టాన్ని నెపోలియన్ 1803 లోనే ప్రవేశపెట్టాడు. విశాలదృక్పథంతో గొప్ప దేశాలకన్న, చిన్న దేశాలే విడాకుల చట్టాల్లో అభ్యుదయాన్ని చూపినవి.

నార్వేజియన్ చట్టాలు కఠినమైనవికావు. రొమేనియన్ చట్టాలు దంపతుల అంగీకారంతో విడాకుల్నిస్తవి; ఐతే తల్లిదండ్రులు తమ ఆస్తిపాస్తుల్లో పిల్లలకు సరి సమాన భాగాలు ఇవ్వాలి. మొనాకో చట్టాలు మరింత ముందడుగు వేసినవి: దంపతుల అంగీకారంతోనే విడాకు లివ్వటం గాక—తాగుడుకు అలవడటం, సిఫిలిస్ మొదలైన అంటువ్యాధులు సంక్రమించినట్లయితే, విడాకు లివ్వటాని కూడా అంగీకరించినవి. ఇందువల్ల ముందుతరం వారికూడా ప్రభుత్వం కొంత రక్షణను కల్పిస్తోంది.

### అమెరికన్ చట్టాలు : విడాకులు

మొత్తంమీద చూసినట్లయితే అమెరికన్ వైవాహిక, విడాకుల చట్టాలు చాలా విశాలదృక్పథాన్ని చూపుతవి. ఐతే యీ దృక్పథం ప్యూరిటన్ సిద్ధాంతాలను పునాదిగా కలిగి ఉండటం వల్ల, ప్రణయానికి లేనిపోని పవిత్రత ఆపాదించబడి నిత్య జీవిత విధానానికి చాలా ఇబ్బందుల్ని కలుగ జేసింది. చట్టనిర్మాతలు, గడిబిడ పడి, యీనాడు తయారుచేసిన చట్టాన్ని, మర్నాడే మారుస్తూ నానా అవస్థాపడ్డారు. ముఖ్యంగా అయోవా రాష్ట్రంలో చట్టాలు క్షణక్షణానికీ మారటంచూస్తే, అమెరికన్ సామాజిక జీవనం అధోగతిలో వున్నదనేందుకూ అవకాశాన్నిచ్చింది.

నిజానికి అమెరికాలో విడాకులు చాలా విరివిగా జరుగుతయ్యనే సామాన్యాభిప్రాయం ఒక అతిశయోక్తి. జనాభాకూ, విడాకులకూ వున్న నిష్పత్తి నూటికి ఒక్కటి మాత్రమే! విడాకుల్ని పొందినవారు తిరిగి వెంటనే వివాహం చేసుకుంటారనేది చెప్పకుంటూన్నంత విరివిగా జరగటం లేదు. యునైటెడ్ స్టేట్స్‌లో ఒక సామాన్య వ్యక్తి గడిపే జీవిత విధానాన్ని బట్టి చూస్తే విడాకులు మితిమీరి జరగటమూ లేదు; నైతికజీవనం దిగజారనూ లేదు.

ఒకానొక సుప్రసిద్ధ విమర్శకుడు అమెరికాలో జరిగే విడాకుల కారణాన్ని నిష్పాక్షికంగా వెల్లడించాడు. చట్టసంబంధమైన కారణాలు కోర్టులకు మాత్రమే పనికివొచ్చేవి కనుక, వాటిని తీసివేస్తే కాని, అసలు కారణం తాలూకు నగ్నస్వరూపాన్ని చూడలేము. దాంపత్య జీవనంలో శారీరకమైన కలయికకే గాక, ఆత్మల సంయోగానికూడా అవకాశం ఉండాలి. చాలా దాంపత్యాలు విధిలేక సాగుతూన్నవే కాని, అంతరాత్మల ప్రసక్తి తెస్తే, ఆ దాంపత్యాలు అంతరాంతరాల్లో ఏనాడో

విచ్ఛిన్నమైనవి. తెలివిగల దంపతులు, నిస్సారమైన దాంపత్యాన్ని కొనసాగించటం కన్న విడిపడేందుకే ప్రయత్నిస్తున్నారు. యీ ఒక్క కారణమే అమెరికన్ దైనిక జీవనంలో గొప్పస్థానాన్ని ఆక్రమించుకుంటోంది. 'సామాన్యంగా ఇల్లాలు, అందునా చాలా తెలివిగల, విజ్ఞాని, ఆత్మల సంయోగానికి తన దాంపత్యంతో తావు లేదని తెలుసుకోగానే, ఆత్మవంచన చేసుకొని, నైతికంగా పతనమై నటనలతో దాంపత్యాన్ని కొనసాగించటం కన్న, ఆ బాధల నుంచి విముక్తి పొందటమే అత్యుత్తమ మార్గమని గ్రహించి, అమలు జరుపుతోంది. వ్యక్తిగతంగా విడాకుల్ని నేను మెచ్చుకోలేక పోయినా, అమెరికన్ స్త్రీకి నిత్యజీవితంలోవున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలూ ఆమె చదువు సంస్కారాలే విడాకుల అవసరాన్ని తెలియ చెప్తున్నాయని చెప్పగలను' అన్నాడా విమర్శకుడు.

### సామాజిక జీవనం: విడాకులు

ముఖ్యంగా అమెరికన్లు అనుభవించే స్వాతంత్ర్యం, వ్యక్తిత్వాన్ని నిరూపించుకొనేందుకు పడే పాట్లూ గమనించ దగ్గవి. ఇది ప్రతి వ్యక్తిలోనూ, సామాన్యంగా కనిపించ సాగాక దాంపత్య జీవనం రెండు రకాల వ్యక్తిత్వానికి సమన్వయాన్ని కూర్చలేనిదిగా తయారవటం జరుగుతుంది. ఎవరికి వారు తమ వ్యక్తిత్వాన్ని, రెండో వారికి లొంగ నీయకుండా తమలోనే లీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు.

స్మిత్ బేకర్ అనే సుప్రసిద్ధ వైద్యుడు దాంపత్యంలో నరాల బలహీనత. దాంపత్యమంటే విరగింపు కలిగేట్లు చేయటాన్ని గూర్చి, ఒకానొక వ్యాసంలో చర్చిస్తూ ఇలా అన్నాడు; 'దంపతుల్లో ఒకరు, దాంపత్య జీవనం సాగుతూండగా, తనకన్న ఎగుటి వ్యక్తి ఎంత హీనస్థితిలో వుందో, ఆమె లేదా అతని వ్యక్తిత్వం ఇంకా పరిపూర్ణత అందుకోలేదో గ్రహించటం జరుగుతుంది. వివాహానికి ముందుగా వారిద్దరి మధ్యా ఎంత స్నేహం, అనురాగం ఉన్నప్పటికీ, వైవాహిక జీవనం తాము కలలు కన్నంత మధుర తమంగా లేదని గ్రహించేందుకు ఎక్కువ కాలం పట్టదు. ఐతే దాంపత్య ధర్మాల్ని అనుసరించి తీరవలసిన తన బాధ్యత—యీ బాధల్ని పడుతూ తాను నమ్మకంగానూ, గౌరవంగానూ బతకలేనని తెలిసి వొస్తుంది. అభిరుచుల్లోనూ, అభిప్రాయాల్లోనూ ఉండే భేదం నిత్య జీవితాన్ని హాయిగా దొర్లనివ్వదు. పైకి రభస జరగక పోయినా దంపతుల అంతరాల్లో అగ్ని పర్వతాలు బద్దలై, ఒకరి పట్ల వేరొకరికి ద్వేషాన్ని రగులుస్తవి. బలాత్కారంగా వారు ఏక శయ్యాగతులైనప్పటికీ, ఆ దాంపత్యం నిస్సారమే అవుతుంది. యీ మానసిక సంఘర్షణ వల్ల వొచ్చిపడే నరాల బలహీనత, ఆయా ఉద్రేకాల కారణంగా పొందే వేదనలవల్ల, దాంపత్యం కొనసాగేందుకు చాలా తక్కువ అవకాశాలే ఉంటవి. ముఖ్యంగా స్త్రీ నరాల బలహీనత కారణంగా చాలా బాధపడుతుంది; అసంతృప్తి కరమైన జీవితాన్ని కొనసాగించ లేని దుస్థితిలో పడుతుంది. ఇలాటి కారణాలు ఏ కోర్టూ ఒప్పుకోలేదు. ముఖ్యంగా అనుభవించిన వారికీ, మానవ మనస్తత్వ శాస్త్రకారులకూ స్పష్టంగా అర్థమవుతుంది. కాని, బైటి వారికి యీ కారణాలు హాస్యాస్పదంగా కూడా కని

పించవొచ్చు. ఏమైనా ఇలాటి పరిస్థితులు అనేక దాంపత్యాలలో ఉన్నవనీ, ముఖ్య కారణం అదే అయినా, విడాకుల్ని పొందేందుకు అనుకూలంగా వుండే కారణం ఇతర కారణాలు, కేవలం చట్టాన్ని తమకు అనుకూలంగా తిప్పుకునేందుకు, అల్లబడుతూన్న వనేది సత్యదూరమైన విషయం కాదు.

## విడాకులు: నైతిక జీవనం

ఏ సామాజిక నిబంధనన్నా ఏర్పడగానే, దానికి కొన్ని అడ్డంకులు అంటూ ఉండక పోవు. వివాహం ఒక శాశ్విత బంధంగా ఏనాడైతే ఏర్పడిందో, అది కొనసాగని పక్షంలో తీసుకోవాల్సిన చర్య లేమిటనే ప్రశ్న వెనువెంటనే కలుగుతుంది. కనుక విడాకుల సమస్య ఒక్క క్రిష్టియన్ మతాలకు మాత్రమే సంబంధించింది కాదు; ఇతర దేశాలూ, అన్య మతస్థుల్లో కూడా యీ సమస్య స్వరూపం ఉండనే వుంది.

ప్రపంచంలోని అన్ని దేశాల్లోకీ జపాన్‌లో విడాకులు విరివిగా సాగుతూన్నవి. 10 సం.ల క్రితంకూడా జపాన్, డెన్మార్క్, స్విజర్లండ్‌ల లెక్కకు వొస్తుంది. వీటిల్లో అభ్యుదయ పథంలో వున్న వనుకునే దేశాలన్నిటిలోనూ దాంపత్య జీవితంలోని పవిత్రతకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూన్నవి. ఐతే యీ 'పవిత్రత' చదువు సంస్కారాల మీద కన్న, గాఢ నమ్మకాల మీదనే ఆధారపడి వుంటుందని చెప్ప వలసి వుంటుంది. ఉదాహరణగా అమెరికాలో జరిగే విడాకుల్ని పరిశీలించినట్లయితే, చదువు సంస్కారాలు అధికంగావున్న దాంపత్యాలలోనే అధికంగా విడాకులు అమలు జరిగినవి.

మరో దురభిప్రాయం ఏమంటే—విడాకులు నైతిక పతనాన్ని సూచిస్తుందని. ఇది దురభిప్రాయమనేందుకు న్యూ ఇంగ్లండ్ రాష్ట్రం గొప్ప ఉదాహరణ. ఆ రాష్ట్రంలో ప్యూరిటానిక్ సిద్ధాంతాలు బలవత్తరంగా పాతుకున్నప్పటికీ, ముఖ్యంగా నైతిక స్వేచ్ఛను ప్రసాదంచటంలో పురోగమించింది. నిజానికి నైతిక పతనం ఎప్పుడు ఆరంభమౌతుందో పరిశీలిస్తే యీ విషయాన్ని తేలిగ్గా అర్థం చేసుకోవొచ్చు.

దాంపత్యంలో పొత్తు పొసగక, దాంపత్య పరిధిని దాటి లైంగికానుభవాల్ని పొందటం, ద్రోహాన్ని తల పెట్టటం నిజంగానే నైతిక పతనమౌతుంది. కాని అలాటి దాంపత్యాన్ని భరించ లేక, శారీరక మానసిక వేదనల నుంచి విముక్తిపొందేందుకు, విడాకులు పొందటంవల్ల నిజంగానే పతనావస్థనుంచి తప్పించుకోవటమే కాగలదు. ఏ దాంపత్యమైతే, దాన్నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకునే అవకాశాన్నివ్వదో, అదే నైతిక విలువల్ని పాడుచేసి, వ్యక్తుల్ని పెడదార్ల పట్టించేందుకు ప్రయత్నిస్తూంటుంది. నైతిక పతనం జరగలేదని నటించటం, సమాజాన్ని మోసగించటం తేలికే అవుగాక; మనకు కావలసింది నిజంగా మనం అనుకునే 'నీతి' ఎన్ని పాళ్ళు; కల్తీ ఎన్ని పాళ్లు అనేది. విడాకుల అవకాశం ఉన్నట్లయితే యీ కల్తీ సరుకును ఉపయోగించవలసిన అవసరమే ఉండదు. ఆరోగ్యకరమైన, సౌఖ్య

మధురమైన దాంపత్యం కొనసాగే అవకాశం లేనప్పుడు రాజమార్గం నుంచే బైట పడొచ్చు. ఏ దేశాల్లో దంపతుల అంగీకారంతో విడుకులు ఇవ్వబడుతోందో, ఆ దేశాల్లో నైతిక జీవనం అత్యున్నత స్థాయిలో ఉన్నదనేందుకు ఎలాటి సందేహమూ లేదు.

## విడాకులకు అతి ముఖ్యం

ఏ కారణంమీద విడాకుల్ని ఇవ్వవొచ్చనేది సమాజానికి మొదటి నుంచీ గొప్ప సమస్యగానే ఉండి పోయింది. తరాలు గడుస్తూన్న కొద్దీ యీ కారణాలు కూడా మారుతూ వొచ్చినవి; ఇంకా మారుతూనే ఉన్నవి. ఐతే 20 శతాబ్దాల క్రితం రోమన్లు దంపతుల ఉభయుల అంగీకారం మీదా విడాకుల్ని ఇచ్చే శాసనాన్ని అమలు జరిపారు. ఆ తరువాత అది కాల చక్రంలో కలిసి పోయి ఇతర కారణాలు అనేకం వొచ్చి పడినవి. ఏ సమాజానికి గట్టి పునాది వుంటుందో, అది మానవతత్వాన్ని, మనసులో పెట్టుకొని, సకారణ వాదనకు అవకాశాన్నివ్వ వలసి వుంటుంది. ముఖ్యంగా దంపతులు ఉభయులూ అయిష్టంతోనే దాంపత్యాన్ని కొనసాగించాలనటం వల్ల, సమాజం ఎంత కలుషిత మవుతుందో మనం చూస్తూనే వున్నాం.

ఐతే నేటికీ కొన్ని దేశాల వారు, దంపతుల అంగీకారంతో విడాకు లివ్వటాన్ని అమలు జరుపుతూనే వున్నారు. వివాహం జరిగేందుకూ కూడా చాలా సులభసాధ్యమైన చట్టాలు అమల్లో ఉన్నవి. దంపతులు కాగోరే వారు, మరో ఇద్దరు సాక్షుల సమక్షంలో తమ అభిప్రాయాన్ని, వివాహాల రిజిస్ట్రారుకు తెలియ పరిచి, సంతకాలు చేస్తే, ఆ వివాహం జరిగినట్లే లెక్క. వధూవరులు మైనర్లయితే, వారి కుటుంబ పెద్దలు కూడా హాజరై తమ అంగీకారాన్ని తెలియ పరచాలి. యీ తతంగము పూర్తయాక, వివాహ కాండ జరుగుతే జరగవచ్చు కాని, చట్టానికి అది ఎంతమాత్రమూ అవసరం కాదు.

ఇక విడాకులు కూడా, వివాహం వలెనే చాలా తేలిగ్గా పొందవొచ్చు. దంపతు లిద్దరూ రిజిష్ట్రార్ దగ్గిరికి వెళ్ళి, తమ వివాహాన్ని రద్దు చేయమని కోరుతే సరిపోతుంది; ఐతే విడాకుల్ని కోరే దంపతుల వయస్సు కనీసం 25 సం.లు ఉండాలి. ఒక వేళ దంపతులు అంతకన్న చిన్న వారైతే, వారికి విడాకుల్నిప్పించేందుకు న్యాయ స్థానాలున్నవి. న్యాయ స్థానాల్లో కూడా జటిలమైన పద్ధతులంటూ లేవు. 'నన్ను అవమాన పరిచాడు; మేమిద్దరం కలిసి జీవించటం అసంభవం!' అని చెపితే చాలు. జపానీయులు సాధించిన యీ విజయంలో మన సత్వమే గాక, దాన్ని కాపాడుతూ, అమలు జరపటం అడుగడుగునా కనిపిస్తుంది.

## వివిధ జాతుల్లో విడాకుల కారణాలు

చైనీయులు పురాతన వివాహ నిబంధనల్లో దంపతుల అంగీకారం మీద విడాకుల్ని పొందవొచ్చు. ఇదిగాక దంపతుల తల్లిదండ్రులు ద్వేషించటం, భార్య వ్యభిచరించ

టము, దంపతుల్లో ఏ ఒక్కరైనా రెండో వారిని శారీరకంగా బాధించటము, మొదలైన కారణాలవల్ల కూడా విడాకు లివ్వబడేవి.

ఎస్కిమోలలో సామాజిక జీవనం గట్టి పునాదుల్ని కలిగి వుంది. స్త్రీ పురుషులు విశేషమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తారు. వివాహాలూ, విడాకులూ స్వేచ్ఛా బద్ధాలై ఉన్నవి. ఫలితంగా ఏ దాంపత్యంలోనూ కఠినమైన పదజాలం వినరాదు. ఇష్టం లేకుంటే దంపతులు స్వేచ్ఛానుసారం విడిపోవొచ్చు. అనవసరంగా రభస జరగటం కానీ, వ్యభిచారం కానీ కనిపించదు.

పురాతన వెల్ష్ సాంప్రదాయాలను అనుసరించి స్త్రీ వివాహానికి ముందూ తర్వాతకూడా ఎంతో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తూండేది. క్రిష్టియన్ మతం కానీ, ఆంగ్ల చట్టాలు కానీ ఇలాటి స్వాతంత్ర్యాన్ని ఇవ్వలేదు. దంపతులు ఉభయులు కానీ, ఏ ఒక్కరు కానీ, దాంపత్యం తమకు ఇష్టంలేనట్టయితే, ఆ వివాహము రద్దు చేయబడేది; ఇదే పద్ధతి పురాతన ఐర్లండ్‌లో కూడా ఉండేది. స్త్రీలకు సామాజికంగా గొప్ప స్థానం వుండి, వైవాహిక బంధం దూముడిగా ఉండటంవల్ల, దంపతులు కొకరి నొకరు హారంగానూ, గుదిబండలుగానూ తయారయే వారు కాదు.

ఐతే విడాకులకు అతి స్వల్పకారణాలు కూడా చాలు ననటంలో మరో ప్రమాదం లేక పోలేదు. దంపతులు ఇష్టానుసారం విడిపోవటం, ఇందువల్ల సామాజికంగా ఎంతో అశాంతి ప్రబలటంకూడా జరుగుతుంది. స్వేచ్ఛ ఒక రకమైన 'బాధ్యత'గా పరిణమించినా, ఆ బాధ్యతలను దుర్వినియోగం చేసే అవకాశంకూడా ఏర్పడుతుంది. అమెరికాలోని కొన్ని రాష్ట్రాలలో విడాకుల్ని అతి స్వల్పకారణం మీద పొందగలగటం కద్దు. ముఖ్యంగా భర్తకన్న భార్య తేలిగ్గా విడాకుల్ని పొందుతుంది. విడాకుల్ని పొందటం ఆలస్యంగా ఆమె తనతోపాటు తెచ్చిన ఆస్థిపాస్థుల్ని కూడా తీసుకొని వెళ్ళటమే గాక, ఆమె వహించిన భార్యాత్వానికి ప్రతిఫలంగా కోర్టు వారు నిర్ణయించే భర్త ఆస్తిపాస్థుల్లోని భాగాల్నికూడా నష్ట పరిహారంగా పొందుతుంది!

## నాగరికత : వివాహం

శతాబ్దాలు గడుస్తూన్న కొద్దీ సామాజిక జీవనంలో మార్పులు వొస్తూనే ఉన్నవి. ఆర్థిక, రాజకీయ, శాస్త్రీయ పరిశోధనల ఫలితాలు నిత్య జీవితం మీద ప్రతిఫలిస్తూనే ఉన్నవి. మానవులు మారుతున్నారు; వారితోపాటే చట్టాలూ, సామాజిక నిబంధనలుకూడా మారుతూన్నవి.

వివాహానికి వధూవరుల అంగీకారం ఒక ముఖ్యాంగంగా పరిగణించబడటం మానవ చరిత్రలో చాలా కాలం క్రితమే ఆరంభమైంది. ఐతే ఒకప్పుడు బలాత్కార వివాహాలు (రాక్షస వివాహం) కూడా చట్ట సమ్మతంగానే ఉండేవి. ఇంగ్లండ్‌లో 7-వ హెన్రీ కాలంలో స్త్రీని బలాత్కారంగా వివాహ మాడటం నేరంగా చట్ట

నిర్మాణం జరిగింది. ఐతే ఆ చట్టం అంత కఠినంగా అమలు జరగలేదేమో? ఎందుకంటే 17-వ శతాబ్ద మధ్య భాగంలో తిరిగి మరో కఠినమైన చట్టం ప్రవేశ పెట్టబడింది.

ఎప్పుడైతే చట్టం వివాహానికి వధూవరుల అంగీకారం అవసరమని నిర్ణయించిందో, అదే విధమైన కారణం, దంపతుల అంగీకారంమీద విడాకు లివ్వటానికి ఎందుకు నిరాకరించాలి? యీ నిరాకరణ సాగినంత కాలం సామాజికమైన కుట్ర జరగటం, నరక సమానమైన దాంపత్యం కొనసాగటం, వ్యభిచారం మొదలైన నైతిక పతనం జరగటానికి ఆస్కారం వుంది. ప్రభుత్వాలు తమ బాధ్యతల్ని గుర్తించి విడాకుల చట్టాన్ని సవరించ వలసి వుంటుంది.

### విడాకుల పద్ధతి ఎలా ఉండాలి?

దంపతుల ఉభయుల అంగీకారం మీదా విడాకు లివ్వబడాలనేది దేశ దేశాలలోని మహా మేధావులందరూ ఒప్పుకున్న విషయమే! కొన్ని దేశాల్లో దంపతుల్లో ఏ ఒక్కరు విడాకులు కోరినా తేలిగ్గా ఇవ్వబడాలనే వాదనకూడా వుంది: ఎందుకంటె ఏ ఒక్కరి సహాయం లేకుండానూ దాంపత్యం సక్రమంగా నడవ నేరదు కదా!

(ఇంకా వుంది)

వెంటనే చదవండి!

ప్రపంచ ప్రసిద్ధి నందిన శరత్ బాబు రచనలకు అత్యుత్తమ తెలుగు అనువాదాలు.

| | |
|---|---|
| అరక్షణీయ | 0-8-0 |
| పరిణీత | 0-8-0 |
| బడదీది | 0-8-0 |


రూ. 2-0-0 లు పంపేవారికి పై మూడు పుస్తకాలు రిజిస్టరు పోస్టులో పంపుతాము.

ఏజెంట్లు 25% కమీషను మినహాయించుకొని కావలసిన కాపీలకు ముందుగా డబ్బు పంపాలి.

ఆలస్యంగా చేరిన ఆర్డర్లకు కాపీలు అందక పోవచ్చు. నేడే మీ ప్రతని రిజర్వు చేసుకోండి.

వివరాలకు:

జ్యోతి కార్యాలయం, మద్రాసు-17.




రైలు దిగాడు కృష్ణమూర్తి. ఇంజన్ చెడిపోవడంచేత మూడుగంటలు ఆలస్యంగా స్టేషనుకు వచ్చింది ట్రైన్. నడిరాత్రి అయింది. టిక్కెట్టు యిచ్చి స్టేషను బయటికి వొచ్చాక చేతిగడియారం చూసుకున్నాడు. పదకొండూ యాభై అయింది. స్టేషన్ చిన్నది కావడం చేతనూ, బండి అక్కడికి వొచ్చేప్పటికి సామాన్యంగా బాగారాత్రి పడుతూండటము వల్లనూ, జనంబహుకొద్దిమందే దిగుతారు. అందులోనూ ఆవూరు వెళ్ళేవాళ్లు ఒకళ్లిద్దరు కంటే ఉండరు. ఆరోజు కృష్ణమూర్తి ఒక్కడే!

ఇంటికి వెళ్లటానికి కనీసం రెండు మైళ్లు నడచి వెళ్లాలి. దారి సక్రమంగా ఉండదు. కాలువ కట్టమీదనుంచి నడిచి వెళ్లాలిదారిపొడుగునా చెట్లూ,పొదలూను. బండీ చేయించు కోవటానికి రాత్రుళ్లు ఆస్టేషనులో ఎద్దుబళ్లు వుండవు. కాలినడకనే బయలు దేరాడు కృష్ణమూర్తి.

అంతా కొత్తగా అగపడుతోంది.

...రెండు సంవత్సరాలైంది. తను అసలు బ్రతికి ఉన్నాడను కుంటారో, ఏనాడో ఏ రైలు క్రింద పడ్డో, నదిలో దూకో చనిపోయా డనుకుంటారో! మామయ్య అట్లాగే అనుకుంటాడు. ఆయనకు తొందర ఎక్కువ. ప్రతివిషయాన్నీ కాలమూ ధర్మమూ పాటించకుండా నిర్ణయిస్తాడు. అత్తయ్యకు అట్లా అనుకునేందుకు గుండె చాలదు. చెడును ఆలోచించట మంటే ఆవిడకు తగని భయం.

భార్య . జయలక్ష్మి ఏమను కుందో! ఎప్పటికైనా తన మొగుడు తనకోసం తిరిగి వొస్తాడను కుంటుందో - ఏ బైరాగుల్లో కలిసి పోయాడనే అనుకుందో! ఊళ్లో

వాళ్లు- ఇష్టమొచ్చినట్లుగా అనుకుంటారు. కాని తను జీవితంలో గొప్ప పొరపాటు చేశాడు. వెధవది పరీక్ష తప్పి నందుకు పారి పోవడమేమిటి? ప్రతి సంవత్సరమూ దేశంలో ఎన్ని లక్షల మంది విద్యార్థులు పరీక్షలు తప్పడంలేదూ! ప్యాసయ్యే వాళ్లకంటె తప్పేవాళ్ళ సంఖ్యే ఎక్కువగా! అటువంటప్పుడు తను తప్పడంలో చేసిన నేర మేముంది?

కాలం, కర్మం కలిసి రాకపోతే పరీక్ష తప్పొచ్చు. అంత చిన్న విషయాని కేవూరినీ, అయిన వాళ్ళనీ, స్నేహితుల్నీ వదిలిపెట్టి పారిపోవడమా? ...కాని తనకి అప్పుడు ఆపని చేయటమే ఉత్తమంగా తోచింది. చిన్నతనంలో తల్లిదండ్రులు పోయినతనను, 'మామయ్య' పేరు వింటేనే ప్రాణం అరి చేతుల్లోకి వొచ్చేంత భయాన్ని తనలో కలిగించి, చదువు చెప్పించి పిల్లనిచ్చి పెళ్లిచేసి ఒక ఇంటివాడిగా చేసిన మామయ్యను చూస్తే, పరీక్ష తప్పిన తనకి ఎంతో భయం వేసింది. రైలుస్టేషన్ దగ్గిర పత్రికలో పరీక్ష నంబరు లేక పోవడం చూసి ఆపళంగానే రైలు ఎక్కాడు తను. ఈ రెండు సంవత్సరాలూ తిరిగిన చోటు తిరక్కుండా తిరిగాడు-బ్రతుకుకోసం. కాని ఎంత హీనమైన జీవితం? ఏదిక్కూ మొక్కూ లేనివాళ్లు బ్రతక వలసిందేగాని-తన లాంటి వాడా? కొన్నాళ్ళు కూలికి ప్రయాణీకుల పెట్టెలు మోశాడు; మరి కొన్నాళ్ళు బూట్లు పాలిష్ చేశాడు: ఆఫీస్ బాయ్‌గా పని చేశాడు: హోటల్లో సర్వర్‌గా పనిచేశాడు; సైకిల్ షాపులో సైకిళ్ళు తుడిచాడు; ఒక షావుకారు గారి కారుకు క్లీనరుగా పనిచేశాడు, మరి కొన్నాళ్ళు-కిరణా కొట్లో సరుకులు అందించే పిల్లవాడిగా పనిచేశాడు. ఎన్నిరకాలైన ఉద్యోగాలు? ఎన్ని వేషాలు? ఎట్లా గడిపాడు యీ రెండు సంవత్సరాలు? ఎన్నితిట్లూ, దెబ్బలూ, ఛీత్కారాలో భరించాడు.

ఆ జీవితం పైన చచ్చేటంత రోత పుట్టింది. ఆకలైనప్పుడు, ఆకలి తీరేమార్గం కనుచూపు మేరలో అగుపించ నప్పుడు ఏడ్చేవాడు. ఇంటి దగ్గర భార్య, మామయ్యా, అత్తయ్యా ఉన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో తనమీద కోపం చల్లారక వుంటుందా? అనుకొని బయలు దేరాడు. మామయ్య ఎన్ని తిట్టినా, కొట్టినా భరించక తప్పదు. తను ఇంటికి చేరుకోక-దేశంమీద తిరిగి సాధించేది ఏమీ లేదు. జయలక్ష్మి ఎంతగా ఎదిగిందో! బాగా వొళ్ళువొచ్చి వుంటుంది. తను పారిపోయే నాటికి ఆరుమాసాల క్రితమే 'పెద్దమనిషి' అయింది. ఇంకో నెలా రెండు నెలలకి శోభనం చేద్దామని తాము అనుకున్నట్లు కూడా అత్తయ్య అన్నది. అప్పుడు తనవొళ్ళు అదోరకమైన ఆనందంతో ఎట్లా గరి పొడిచింది? నిత్యమూ బజారు సెంటరుల్లో, సినిమా హాలుల ముందూ, బస్సు స్టాపుల దగ్గరా, రైల్వేస్టేషనుల్లో అందమైన ఆడవాళ్ళను చూసినప్పుడూ - వాళ్ళనడకల వొయ్యారాలూ, రొమ్ముల విరుపులూ, కళ్ళ మెరుపులూ, చేతుల కదలికలూ, నాగరికత యొక్క ఔన్నత్యాన్ని చాటి, మగవాడి మగతనంమీద ఛాలెంజిచేసే ఫ్యాషన్ బుల్ డ్రస్సులూ చూస్తూ-తను పిచ్చివాడై పోయేవాడు.

తను రాత్రుళ్ళు నిద్ర పట్టక గచ్చునేలమీద తన్నుకులాడేవాడు. ఆ రోజు కనిపించిన ఆడవాళ్ళలో అందమైన ముఖాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని-పిచ్చి కలలు కనేవాడు...పిచ్చి ఆనందంలో తన్మయత్వం చెందేవాడు...జయలక్ష్మి. బాగావిచ్చిన గులాబిపువ్వులాగ ఎదిగి వుంటుంది. యవ్వనం పెట్టే గిలిగింతలకు వోర్చుకోలేక-పాపం...తనకోసం ఎంత బాధగా ఎదురు చూస్తూ వుంటుందో! కళ్ళు కాయలు కాచి వుంటాయి. జయలక్ష్మి...నిజంగా మీనాకుమారి లాగా వుంటుంది. ముక్కు అంత పొడుగూ వుంటుంది; ముఖం అంత పల్చగా, కళ్ళు అంత అందంగా, జుత్తు అంత నాజూగ్గా వుంటాయి. ఆమె హృదయం - తన కౌగలింత కోసం ఆరాటపడుతూ వుంటుంది కాబోలు! ఆమె మెత్తటి ఎర్రని పెదాలు-తన పెదాల స్పర్శకోసం బీటలు వారి వుంటాయి కాబోలు! జయలక్ష్మి...తనజయలక్ష్మి!!

కృష్ణమూర్తిలో సంపూర్ణ రూపును పొందిన యవ్వనపు పొంగు వల్ల వచ్చే ఉద్రేకం ఒక్కసారిగా శరీరాన్ని ఆవ


నేడే చదవండి.

'ధనికొండ' రచనలు

1. కళారాధకులు (కథలు)
2. అనాథ (కథలు)
3. దేవకన్య (కథలు)
4. సేవిక (పెద్ద కథ)

అత్యంత ఆకర్షణీయమైన ముఖ చిత్రాలతో విడుదలైనవి.

ఒక్కొక్కటి 8 అణాలు.

రూ 2-8-0 పంపిన వారికి పైనాలుగు పుస్తకాలూ రిజిష్టర్డు పోష్టులో పంపబడుతవి.

ఏజెంట్లకు మంచి కమిషన్.

జ్యోతి కార్యాలయం, మద్రాసు-17.

రించింది, క్యాల్షియం ఇంజక్షన్ చేసిన తోడనే వెచ్చదనం శరీరాన్ని గాఢంగా బలంగా ఒక్క సారిగా ఆవహించి నట్టు. వెంటనే సిగ్గుపడ్డాడు కృష్ణమూర్తి. వొళ్లు జలదరించింది.

మర్రి చెట్టు చీకటి నీడన నిద్రించే పక్షి పిల్ల ఉలిక్కి పడింది.

కృష్ణమూర్తి బూట్లు చప్పుడు చేసుకుంటూ వడిగా నడుస్తున్నాడు. నక్షత్ర కాంతికి చెదరిన చీకట్లు గోల పెడుతున్నాయి. కాలువ నీటిలో పడే తెలి మబ్బుల రేఖలు సాగిపోతున్నాయ్. పొలాల మీద కట్టి వేసిన గేదెలు ఏకాంతానికిబావురు మంటున్నాయ్. దూరంగా చీకట్లో మంటలు రేగుతున్నాయి. రైతులు వకుపు వండుతున్నారు కామోసు.

ఊరి సమీపానికి వొచ్చాడు కృష్ణమూర్తి. చెరువు గట్టు చెంత తుమ్మల తోపులోకి ప్రవేశించాడు. చీకటి నలుపు ఎక్కువైంది. కీచురాళ్ళ ధ్వని కలవర పెడుతూంది. తుమ్మల తోపులోంచి నడుస్తున్నాడు భయం భయంగా. రాత్రుళ్ళు తుమ్మల తోపులో నడిచేందుకు భయపడతారు ఆ వూరి ప్రజలు. తుమ్మల తోపులో కొరివి దయ్యాలు వుంటాయట. తుమ్మల తోపులో దారి కొట్టే దొంగలు వుంటారుట. ఒకసారి తుమ్మల తోపులో ఒకడ్ని హత్య చేశారు గూడాను.

హఠాత్తుగా సన్నగా పసిపిల్లవాని యేడ్పు వినవొచ్చింది. తక్కున ఆగి పోయ్యాడు కృష్ణమూర్తి. గుండెలో దడ జనించింది. కాళ్ళు శక్తిని సడలించుకో నారంభించాయి. ఆ యేడ్పు విన వొచ్చే శ కోసం వెతికాడు. పడమరగా విన వొచ్చింది. గబగబా అటు నడిచాడు కృష్ణమూర్తి. పసి హృదయపు ఆ వేదన ఎక్కువైంది. పిల్లవాని ఏడ్పు దగ్గరైంది. పసి పిల్లవాని యేడ్పుతో తుమ్మల తోపు ప్రతి ధ్వనించింది. తుమ్మలతోపులో రాత్రుళ్లు కాపురం చేసే పక్షులు మేల్కొన్నాయి.

చీకటి రేఖల్ని చీల్చుకొని-తుమ్మల తోపులో కాంతి రేఖ ఉదయించి నట్టు, అంత దూరాన పసి పిల్లవాని తెల్లని రూపు మెరిసింది. కృష్ణమూర్తి పిల్లవాని ముందు నిలబడ్డాడు. జేబులోంచి అగ్గి పెట్టె తీసి పుల్ల వెలిగించి చూశాడు. నిశ్చేష్టుడై నిలబడి పోయాడు. ఇంకా గుడ్లు తెరువని పసి గుడ్డు చెత్తలో పడుకో బెట్టబడి ఉన్నాడు.

దూరంగా కుక్కలు అరుస్తున్నాయి.

పసికందు గుక్క పట్టి 'కేవ్ కేవ్' అంటూ ఏడుస్తున్నాడు. ఏ తండ్రి పుణ్యం వల్లనో, ఏ తల్లి గర్భంలోనో నవమాసాలూ పెరిగి, యీ గడ్డ మీదదిగుమతియై కళ్ళు విడవడక ముందే తుమ్మలతోపులోకి విసర వేయబడ్డాడు. ఎంత దారుణం? ఆ మాతృహృదయం యీ దారుణ కృత్యానికి ఎట్లా లొంగిపోయింది! చేసినపాపం పులుము కొన్న అవినీతి, పొర్లాడిన బురదా-యీ పసికందు వల్ల లోకానికి వెల్లడి పోతాయనీ, బ్రతుకులో మాయని మచ్చ ఏర్పడుతుందనీ, ఆ మహాతల్లి యీ పసికందును తుమ్మలతోపు పరం చేసి పాపాన్ని పెంచుకుంది. మగవాడి వొళ్ళో వలపులు వొలకబోస్తూ కూర్చున్నప్పుడూ, మగవాడి పెదవులకు పెదవులు చేర్చేటప్పుడూ, మగవాడి ఆనందానికి 'కల్పతరువు' గా తయారయ్యేప్పుడూ-సంఘమూ పరువూ, ప్రతిష్ఠా, గౌరవమూ, బ్రతుకు

లోనిమచ్చా ఏమైయినా? వాటిని గురించి ఆలోచనే రాదు కాబోలు! పాపం... వాళ్ళుమటుకు ఏం చేస్తారు? ఇట్లాంటి అఘాయిత్యాలకుపాల్పడేట్టుఆడవాళ్ళను తయారు చేసేది మగవాళ్ళేగా! మెరపు లాంటి తాత్కాలికమైన తమకోర్కెల్ని తీర్చుకోనేందుకు-ఆడవాళ్ళని ఆకాశానికి ఎత్తుతారు; అర చేతిలో స్వర్గాన్ని సృష్టిస్తారు; పెదవుల్లో అమృతాన్ని చిలికిస్తారు; కళ్ళల్లో కైవల్యానికి హైరోడ్డు నిర్మిస్తారు. ఈ ఆడవాళ్ళు సంపూర్ణంగా వాళ్ళ హృదయాల్ని నమ్మి, అందమైన తమ శరీరాల మీది హక్కుల్ని వొదులుకుంటారు. సర్వస్వాన్నీ సమర్పిస్తారు... చివరకు ఇట్లాంటి అఘాయిత్యాలకు పాల్పడే దుస్థితికి లాగబడతారు. ఆడవాళ్ళు నీతి విషయంలో యింత హైన్య స్థితికి దిగజారటానికి, ప్రత్యేకమైన కట్టుబాట్లు నిర్మించబడటానికి చాలా భాగం మగవాళ్ళే కారణం.

పిల్లవాడు గుక్కబట్టి యేడుస్తూనే ఉన్నాడు.

కృష్ణమూర్తిహృదయంకరిగి కన్నీరుగా మారింది. ఆ పసికందును ఒళ్ళోకి తీసుకున్నాడు. తుమ్మలతోపులోంచి బయలుదేరాడు. ఇంకా దూరంగా కుక్కలు అరుస్తూనే ఉన్నాయి.

తుమ్మలతోపుదాటి కృష్ణమూర్తి కూరగాయల కోటమ్మ ఇంటి దగ్గరకొచ్చాడు; పిల్లవాడ్ని అట్లాగే అరచేతుల్లో పెట్టుకొని. ఆ ఇల్లే ఆ గ్రామానికి మొట్టమొదటిది. అతనికి-ఆ పసికందును చూసి మామయ్య ఏమనుకుంటాడు? అత్తయ్య ఆశ్చర్యపోతుందా! భార్య అనుమానపడుతుందా? మొదలైనప్రశ్నలుకలుగనే కలుగలేదు.

రథశాలఅరుగుమీదపడుకున్నకుక్కలు 'భౌ భౌ' మంటూ మీదకు ఉరికాయి. కృష్ణమూర్తి 'ఉష్' అని పారద్రోలాడు.

ఇనప్పెట్టె ముందు మంచం వేసికొని పడుకొన్న కోమటి కొత్త సుబ్బయ్య-కుక్కల అరుపులు విని గబుక్కున లేచి వీధి కిటికీలోంచి చూశాడు. ఎవరో వ్యక్తి అరచేతుల్లో పిల్లవాడ్ని పెట్టుకొని నడిచి వెళ్లటం చూశాడు.

కృష్ణమూర్తి తన ఇంటి ముందు ఆగి, తలుపు తట్టాడు. 'అత్తయ్యా!' అని కేక వేశాడు.

అత్తయ్య తలుపు తీసింది.

ఎదురుగ్గా — అల్లుడు కృష్ణమూర్తీ, అతని చేతుల్లో దూదిపింజ లాంటి పసికందు!

కళ్లు నులుముకుని బాగా చూసింది.

ఆవిడకు మూర్ఛ వొచ్చినంత పనైంది గడ్డముమీసాలు విశృతంగా పెరిగి వుండని కారణాన, ఆవిడ సులభంగానే అల్లుడ్ని గుర్తించింది. అతని చేతుల్లో కనుగుడ్డు విప్పుకొని పసిపిల్లవాడు వుండడం-ఆవిడ మూర్ఛకు ముఖ్య కారణం. ఆవిడకు తలతిరగగా-తూలి తలుపు మీద వాలింది.

ఆ పసికందు వంక చూస్తూ నిలబడ్డాడు కృష్ణమూర్తి. తుమ్మలలో ఉదయించిన బాలుడు నిద్రిస్తున్నాడు.

అల్లుడ్ని లోపలకు రమ్మనేందుకు మాటలు వెలువడలేదు అత్తయ్యకు. కృష్ణమూర్తి లోపలకు నడిచాడు.

'తుమ్మలతోపులో దొరికాడు. ఏ మహా తల్లి కని చేతులతో చంప లేక-తుమ్మలతోపులో చీకట్లో కర్మకు వొది

లిందో! దారిన పోతున్న నన్ను పిల్చి—'నా గతి ఏమిటి?' అని ప్రశ్నించాడు. నా హృదయం ద్రవించింది. ఏమైనా అనుకోండి అత్తయ్యా, పీడ బ్రతుకును చూడవలసిందే! మామయ్య నిద్రపోతున్నాడా?'

'మామయ్య' అనగానే అత్తయ్య బావురుమన్నది.

కృష్ణమూర్తి ఆశ్చర్య పడ్డాడు.

అతను పారిపోయిన ఆరు నెలలకే టైఫాయిడ్ జ్వరం వొచ్చి చనిపోయాడట. కృష్ణమూర్తి కొంచెం సేపు అత్తయ్యను ఓదార్చాడు.

'జయలక్ష్మి యేదీ?'

అంత దుఃఖంలోనూ అత్తయ్య ముఖం కలవరంతో కదలటాన్ని గమనించాడు కృష్ణమూర్తి. అతనికి అర్థం కాలేదు.

'జయలక్ష్మి-ఎదీ!' అన్నాడు మళ్ళీ.

'దానికి...దానికి...'

'ఏమిటి-దానికి? ఏంజరిగింది?' ఆదుర్దాగా అన్నాడు కృష్ణమూర్తి.

'ఎందుకులే నాయనా...'

'అంత కలవర పడతా వెందుకూ?'

'కలవర మేముంది?...వారం రోజులనుంచీ జ్వరం...గదిలో ఉంది. నీ కోసం...'

గదిలోకి పరుగెత్తాడు కృష్ణమూర్తి.

ఆ పసి పిల్లవాడ్ని మంచంలో పడుకోబెట్టింది అత్తయ్య.

గదిలో జయలక్ష్మి మంచంలో పడుకొని ఉంది. లోతైన ఆమె కళ్ళనించి నీళ్లు కారుతున్నాయి. గొంతు వరకూ దుప్పటి కప్పుకొని ఉంది. జుత్తు రేగి ఉంది. బుగ్గలు పీక్కుపోయి ఉన్నాయి. ముఖం చాలా బలహీనంగా తయారైంది. ముఖం నిండా చెమట.

'ఒంట్లో ఎలా ఉంది?' అన్నాడు కృష్ణమూర్తి.

ముఖం పక్కకు తిప్పుకుంది లక్ష్మి. భర్త కళ్ళల్లోకి సూటిగా చూసే ధైర్యం లేనట్టు ప్రవర్తించింది. తన మీద కోపం కాబోలు అనుకున్నాడు కృష్ణమూర్తి.

'వొచ్చానుగా. నీకు ఇంకేం భయం అక్కరలేదు. దుఃఖించబోకు, నీజబ్బు త్వరలో నయమవుతుందిలే. నేను మంచి డాక్టర్ని మాట్లాడతాను' అన్నాడు కృష్ణమూర్తి ధైర్యాన్ని చెబుతూ.

జయలక్ష్మి కళ్లనించి జలజలా నీళ్ళు రాలుతున్నాయి. కృష్ణమూర్తి ఆమెను ఓదార్చుతున్నాడు. అత్తయ్య ఎందుకో ప్రాణాల్ని అరిచేతులో యిరికించుకొంది. ఆవిడ గుండె యింత వేగంతో కొట్టుకుంటూన్నదని చెప్పేందుకు వీలు లేదు.

మంచంలోని పసిపిల్లవాడు కళ్ళు తెరవలేదు.

★

మరునాడు ఉదయం పరీక్ష తప్పి పారిపోయిన కృష్ణమూర్తి వొచ్చాడని వూరంతా తెలిసిపోయింది. అతన్ని చూడటానికి అతని స్నేహితులు వొచ్చారు. ఇన్నాళ్ళు ఎక్కడ ఉన్నావని అందరూ వింతగా అడిగారు. కృష్ణమూర్తి అందరికీ సమాధానాలు చెప్పాడు.

తుమ్మల తోపులో అర్ధరాత్రి-చీకటిలో తనకు దొరికిన పసికందును కృష్ణమూర్తి దయార్ద్ర హృదయుడై ఇంటికి తీసికొచ్చాడన్న వార్త, ఊరంతా ప్రాకటానికి యింకో రోజు పట్టింది. ఆ పసికందును చూచేందుకు ఆడవాళ్ళు, మగవాళ్లు ముసలీ ముతకా పిల్లా జల్లా అంతా

ఎడతెరిపి లేకుండా రెండు రోజులు వింతగా చూశారు. ఆ పిల్లవాడు దొరికిన విధానాన్ని విడమర్చి చెప్పలేక కృష్ణమూర్తి గొంతు బొంగురు పోయింది. చూడవొచ్చిన జనం యిచ్చే అభిప్రాయాలు, చేసే విమర్శలూ వినలేక కృష్ణమూర్తి చెవులు దిబ్బళ్లు వేశాయి.

'ఎంత దారుణమమ్మా! మరీలోకం పాడైపోతున్నది.'

'ఆ మహా తల్లికి పాపపుణ్యాలు విచారించే భగవంతుడు పైన వున్నాడనే విషయము ఎట్లా తెలియక పోయిందో! ఆడవాళ్ళకు మరీ విపరీతపు బుద్ధులు పుడుతున్నాయి.'

'ఎంతఘోరానికి తెగించింది? ఆ తల్లి హృదయం రాయా? పాషాణమా? అంత పోషించలేని తల్లి ఎందుకని భూమి మీద పారవేయాలో_'

ఇట్లాంటి అభిప్రాయాలూ, విమర్శలూ చాలా వెలువడ్డాయి ప్రేక్షకుల దగ్గర్నుంచి.

ఆ పసి కందును పెంచడం పెద్ద సమస్యగా ఏర్పడింది కృష్ణమూర్తికి. ఇద్దరు ముగ్గుర్ని సలహాలు అడిగాడు. ఒకాయన సముచితమైన సలహాయే చెప్పాడు. 'ఆ వీధి చివర రామ సుబ్బయ్య భార్య రాజేశ్వరమ్మ వారం రోజుల క్రితం ఒక పిల్లవాడ్ని కన్నది. మూడురోజులకే ఆ పిల్లవాడికీ యీ ప్రపంచానికీ ఋణం తీరింది. ఆమె సహృదయురాలు. దీనుల యెడ ఆమె హృదయం పరిపూర్ణమైన కరుణతో నిండి వుంటుంది. ఈ పసికందుకు పాలుయిచ్చేందుకు ఒప్పుకోవచ్చు.'

కృష్ణమూర్తి అత్తయ్య చేత అడిగించాడు. రాజేశ్వరమ్మ అంగీకరించింది.

క్రమంగా రోజులు దొర్లుతున్నాయి·

కృష్ణమూర్తి ఇంటి వ్యవహారాల్ని చక్కబెట్టుకుంటూ-స్నేహితులతో కలిసి కులాసాగా కాలం గడుపుతున్నాడు.

అత్తయ్య నిత్యమూ ఉదయమూ, సాయంత్రమూ పసి పిల్లవాడ్ని రాజేశ్వరమ్మ దగ్గరకు తీసికెళ్ళి పాలుయిప్పించుకొని వస్తోంది.

జయలక్ష్మి మామూలు మనిషి అయ్యేందుకు ప్రయత్నాలు జరుగుతోంది. ఆమె జబ్బు నయమైంది. క్రమేపీ పిల్లవాడి పోషణ-నిత్యమూ వేళకు స్నానం చేయించటమూ, కళ్ళకు కాటుక పెట్టడమూ, ముఖానికీ వొంటికీ పౌడరు అద్దటమూ, తలకు ఆముదము పెట్టడమూ, మధ్యాహ్నం పూట గొల్లభామ మార్కు డబ్బా పాలు వేడి నీళ్లలో కలిపి పీక సీసా ద్వారా పట్టడమూ మొదలైన పనుల్ని, తన బాధ్యతగా యెంచుకొని చేస్తూ వుంటుంది. అప్పుడప్పుడు జయలక్ష్మి పిల్లవాడ్ని బిగియార రొమ్ములకు అదుముకొని, మనసారా వొళ్లంతా ముద్దు పెట్టుకొని, మాతృమూర్తి లాగా అవ్యక్తంగా విపరీతమైన ఆనందాన్ని పొందుతూ వుంటుంది. రాత్రుళ్ళు తన ప్రక్కలోనే పడుకో బెట్టుకుంటుంది. నిద్రపోని సమయాల్లో 'జో' కొడుతూ జోలపాటలు పాడుతూ, ఊయెల వూపుతూ నిద్రపుచ్చుతుంది.

జయలక్ష్మి ఎత్తుకున్నా, జయలక్ష్మి ప్రక్కన పడుకున్నా, జయలక్ష్మి ముద్దాడినా, జయలక్ష్మి రొమ్ములకు అదుముకున్నా, జయలక్ష్మి నవ్వినా - ఆపసిపిల్లవాడు ఏడ్వడు. నవ్వుతాడు. సిగ్గుపడతాడు. చేతులూ, కాళ్ళూ అందగా ఆడి

స్తాడు. ఆమెకు బాగా అలవాటు పడి పోయినాడు.

కృష్ణమూర్తి అప్పుడప్పుడూ నవ్వు తాలుగా అంటూ వుంటాడు, ఆ పసిపిల్లవాడు జయలక్ష్మికి అనుకు—పోవడం చూసి-

'నిన్నే తల్లి అనుకుంటున్నాడేమో!'

జయలక్ష్మి సిగ్గుతో మాట్లాడని మల్లె పువ్వు ముడుచుకు పోతుంది

కృష్ణమూర్తి గాలికి వూగే అరటి మొక్కలా నవ్వేసుకుంటాడు.

ఒకరోజు మధ్యాహ్నం నిద్ర పోతూన్న కృష్ణమూర్తికి పీడకల వొచ్చి-హఠాత్తుగా లేచాడు. ముఖం కడుక్కోవటంకు పెరట్లోకి వెళ్ళాడు. పెరట్లో ఉండి చూస్తే వంటగది బాగా అగపడుతుంది. ఎందుకో భోక్కునచేత బుచ్చుకోబోతున్న కృష్ణమూర్తి, అనాలోచితంగా వంట గదివైపు చూశాడు. ఆగిరి పోయాడు.

వంట గది మండిగం ప్రక్కన భార్య జయలక్ష్మి కూర్చుని, వొళ్ళో పని పిల్ల వాణ్ణి పడుకో బెట్టుకొని, పాలు యిస్తోంది. పిల్లవాడు ఉషారుగా ఆమె గారి మెడలో ఉన్న గోవర్ధనపు గొలుసును బుల్లి చేతితో గట్టిగా పట్టుకొని-పాలు త్రాగుతున్నాడు.

కృష్ణమూర్తి తల తిరిగి పోయింది.

కళ్ళు చీకటి తెరల్ని కప్పుకున్నట్టు గజిబిజిగా బాధపడ్డాయి. భూమి కంపించినట్టు తోచింది. క్షణం నిల్చోలేక పోయాడు. వాంతి వొచ్చేంత వికారం శరీరంలో కలిగింది. ఇంట్లోకి వొచ్చాడు. గదిలో పడుకొని యేమ్వా వారం భించాడు.

అత్తయ్య పురాణ శ్రవణానికి గాను పురాణం వారి ఇంటికి వెళ్ళింది.

ఏమిటీ? భార్య నిజంగా పిల్ల వాడికి పాలు యిస్తూందా?...అట్లా నటిస్తూందా? నటించటమైతే పిల్లవాడు అంత ఉషారుగా ఎందుకుంటాడు?... అసలు తన భార్య పాలు ఇవ్వటమేమిటి?...తమకు యింకా శోభనం కూడా కాలేదే! ఏమిటి ఈవిపరీతం?... తనుకల గంటున్నాడా? నిద్ర ముఖానికి అట్లా అగపడిందా? ఏమో...మళ్ళీ చూసి వొస్తే!

మెల్లగా చప్పుడు కాకుండా వెళ్ళి కిటికీలోంచి చూశాడు. అదే దృశ్యం... జయలక్ష్మి వొళ్ళో పని పిల్లవాడు... తుమ్మలంలో పుణ్యం దొరికిన పిల్లవాడు... తల్లీ దండ్రీ లేని పిల్లవాడు...జయలక్ష్మి తల్లిలాగ పాలు యిస్తూ పిల్లవాని తల మీది వెంట్రుకలు సర్దుతున్నది-

కృష్ణమూర్తి తలలో ఆలోచనలు పదును కత్తులు విచ్చుకున్నట్టు విచ్చుకున్నాయి. తనకు పిచ్చియెత్తే ప్రమాద స్థితి సంభవించ బోతున్నట్టు గ్రహించాడు.

పడమరగా సూర్యుడు ఉదయిస్తే-

పట్ట పగలే ఆకాశాన నక్షత్రాలు అగుపిస్తే-

భూమి గుండ్రంగా తిరగడం మానివేస్తే-

ఎంత ఆశ్చర్యం? ప్రకృతిలో ఎంత మార్పు? అట్లాగే శోభనం కాని భార్య-పని పిల్లవాడికి పాలు ఇవ్వడం అద్భుతమైన ఆశ్చర్యాన్ని కలిగించింది కృష్ణ

మూర్తికి. ఇంట్లో క్షణం కూర్చో లేక పోయాడు- బజారు కెళ్ళాడు.

రథశాల అరుగుమీద కూర్చున్న చలపతీ, దశరథ రామయ్యా రహస్యంగా మాట్లాడు కుంటూ-కృష్ణమూర్తి వంక అదోరకంగా చూశారు: 'నిన్ను గురించే మాట్లాడు కుంటూన్నది' అన్నాడు. కృష్ణమూర్తికి ముఖం చెక్కేసినట్టు అయింది. గబగబా ముందుకుసాగి వెళ్ళాడు. కొంత దూరం వెళ్ళాక ముస్సబు ఎదురైనాడు. కన పడ్డప్పుడల్లా ఎంతో ఆప్యాయతగా పలుకరించే ముస్సబు ముఖాన్ని ప్రక్కకు తిప్పుకొని గబగబా ముందుకు నడిచి వెళ్ళాడు. కృష్ణమూర్తి ముఖం మరీ నల్లనైంది.

క్రమంగా కృష్ణమూర్తికి అర్ధమవుతూ రాసాగింది - తనచుట్టూ ఊళ్ళో ఒక వింత వాతావరణం అలముకొని ఉన్నట్టు, తను ఏదో ఒక అప్రతిష్ఠాకరమైన పరిస్థితుల పద్మవ్యూహంలో పడికొట్టు కుంటూన్నట్టు, తనమీద ఊళ్ళో వాళ్ళకి చాలా నీచాభిప్రాయాలు ఉన్నట్టు, గ్రహించటానికి రెండు రోజులు పట్టాయి కాని తనుసంఘ విద్రోహకరమైన ఏపనిని చేశాడో, ఇతరులకు అపకారాన్ని కలిగించే ఏపనికి ప్రోత్సాహాన్ని యిచ్చాడో, తనవల్ల ఎవరు దెబ్బతిన్నారో - అంతుబట్టకుండా వుంది. తనుచేసిన తప్పుపని ఏమిటి? ఎందుకు తనని ప్రజలు యింత ఎబ్బెట్టుగా చూస్తున్నారు? కృష్ణమూర్తికి ఏ

లైంగిక విజ్ఞానం కొరకు చదివి తీరవలసిన పుస్తకాలు.
అత్యుత్తమ శాస్త్రీయ గ్రంథాలకు సామాన్యులకు
కూడా అర్థమయ్యే తెనిగింపు.

| | | | |
|---|---|---|---|
| 1. | సిగ్గు | హావలాక్ ఎల్లిస్ | రూ. 1-0-0 |
| 2. | ఋతుధర్మాలు | .... | రూ. 1-0-0 |
| 3. | లైంగిక విజ్ఞానం | .... | రూ. 1-0-0 |
| 4. | ప్రణయకళ | .... | రూ. 1-0-0 |
| 5. | స్వరతి | .... | రూ. 1-0-0 |
| 6. | గర్భనిరోధం (సచిత్రం) | | రూ. 0-8-0 |

పుస్తకాల ఖరీదుకు రూ. 0-8-0 అధికంగా పంపిన వారికి, రిజిష్టర్డ్ పోస్టులో పంపబడుతవి.

అభిసారిక కార్యాలయం,
4, బాలుమొదలి వీధి. మద్రాసు, 1.

సమాధానాలూ చిక్కలేదు. తనకు తాను ఎట్లా సమాధాన పడాలో అర్థం కాలేదు. తను ఊళ్ళో లేని రెండు సంవత్సరాల్లో ఏవో కొన్ని విషయాలు జరిగి వుంటాయనే బలమైన నిర్ణయానికొచ్చాడు.

ఇంట్లో కూడా అసహజమైన వాతావరణమే కళ్ళకు కట్టింది. అతన్ని చూస్తుంటే అర్ధాంగి యైన జయలక్ష్మి కళ్ళల్లో భయపు పొగలు రేగుతున్నాయి. అత్తయ్యకు ముఖంలో అలజడి తాండవిస్తోంది. ఏదో తప్పు చేసినట్టూ, ఆ తప్పును భర్త కనుక్కున్నట్టూ - జయలక్ష్మి భయపడుతున్నదా? తనకూతురు అట్లాంటి తప్పుపని చేయటానికి తనుకూడా కారణమైనట్టు అత్తయ్య అలజడి పడుతున్నదా?

ఈ ముసుగులో భాగవతాన్ని పటాపంచలు చేయాలనుకున్నాడు కృష్ణమూర్తి. అతనికి రానురాను జీవితమే ఏమీ అర్థం కాకుండా పోతోంది. ఒకరోజు తొమ్మిది గంటలకు అంతరంగిక మిత్రుడైన విష్ణువర్ధన రావును నిలవదీసి అడిగాడు-తను ఊళ్ళో లేని రెండు సంవత్సరాలల్లో తన కొంపలో జరిగిన విషయాలను సాకల్యంగా వివరించి చెప్పవలసిందని-

విష్ణువర్ధనరావు జంకాడు.

జంకవలసిన పనిలేదని ఖచ్చితంగా చెప్పాడు కృష్ణమూర్తి.

'నేను చెప్పే విషయాలకు నువ్వు బాధపడి నన్ను ద్వేషిస్తే కాదు. అందుకే యింతగా సందేహిస్తున్నాను. ఒకొక్కప్పుడు మనం కలలో కూడా సంభవించవనుకున్న విషయాలు సంభవించవచ్చు. మనం మనసారా, ఆత్మీయులుగా నమ్మినవాళ్లు మోసం చేయవచ్చు. ఏమంటావు?' అన్నాడు విష్ణువర్ధనరావు ఉపోద్ఘాతంగా.

'బాధపడను. నువ్వు అబద్ధం చెప్పవనే నమ్మకం నాకు సంపూర్ణంగా వుందిగా. అటువంటప్పుడు నువ్వు నాకు బాధ కలిగించే విషయాలు చెప్పినా ఎందుకు ద్వేషిస్తాను?' అన్నాడు కృష్ణమూర్తి.

'కృష్ణమూర్తీ! 'నీతి' - 'అవినీతి' అనేవి వ్యక్తియొక్క విలువనూ, సంఘంలో స్థానాన్నీ నిర్ణయిస్తాయనే సంగతి కొత్తదికాదు. మగవాళ్ళ విషయంలో వీటికి పెద్ద ప్రాముఖ్యత లేకపోయినప్పటికీ, మనదేశంలో—ఆడవాళ్ళు—యీ విషయాల్లో అతి జాగ్రత్తగా మెలగవలసిన ఆగత్యం ఎంతైనా ఉంది. మాంగల్యం మెడలో ఉన్నా లేకపోయినా, వయస్సులో ఉన్న స్త్రీ మగవాళ్ళను నమ్మేటప్పుడు, సంఘమూ, పరువూ, మర్యాదా, నీతీ, మొదలైన గొప్ప విషయాల్ని, వాటి విలువలలోతుల్ని దృష్టిలో పెట్టుకోవటం ముఖ్యం.

అట్లా దృష్టిలో పెట్టుకోని వాళ్ళ బ్రతుకుల్లోని తప్పటడుగులు కారుచీకటి రేఖల్లాగా వాళ్ళజీవితాల్ని చుట్టుకుంటాయి. ఆ రోజు నువ్వు పరీక్ష ఫలితాలు చూసుకొనేందుకు పేపరు కోసం స్టేషనుకు వెళ్లావు. కానీ తిరిగి రాలేదు. పరీక్ష తప్పి పారిపోయావు- మామయ్యకు దడిచి అనుకున్నారంతా. వాస్తవం కూడా అంతే. నెలకో, రెండు నెలలకో తిరిగి వొస్తావని అనుకున్నారు. కాని రాలేదు. నాలుగు మాసాలు గడిచాయి. మీ మామయ్య 'పత్రిక' లో అడ్వర్టయిజ్‌మెంట్ కూడా చేయిం

చాడు. కాని నువ్వు రాలేదు. మీ మామయ్య టైఫాయిడ్ జ్వరంతో ఇరవై రోజులు బాధపడి చనిపోయాడు. తర్వాత కూడా నువ్వు తప్ప తెలుసుకొని ఇంటికి రాలేదు. మీ ఇంటికి మగ దిక్కు లేక పోయింది. మగ దిక్కు లేని సంసారాలకు సంఘంలో ఎట్లాంటి స్థానం వుంటుందో నీకు తెలియనిది కాదు.

'మీ మామయ్య చనిపోయిన రెండు మాసాలకు కామోసు రామచంద్రరావు అనే ఒక యువకుడు కొత్తగా ఊళ్లో హైస్కూలుకి మ్యాథమాటిక్స్ టీచరుగా వొచ్చాడు. అతనికి పెళ్లికాలేదు. రూము కోసం తిరుగుతూ వుండగా--- మీ అత్తయ్య తన ఇంట్లో ఉత్తరపు భాగాన ఉన్న రూము ఖాళీచేసి నెలకు ఎనిమిది రూపాయలకు అద్దెకు ఇచ్చింది. ఆ రూములో వుంటున్నాడు రామచంద్రరావు. అతను మిక్కిలి సుందరాకారుడు. అయినా నెమ్మదస్తుడు. క్రమంగా ఆ గదిలో వుంటూ మీ అత్తయ్య మంచితనాన్ని సంపాదించాడు. తర్వాత వయస్సులోకి వొచ్చి పారిజాతపుష్పంలాంటి జయలక్ష్మిని వలలో వేసికొనేందుకు పత్రికలూ, పుస్తకాలూ, ఇచ్చేవాడు. ఆమెను ఆకర్షించేందుకు పూటకో డ్రస్సు వేసేవాడు. ముఖం మీద చెమట బిందువును చేరనిచ్చే వాడు కాదు.

'సినిమా పాటలు ప్రాక్టీసుపెట్టే వాడు. నాటకాల్లోని ప్రేమ సంభాషణల్ని 'రిహార్సల్' చేసేవాడు. ఎట్లానైతేనేం జయలక్ష్మి హృదయంలో వలపును రేకెత్తించాడు. వసంత గానం అలపించాడు. నువ్వు చేసిన తెలివి తక్కువ పని ఎట్లాంటి దారుణ పరిణామాలకు దారి తీసిందో గమనించావా? జీవితాంతమూ సహధర్మచారిణిగా, పవిత్రహృదయంతో మెలగవలసిన భార్య, వక్రమార్గాన జీవితాన్ని ముందుకు నెట్టాలని చూసింది. యవ్వనం ఆమెను అట్లా ఆడించింది. జయలక్ష్మి. అత్తయ్య-నువ్వు చనిపోయావని గట్టిగా నమ్మారు. అత్తయ్యకు జయలక్ష్మికి మళ్ళీ పెళ్ళి చేయాలనే ఆలోచన ఉంది. మగదిక్కు కోసం-తాను యీ లోకాన్ని విడిచాక-జయలక్ష్మి ఒక్కతే ఎట్లా బ్రతక గలుగుతుందని ఆమె ఆలోచన. జయలక్ష్మికి కూడా రామచంద్రరావును భర్తగా పొందాలని ఉంది. అతను ఆమెను పెళ్లాడతానని. చేతులో చేయి వేసి చెప్పాడు.

'ఆ దుర్మార్గుడ్ని నమ్మి, ఆమె తన శరీరాన్ని అతని కోర్కెలకు అర్పించేందుకు వెనుకాడలేదు. రామచంద్రరావు 'పెళ్లి' వాయిదాలమీద నడుపుతూ జయలక్ష్మిని అనుభవించాడు. ఆమె గర్భం ధరించింది. ఆ విషయం ఊళ్లో వాళ్ళకి చాలమందికి తెలియదు. అత్తయ్యా' జయలక్ష్మి పెళ్లి చేసుకోమని పట్టుపట్టారు. రామచంద్రరావు వీళ్ళకు తెలియకుండానే ట్రాన్స్ఫర్ ఆర్డరు తెప్పించుకున్నాడు. చివరకు వీళ్ళకు చెప్పకుండానే కొంత సామాను వొదిలేసి వూరు వొదిలి వెళ్ళి పోయాడు. జయలక్ష్మి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. అత్తయ్య తిట్టి పోసింది. జయలక్ష్మికి ఆరో నెల వొచ్చిన దగ్గర్నుంచీ ఏదో జబ్బు వొచ్చిందని బయటకు రానివ్వ

కుండా, డాక్టరు నారాయణ స్వామికి డబ్బు యిచ్చి రహస్యం బయట పడకుండా చేసింది అత్తయ్య. కాని రహస్యము దాగుతుందా? నువ్వు వొచ్చేరాత్రే జయలక్ష్మి పిల్లవాడ్ని కన్నది. మీ అత్తయ్య ఆ పిల్లవాడ్ని అర్థరాత్రి తీసికెళ్ళి తుమ్మల తోపులో విడిచిపెట్టి వొచ్చింది.

ఆ రాత్రి నువ్వు వొస్తూ వొస్తూ పిల్లవాడ్ని ఇంటికి తీసుకువొచ్చావు. అసని కందు జయలక్ష్మి పుత్రుడే. ఆ విషయం ఇప్పుడు ఊళ్లో అందరికీ తెలిసింది.' అని ముగించాడు విష్ణువర్ధనరావు.

కృష్ణమూర్తి అంతా విన్నాడు. అతని ముఖ తీవ్రతను పరికించ లేకపోయాడు. విష్ణువర్ధనరావు ఓదార్పే తీరు అంతు పట్టలేదు. క్రిష్ణమూర్తి అక్కడ్నుంచి వెళ్ళాడు గంభీర వదనంతో. దేవాలయపు మండపం మీద కూర్చున్నాడు చీకట్లో. రాత్రి పది గంటలు అవుతున్నది. కర్తవ్యం కోసం కొట్టుకులాడుతున్నాడు.

తను ఇప్పుడేం చెయ్యాలి?

ఆ రామచంద్రరావుగాడి మీద పగదీర్చుకోవాలా?

జయలక్ష్మిని నరికి పోగులుగా పెట్టాలా?

విడుదలైనవి: నేడే చదవండి!

అడుగడుక్కూ ఊపిరి బిగపట్ట వలసినంత సస్పెన్సుతో మిమ్ము మంత్ర ముగ్ధుల్ని చేసే అత్యద్భుత డిటెక్టివ్ రచనలు. పాఠక లోకానికి చిరపరిచితులైన 'దాసు'గారి రచనలు.

1. కాంతం–కనకం (దివ్వర్ణ ముఖచిత్రం)
2. నడిచి పోయిన శవం (త్రివర్ణ ముఖ చిత్రం)
3. మాయమైన మనిషి (త్రివర్ణ ముఖచిత్రం)

ఒక్కొక్కటి 8 అణాలు. రూ 2-0-0 పంపిన వారికి పైమూడు పుస్తకాలూ రిజిష్టర్డు పోష్టులో పంపబడుతవి.

జ్యోతి కార్యాలయం మద్రాసు–17.

ఆ పిల్లవాడ్ని...ఆ పిల్లవాడ్ని పీక పిసికి బావిలో విసరి వేయాలా?

ఏం చేయాలి? ఎట్లా చేస్తే మంచిది?

తన కర్తవ్య మేమిటి?

ఈ అవినీతి తాలూకు పాపఫలితాన్ని ఎట్లా రూపు మాపుకోవాలి? తను నిజాయితీ పరుడుగా, నీతిమంతుడుగా సంఘంలో తల ఎత్తుకొని ఎట్లా తిరగాలి? ఏమిటి కర్తవ్యం? జయలక్ష్మి...ఎంత అవినీతిగా ప్రవర్తించింది! యవ్వనంలో కళ్ళు మూసుకుపోయి వెనకా ముందూ చూడకుండా, భర్తా, లోకమూ, పరువూ, గౌరవమూ, సంఘమూ, పాపమూ, ఉన్నాయనే గమనించకుండా, ఆ మోసగాడికి వొళ్లు అప్పజెప్పింది. కడుపు తెచ్చుకుంది. దాని భర్తయైన తను, జీవితాంతమూ తన క్రింద బానిసగా చేసుకున్నతను-ఎట్లా సహించటం? న్యాయమేనా? ధర్మమేనా? అది యవ్వనపు పొంగువల్ల కుటుంబ గౌరవాన్ని ఆలోచించకుండా చిందులు త్రొక్కింది. దాన్ని తను క్షమించడమా? ఊహుం! ఎంతనటన! తనమీద ప్రేమ ఉన్నట్టు, ఇన్నాళ్ళూ తన కోసం కళ్లు కాయలు కాచేట్టు ఎదురుచూస్తున్నట్టు, తననే జీవితేశ్వరుడిగా సంపూర్ణంగా భావించినట్టు,- ఎంత నటన? సంసార స్త్రీలకు కూడా మగవాళ్ళని తబ్బిబ్బు చేసేట్టు నటించడము వొచ్చు కామోసు!...ఆ పిల్లవాడ్ని రూపుమాపితే సరి. వాడ్నితన కొడుకుగా భావిస్తూ తను పెంచలేదు. రామచంద్రరావు వల్ల పుట్టినవాడు తన కొడుకు ఎట్లా అవుతాడు? యీ ఘోరాన్నితను సహించ లేదు. అది వాడ్ని ప్రేమను వొలకబోస్తూ రొమ్ములకు గట్టిగా హత్తుకోవటాన్ని తను చూడలేదు. ఆ పసివాడ్ని తక్షణం గుద ముట్టించాల్సిందే! అదే తన కర్తవ్యం!

కృష్ణమూర్తి దేవాలయపు మండపం మీద నుంచి లేచాడు స్థిర సంకల్పంతో. గబగబా ఇంటికేసి నడిచాడు. చీకటి. రోడ్డుమీద జన సంచారం లేదు. ఊరు గాఢంగా నిద్ర పోతోంది. దాదాపు అర్ధరాత్రి అయింది.

ఇంట్లోకి వెళ్ళాడు కృష్ణమూర్తి.

భార్య పడుకొనే గదిలోకి అడుగు పెట్టాడు కృష్ణమూర్తి. ముక్కాల పీట మీద కోడి గుడ్డు లాంతరు మందంగా వెలుగుతోంది. మంచం మీద భార్య గాఢ నిద్రలో ఉంది. ప్రక్కనే పసి పిల్లవాడు ఆమె వక్షస్థలానికి అతి చేరువగా పడుకొని ఉన్నాడు. పిల్లవాడు నిద్రలో ఉన్నాడు ... భార్యా మంచం వెనకగా నిలబడ్డాడు కృష్ణమూర్తి వొణికిపోయే ఆవేశంతో.

తల్లి ప్రక్కలో, ప్రపంచాన్నిమరచి, మబ్బుల వొంపుల్లో, నక్షత్రాల మెరుపుల్లో, పువ్వుల రంగుల్లో, స్వప్నసీమలో నిద్రించేవాణ్ణి తీసికొనేందుకు-రెండు బలమైన చేతులు ముందుకు చాచబడ్డాయి. పాప భీతితో ఆ చేతులు వొణుకుతున్నాయి.

నిద్రలో కల ముగిసినట్లుంది-పసిపిల్లవాడు పెదవుల మీదికి నవ్వును దొర్లించాడు.

నీలి మబ్బుపై మెరపు వాలినట్లయింది.

గాలి కౌగలింతకు గులాబీ పువ్వు సిగ్గుపడ్డట్లయింది.

సూర్యకిరణం తెగి, నీటి అలలలో లీనమైనట్లయింది.

అగ్నిలో చేతులు పెడుతూన్నట్టు- కృష్ణమూర్తి, చేతులు ముందుకు సాగలేదు. మెడమీద విషసర్పాలు కౌగిలించుకున్నట్టు—తక్కున ముఖం ఎత్తాడు. గుండెల్లో వేగం ఎక్కువైంది. కళ్ళల్లో అలజడి-

పసి పిల్లవాడ్ని చంపటమా?

ఎంత పాపం?

తుమ్మల తోపులో ఉన్న పసికందును యీ చేతులతో తనే తీసుకొని వొచ్చాడు. బ్రతికించాలని అనుకున్నాడు. మళ్ళీ యీ చేతులతో చంప బూనటమా? ఎంత హింస? తనలో మానవత్వం ఏమైంది?' ఇంతకంటే పాపభూయిష్టమైన కార్యం మరొకటి వుంటుందా? ఈ పసిపిల్లవాడు ప్రపంచంలో ఏ ఘనకార్యం సాధించటానికి జన్మించాడో! భవిష్యత్తులో ఎంత గొప్ప నాయకుడై ప్రజలకు సేవ జేస్తాడో! అటువంటివాడ్ని తను ఆదిలోనే తుద ముట్టించడమా?

కృష్ణమూర్తి జుత్తు పీక్కుంటూ బయటికొచ్చాడు. అరుగుమీద కూర్చున్నాడు. ఆలోచనలు అతన్ని వూపిరి సలుపుకో నివ్వడం లేదు.

ఏం చంపితే? వాడు తనకి పుట్టినవాడా? వాడు సక్రమంగా యీ భూమి మీదకు వొచ్చిన వాడా? వాడి వల్ల వూళ్లో తనకి ఎంత అప్రదిష్ట? జీవితాంతమూ తన బ్రతుకుయొక్క తప్పటడుగునూ, కుటుంబం యొక్క అవినీతిని చాటుతూ, నిదర్శనగా నిలిచి వుంటాడు. తనకి ఈసంఘంలో బ్రతికేందుకు ఆస్కారము వుంటుందా? బంధువులు, స్నేహితులు, హితులు, శత్రువులు, ఊళ్ళోవారు అంతా 'నీ పెళ్లాం ఎటువంటిది?' 'ఆపిల్లవాడు ఎవరికి పుట్టినవాడు?' 'వాడు నీ సంతానమా?' అని దెప్పి పొడుస్తారే? తను ఎట్లా బ్రతకడం? ఎఱ్ఱ సంకెలాంటి ఈ సంఘపు కోపోద్రేకాలకు తను తట్టుకోగలడా? వంశ గౌరవానికి వేరు పురుగుగా పుట్టిన పాపాత్ముడ్ని తుదముట్టించవలసిందే! దయతలిస్తే లాభం లేదు. లోకములో ఎంత మంది పసిపిల్లల్ని చంపడం లేదు? ఎంతమంది పుట్టగానే గొంతుల్లో వడ్లగింజలు వేయడం లేదు? ఎంతమంది రైల్వేబ్రిడ్జీల క్రిందా, కాలువల తూముల క్రిందా తమ బిడ్డల వయస్సులను అంతమొందించటం లేదు? ఏది పాపం?...ఏది పుణ్యం? భార్య పరాయి మగవాడి వల్ల గర్భాన్ని తెచ్చుకోవటం పుణ్యమా? భర్తను మోసగించటం పుణ్యమా? పాపపుణ్యాల్ని విచారించే భగవంతుడు పైన వుంటే వుండవచ్చుగానీ - యీ సమాజంలో పాప పుణ్యాల్ని విచారించే, నాయకులు లేరు. పాప పుణ్యాలను దృష్టిలో పెట్టుకొని, పాపపుణ్యాలకు దడిచి-ప్రవర్తించే వాళ్ళకి యీ సమాజంలో సరైన న్యాయం చేకూరదు. పాపపుణ్యాల్ని ధిక్కరించి, పాపపుణ్యాల్ని స్వార్థంకొద్దీ మార్చుకుంటూ, ముందుకు సాగిపోయేవాడికే ఈ సమాజంలో స్థానం. పేరు, గొప్ప. తను యీ పిల్లవాడ్ని చంపడం ద్వారా జరిగిన పాపాన్ని చాలాభాగం కడిగి వేసుకోవొచ్చు; ఈ సమాజంలో స్థానాన్ని నిలదొక్కుకోవొచ్చు; మామూలు మనిషిగా వ్యవహరించ వచ్చు...తను పిల్లవాడ్ని

నామరూపాలు లేకుండా చేయడమే ఇప్పుడు ముఖ్యం...

కృష్ణమూర్తి చివుక్కునలేచి ఇంట్లోకి వెళ్ళాడు. పసిపిల్లవాడ్ని కళ్ళు మూసి కొని చేతుల్లోకి యెత్తుకున్నాడు.

జయలక్ష్మి కన్ను కదిలించ లేదు.

పసి పిల్లవాడు పెదాలు విప్పలేదు.

వంట గదిలో ఆత్తయ్య ఎలుకలు పారిపోయే ధ్వనిలో గురక పెడుతూ నిద్ర పోతోంది.

కృష్ణమూర్తి పిల్లవాడ్ని అరచేతుల్లో పెట్టుకొని నిశిరాత్రి నడిరోడ్డుమీద పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళుతున్నాడు. కుక్కలు అరుస్తూ వెంటపడ్డాయి. ఇన ప్పెట్టె ముందు మంచం వేసికొని పడు కున్న కోమటి కొత్తసుబ్బయ్య గబు క్కున లేచి కిటికీలోంచి బజారు కేసి చూశాడు.

కుక్కలు అరుపులు మాని, తోకలు ఆడిస్తూ వెనక్కు తిరిగాయి-ఆ వ్యక్తి దొంగకాదని తెలుసుకున్నాక.

తుమ్మల తోపు దాటి కాలువ కట్ట ఎక్కాడు కృష్ణమూర్తి. పిల్ల వాడ్ని కాలువలోకి విసిరివేయాలని యోచన. పిల్లవాడు మేల్కొన్నాడు. 'కేవ్ కేవ్' మంటూ అరువ నారంభించాడు. మామిడి చెట్ల చీకట్లో నిద్రిస్తూన్న పక్షులు ఉలిక్కి పడ్డాయి.

పిల్లవాడ్ని నీటిలోకి విసరి వేసేందుకు కృష్ణమూర్తికి చేతులు రాలేదు. గుక్క పట్టి, దిక్కులు పిక్కటిల్లేట్టు యేడు స్తూన్న పిల్లవాడ్ని కాలువ కట్టమీద పెట్టి—గబగబా నడిచి వూరుకేసి వెళ్ళాడు కృష్ణమూర్తి.

నక్షత్రాల కాంతిలో, అమావాస్య చీకటిలో, చల్లటిగాలిలో, నిశ్చలంగా పారే కాలువ కట్టన, మెత్తటి నల్లటి మట్టిమీద, పక్షుల రొదలో. పెలబాలుడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

ఆ యేడ్పు ఎవరికి వినవొస్తుంది?

నీతి విలువకూ, బ్రతుకు మర్యాదకూ మధ్య జరిగిన సంఘర్షణలో ఒక మాన వుడు స్వార్థం వైపు మళ్లి—ఆ పసివాని భవిష్యత్తును భగవంతునికి వొదిలేసి తన దారిన తాను సంఘంలో చెలామణీ కావ టానికి వెళ్లాడు.

ఆ పసిపిల్లవాని తల్లి గదిలో కుక్కి మంచంలో, కోడిగుడ్డు లాంతరు వెలు గులో పడుకొని—పిల్లవాని భవిష్యత్తుమీద తియ్యటి కలలు కంటోంది.

ఈ భూమిమీద ఉదయించినప్పుడు ఆ పసివాడు ఆలోచించాడా — తన బ్రతుకు యిట్లా అర్ధరాత్రిలో, నిర్జనప్రదే శంలో కాలువ కట్టమీద తెల్లవారు తుందని!

మాతృదేవియొక్క రొమ్ముల వెచ్చ దనంలో, మెత్తదనంలో, సుఖంగా నిద్రించవలసిన ఆ పిల్లవాని లేతగులాబీ వంటి శరీరానికి, నేలమీది చిన్ని చిన్ని రాళ్లు గుచ్చుకొని నొప్పి కలిగిస్తూంటే ఏడ్పురాదూ!

ఆ పసివానియొక్క బ్రతుకుయొక్క అంతిమం ఎన్ని క్షణాల్లో సంభవించ నున్నదో —ఎవరు చెప్పగలరు?

ఆకాశాన అగ్ని పుట్టి, వాయుదేవుడు రంకెవేస్తే—ఆ పసివాడు కాలువలోకి దొర్లవచ్చుగదా!

ఆ పసివాని జీవితం యింకా ఎన్ని క్షణాలు? తనపుట్టుకవల్ల వంశమర్యాదా,

కుటుంబ గౌరవమూ, సంఘపు విలువా, వ్యక్తుల బ్రతుకులయొక్క బిగువూ-సడలిస్తాయని తెలిస్తే, తల్లి గర్భంలోనే భవిష్యత్తు లేకుండా చేసికొని, నిర్జీవిగా భూమి మీద పడేవాడేమో?

పిల్లవాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

పడమటగా పెద్ద మెరుపు మెరిసింది-ఆకాశం పగిలినట్టు.

ఆగ్నేయంగా నక్షత్రం జారింది.

తూర్పు నుంచి ప్రళయ ప్రభంజనం రొమ్ము విరుచుకుంది. చీకట్లో చెట్లు ఘూంకరించాయి. పసిపిల్లవాని నోటికి అడ్డంగా ఎండిపోయిన మామిడాకు పడింది.

దూరంగా నక్క కూత కూసింది...

★

అదే సమయంలో దూరంగా స్టేషనులో రైలుకూత వేసింది. వెంటనే బయలుదేరింది.

రైలు దిగిన రామచంద్రరావు ఆకాశము వంక పరికించి చూశాడు. గబగబా నడక సాగించాడు. వాన రాకముందే వూరు చేరుకోవాలని వడిగా నడుస్తున్నాడు.

...జయలక్ష్మి ఏం చేస్తూ వుంటుందో! పిల్లవాడ్ని కని వుంటుందో! పిల్లని కన్నదో! తను దుర్మార్గమైన పని చేశాడు. పాపం! భర్తలేని ఆమె జీవితం ఏం కావాలి? తనని మనసారా నమ్ముకొని, తన కోర్కెల్ని తీర్చింది. అట్లాంటి ఆమెను తను మోసగించడమా? ఛీ! తను ఎంత నీచుడు? ఆమెకు గర్భం వొచ్చిందని తెలుసుకోగానే, పెళ్ళిచేసుకోవాల్సి వొస్తుందని దడిచి, వెంటనే ట్రాన్స్‌ఫర్ ఆర్డరు తెప్పించుకొని బయట పడ్డాడు. ఆమె ఎట్లా భరించిందో—ఊళ్లోవాళ్ల అపహాస్యాలను, ఛీత్కారాలను-తనని ఎంతగా 'మోసగాడు' అని నిందించిందో! తను వెళ్ళి ఆమె కాళ్ళ మీద పడాలి. ఆమె చేత 'క్షమించాను' అని అనిపించుకోవాలి. అప్పుడు గానీ యీ హృదయంలోని కుళ్లు నశించి పోదు. తను వెంటనే ఆమెను పెళ్ళాడాలి. మళ్లీ యీ గ్రామానికే తను ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలి. జయలక్ష్మి... తనని నమ్ముకున్న జయలక్ష్మి...తనని క్షమిస్తుందో లేదో...అనుకుంటూ నడుస్తున్నాడు రామచంద్రరావు.

నక్షత్రాల కాంతి సన్నగిల్లింది.

మబ్బులు కమ్ముకొస్తున్నాయి.

చీకటి చిక్కనైంది.

గాలి హోరు గంభీరమైంది.

రామచంద్రరావు నడకను జోరు చేశాడు. హఠాత్తుగా అతని కాళ్ళు తక్కున ఆగిపోయాయి. పసివాని ఏడుపు వినవొచ్చింది. ఆ ధ్వని దెసకు వెళ్లాడు

పసిపిల్లవాడు కాలువ కట్టమీద ఏడుస్తున్నాడు. ఆ పిల్లవాడ్ని తీసుకున్నాడు. రామచంద్రరావు. ఆ పిల్లవాడు ఏడ్పును మానాడు. పిల్లవాడ్ని భుజాన వేసుకుని బయలుదేరాడు.

ఎవరి పిల్లవాడో! ఎవరో యీ కిరాతక చర్యకు పాల్పడింది! అంత పిల్లల్ని పెంచలేనివాళ్లు ఎందుకనాలి? వీడి తల్లి ఎవరు? తండ్రి ఎవరు? చంపలేక కాలువ కట్టమీద వొదిలేసి వుంటారు. జయలక్ష్మి సంతానం కాదు గదా!...తన కొడుకా! ఆగి పిల్ల వాని కేసి చూశాడు. చీకట్లో పోలికలు అగుపించ లేదు.

ఏమో! జయలక్ష్మి పిల్లను కని వుంటుందేమో! లోకానికి దడిచి ఇట్లా కాలువ కట్టమీద 'కర్మ'కు విడిచి పెట్టిందేమో!...ఆ పిల్లవాడ్ని భుజం మీద పడుకో బెట్టుకొని, రామచంద్రరావు వాసరాక ముందే జయలక్ష్మి ఇంటికి చేరుకున్నాడు.

అరుగుయెక్కి వరండాలోకి వెళ్ళాడు. వరండాలో నిలబడి కిటికీ లోంచి లోపల చూశాడు. గదిలో జయలక్ష్మి మంచం ప్రక్కన మరోమంచం మీద ఒకపురుషుడు పడుకొని వున్నాడు. రామచంద్రరావు నిశ్చేష్టుడైనాడు. ఎవరతను? జయలక్ష్మికి ఏమవుతాడు? భర్తా! పారిపోయిన మొగుడు తిరిగి పెళ్లాన్ని వెతుక్కుంటూ వొచ్చాడా? ఏమో! ఎందుకు రాకూడదు? తను...తను...ఏం కావాలి? తన విషయం తెలిస్తే—తనమీద పగ దీర్చుకోకుండా వుంటాడా? ఆ వూహ రాగానే—పిల్లవాడ్ని వరండాలో పడుకోబెట్టి, అరుగు మీదుగా క్రిందికి దూకి బజారున పడ్డాడు రామచంద్రరావు.

నక్షత్రాల కాంతి బయట పడింది.

మబ్బులు విచ్చుకున్నాయి.

చీకటి పల్చనైంది.

గాలి హోరుయొక్క గాంభీర్యతచప్పబడింది.

రామచంద్రరావు స్టేషను దారి పుచ్చుకున్నాడు.

పసిపిల్లవాడు వరండాలో నిద్రపోతున్నాడు.

ఘనత వల్లనే అగ్రస్థానం




ప్రతీ షాపులోను దొరకును.

తొలికోడి కూసింది. మలి కోడి కూసింది.

తూర్పు రేఖలు విచ్చుకున్నాయి.

ఊరు నిద్ర మేల్కొంది.

పీడకల ప్రేగులు కదల్చగా-అందరి కంటె ముందుగా లేచాడు కృష్ణమూర్తి. తలుపు తెరిచాడు. కుడిపాదం ముందుగా బయట పెట్టాడు. కాళ్ళకు మెత్తగా ఏదో తగిలింది.

కెవ్వుమన్నాడు పసి పిల్లవాడు.

కృష్ణమూర్తి వొళ్లు ఝల్లుమంది. తనకు తెలియకుండానే పిల్లవాణ్ని ఎత్తుకొని ఆర్ద్రమైన కళ్ళతో గుండెలకు హత్తుకున్నాడు.

★



# వంశ పారం పర్యత

సృష్టిలో ఒక విచిత్రాన్ని మనం గమనించవలసివుంది. ప్రతిప్రాణి కోటీ స్వజాతిని మాత్రమే సృష్టించి, విస్తరించగలదు. ఇది సజీవరాసులన్నిటి. సరిపడేసత్యంకే ఐతే ఒకజాతి మరొక జాతినిసృష్టించట మనేది, ఎప్పుడన్నా ఎక్కడన్నా జరిగిందా అనే అనుమానం వొస్తుంది.

సృష్ట్యాదిలో ఇన్ని జీవరాసులు లేవనీ, కొన్ని జీవరాసుల కలయిక వల్ల, కొత్తజాతులు ఉద్భవమైనవనే వాదనవుంది. యీ వాదనను అంత తేలిగ్గా తోసి వేయలేము. చాలా దగ్గరిపోలికలున్న అనేక జంతువుల్ని యీనాటికీ మనంచూస్తూనే వున్నాం. ఉదాహరణంగా కుక్క, నక్క, పులి, పిల్లి, గుర్రం, గాడిదా—మొదలైనవి. ఏజాతి ఏజాతితో కలియటంవల్ల, మరో కొత్తజాతి వొచ్చిందో యీ నాడు చెప్పటం కష్టం. ఐతే ఇప్పుడు ప్రపంచంలో ఎన్ని జీవరాసులున్నవో, ఇవి మాత్రం స్వజాతిని విస్తరించగలవే కాని, కొత్త వాటిని సృష్టించ లేవు. అథవా అలాటిది సాధ్యమైనప్పటికీ, ఏవో కొన్నిగుణగణాల్ని మాత్రమే మార్చుకోవటం జరుగుతుంది కాని, అసలు జాతే మారదు.

సృష్టి విస్తరణలో అనేక జాతుల జీవరాసుల ఆవశ్యకత ఉండటం వల్లనే క్రాస్ బ్రీడింగ్ వల్ల వివిధ జాతులు ఉద్భవమైనవి. సృష్ట్యాదిలో అసలు మానవుడు లేనేలేడు. జలచరాలనుంచి, భూచరాలూ ఉభయచరాలుబైలుదేరి, చివరకుప్రకృతి సృష్టించగల అత్యుత్తమ జీవిగా మానవుడు తయారయ్యాడు. ఇక క్రాస్ బ్రీడింగ్ (ఒక జాతిని మరొక జాతితో కలిపి కొత్తజాతిని సృష్టించటం) అవసరమే లేకపోయింది; ఎందుకంటే ఏజాతికి ఆ జాతే, తన జాతిని వృద్ధి చేసుకోగలదు కనుక! కోతిలోంచి మనిషి వచ్చాడనే సిద్ధాంతంలో ఎంత సత్యం ఉన్నప్పటికీ, యీ నాడు కోతి మనిషిని కానీ, మనిషి కోతికానీ సృష్టించ లేరు. కొన్ని శతాబ్దాలలో ప్రకృతిలో యీ కొత్తజాతులు, ఎప్పుడు; ఎలా ప్రవేశ పెట్టబడినవో యీ నాడు

చెప్పలేము. ఐతే ఏ జాతిని ఆ జాతే సుస్థిరమై తిరిగి క్రాస్ బ్రీడింగ్ అవసరం లేకుండానే అభివృద్ధి చెంద గలుగుతూన్నవి.

ఒక జాతి మరో జాతితో లైంగిక సంబంధాల్ని కలిగి వుండటం సాధ్యమే ఐనప్పటికీ, అందు వల్ల గర్భధారణ జరగటం కానీ, ఆ రెండిటిలో ఏదో వొక జాతి, లేదా రెంటి పోలికలూ వున్న ఒక కొత్త జాతి సృష్టించటం కానీ జరగదు. ఇదెలా సాధ్యమౌతోందో చూద్దాం:

ప్రతి జాతికీ, జాతిని నిర్ణయించే క్రోమోజోములున్నవి. యీ క్రోమోజోములు ఎప్పుడూ సరి సంఖ్యలోనే ఉండి జతలు జతలుగా ఉంటవి. ఆ జాతికి సంబంధించిన ప్రాణితాలుకు ఏ 'సెల్' లేదా భాగంలోనైనా సరే, యీ క్రోమోజోములుండి, సంఖ్యలో ఎప్పుడూ భేదించవు. ఉదాహరణకు మానవునిలో 48 క్రోమోజోములు 24 జతలుగా ఉంటవి: కాలిలోని సెల్ లోనేమి, కంటిలోని సెల్ లోనేమి యీ సంఖ్య, వాటి రూపం, ఒక్క మాదిరిగానే ఉంటవి. ప్రపంచంలో మరే జంతు జాలంలో కాని, 48 క్రోమోజోములు, 24 జతలుగా ఉండటం కనిపించదు. యీ కారణంగా, మానవుణ్ణి సృష్టించాలంటే, మానవుడే అవసరం. ఇదే విధంగా ప్రతిజాతికీ యీ క్రోమోజోముల సంఖ్య నిర్ణయించ బడటం వల్ల, ఒక జాతి మరో జాతిని ఉద్ధరించ లేక స్వజాత్యాభి వృద్ధికి మాత్రమే దోహదం కాగలుగు తోంది.



ఐతే ప్రకృతిలో కూడా అప్పుడప్పుడు వింతలు జరుగు తూనే ఉంటవి. ఇవి చాలా అరుదే ఐనప్పటికీ, గమనించ దగినవి. చాలా దగ్గరి పోలికలున్న జంతు జాలంలో జరిగిన కలయిక కారణంగా కొత్త లక్షణాలున్న మరో జంతువు ఉద్భవమవటం జరుగుతోంది. అసలు ఒక జాతి, మరో జాతితో లైంగిక సంబంధాల్ని కలిగి ఉండేందుకు ఇష్టపడదు. కాని మరో గత్యంతరం లేక జరిగే కలయికల ఫలితము, కొత్త రకం జంతు సృష్టికి కారణమౌతుంది.

ఒకే బోనులో బంధించ బడిన మొగ సింహమూ ఆడ పులీ విధిలేక కలియటం వల్ల ఒక కొత్త రకం జంతువు (Ligar) సింహం-పులి పోలిక లున్నది ఉద్భవించింది. యీ పక్క బొమ్మలో యీ కొత్త జంతువు చూపబడింది. దీన్ని తల్లి సాకలేదు.

అంటే, తన జాతికి సంబంధించని దాని వల్ల ఏ జీవికీ మనుకారం ఉండదేమో? ఇలాంటిది చాలా అరుదుగా జరుగుతుంది. పులికీ, సింహానికీ వున్న దగ్గిరి పోలికలు కారణము గానే, వాటి వాటి క్రోమోజోములు భేదించినా ఇది సాధ్యమైంది.

ఇదే విధంగా గుర్రాన్నీ, గాడిదనూ కలపటం వల్ల కంచరగాడిద వొస్తోంది. ఐతే తమాషా ఏమంటే యీ కంచరగాడిదలు తిరిగి కంచరగాడిదల్ని సృష్టించలేవు. ఎందుకంటే కంచర గాడిదలోని క్రోమోజోములు బేసి సంఖ్యవి; కనుక అవి విడివడి తిరిగి పిండాన్ని స్థాపించ లేవు. ఇది సృష్టి విచిత్రాలలో ఒకటని వొప్పు.

క్రోమోజోములు జతలు జతలు ఉంటవని తెలుసుకున్నాం. పిండోత్పత్తి సమయంలో పురుష వీర్యకణంలోని సగం క్రోమోజోములూ, స్త్రీ గుడ్డులోని సగం క్రోమోజోములూ కలిసి, తిరిగి ఆ జాతికి సంబంధించిన సరిసంఖ్య క్రోమోజోములున్న ప్రాణి సృష్టికి దోహద మిస్తవి. యీ కలయిక సగం అటునుంచీ, సగం ఇటునుంచీ జరగటం వల్ల, సామాన్యంగా బిడ్డ తాలూకు పోలికలూ ఇతర లక్షణాలూ తల్లితండ్రులకు సంబంధించినవిగా ఉంటూన్నవి.

జులై విడుదల!

1. హత్యా? మరణమా? (వజ్రపాణి రచన)
(అత్యద్భుత డిటెక్టివ్ నవల) త్రివర్ణ ముఖచిత్రం

2. మంజూష (భరద్వాజ కథలు)
ద్వివర్ణ ముఖచిత్రం

3. మనుచరిత్ర (చౌడేశ్వరీదేవి కథలు)
ద్వివర్ణ ముఖచిత్రం

ఒక్కొక్కటి 8 అణాలు. రూ 2-0-0 పంపిన వారికి పై మూడు పుస్తకాలూ రిజిష్టరు పోస్టులో పంపబడుతవి. పుస్తక విక్రేతలకు మంచి కమిషన్. నేడే వివరాలకు రాయండి.

జ్యోతి కార్యాలయం, మద్రాసు-17.

ఐతే తల్లి దండ్రుల లక్షణాలలోలేని కొత్త గుణగణాలు కూడా బిడ్డలో కనిపించటం కొత్త కాదు. యీ గుణగణాలు ఎక్కణ్ణుంచి వొస్తున్నవి? తల్లి దండ్రుల తాలూకు గుణగణాలేగాక, వారి వంశ క్రమంలోని అనేక గుణగణాలు కూడా, కొన్ని తరాలలో కనిపించ కుండానే బిడ్డకు సంక్రమించ వచ్చు. యీ సత్యం కలకాలంగా మానవునికి తెలుసు. అందుకనే వివాహానికి ముందు వంశం, గౌరవ మర్యాదలూ, తెలివి తేటలూ, సాంప్రదాయం మొదలైనవి పరిశీలించట మంటూ ఉండేది. ఐతే ఇవన్నీ స్థూలంగా చేసే పరిశీలనలే కానీ, ఖచ్చితంగా యీ వివాహ ఫలితంగా కలిగే సంతానం ఎలా వుంటుం దనేది వారికి తెలియదు. ఆధు నిక శాస్త్రకారులు పరిశోధనల ఫలితంగా ఒక వివాహం తాలూకు సంతానం ఎలా ఉండేదీ స్పష్టంగా ముందుగానే చెప్పటం సాధ్య మౌతోంది. ఎలాగో చూద్దాం:

పైన క్రోమోజోముల్ని గూర్చి చెప్పుకున్నాం కదా! వంశపారం పర్యతనూ, ఇతర గుణగణాల్నీ యీ క్రోమోజోములే సూక్ష్మాతి సూక్ష్మమైన రూపంలో సంక్ర మింపజేస్తవి. ఇదిస్థూలంగా చెప్పుకోవటం. ఐతే ఒకో క్రోమోజోములో కొన్ని వందల, లేదా కొన్ని వేల 'జీన్స్' అనేవి ఉంటవి. ప్రతి ఒక్క 'జీన్' ఒకానొక గుణా నికో, లేక విశేషానికో ప్రాతి నిధ్యం వహించి, వంశ పారం పర్యతను తనలో ఇముడ్చుకొని వుంటుంది. క్రోమోజోము అతి శక్తి వంతమైన మైక్రోస్కోప్ కింద చూడ వచ్చుకాని, 'జీన్'ను ఇంత వరకూ చూసిన వాళ్లు లేరు. యీ జీన్స్ కారణంగానే వంశ పారం పర్యత నిర్ణయించ బడుతూండటంవల్లా, జీవ శాస్త్రంలో వంశ పారం పర్యత గొప్పస్థానాన్ని ఆక్రమించుకున్నందువల్లా, శాస్త్రంలో ఇదొక ప్రత్యేక శాఖగా రూపొంది 'జెనిటిక్స్' అని పిలువ బడుతోంది. నేటి ప్రపం చంలో 'జెనిటిక్స్' అతి ముఖ్య మైనదిగా పరిగణించబడటంలో ఆశ్చర్యం లేదు.

వంశ పారం పర్యతలో అన్యకుటుంబం తాలూకు రక్తంవొచ్చిపడి, సంకరమై వంశం క్షీణిస్తుందనే భయం వల్ల, పూర్వకాలంలో ఈజిప్షియన్ రాజవంశీయులు కుటుంబీకుల మధ్యనే వివాహాలు జరిపేవారు. అన్నా చెల్లెలు, తల్లి కుమారుల మధ్య జరిగిన వివాహాలున్నవి. జగదేక సుందరి క్లియోపాత్రాను, ఆమె తమ్ముడు టాలమీ వివాహ మాడాడు. యీ విధంగా 12 తరాలు గడిచాక, కుటుంబంలో స్త్రీ పురుషుల నిష్పత్తి సరిగా లేనందున యీ ఆచారాన్ని వొదులుకో వలసి వొచ్చింది. నేటి నైతిక జీవనానికి ఇలాంటి ఆచారాలు భయానకంగానూ, జుగుప్సా కరంగానూ కనిపించినా, ఆనాటి వారి ఉద్దేశ్యం—వంశం తాలూకు ఔన్నత్యాన్ని కాపాడటమే!

ఇక్కడ మన లోక ధర్మ సందేహం వొస్తుంది. వంశంలోని గొప్ప గుణా లను వొదులుకోలేకనే, స్వకుటుంబీకుల మధ్య వివాహాలు జరిగినవి; ఐతే కుటుం బీకుల్లో వున్న లోపాలు, ఇలాంటి వివాహాల వల్ల ద్విగుణీకృతాలవవా? తప్పకుండా అవుతవి. మొత్తం మీద వంశౌన్నత్యం కాపాడుతుందనే ఆశయంతోనే, యీ

వివాహాలు జరిగినవి. రాజవంశం చీలిపోవటం వల్ల, అంతః కలహాలు వొస్తవనే భయం కూడా యీ విచిత్ర వివాహాలకు కారణమై ఉండొచ్చు.

సంతానాన్ని కనబొయ్యే అనేక మంది తల్లి దండ్రులకు అనేక సందేహాలు వొస్తూంటవి. ఉదాహరణకు, 'తల్లి తాలూకు కంఠస్వరం మా అమ్మాయికి వొస్తుందా?' అనీ 'మా కుటుంబంలో కాన్సర్ వ్యాధి పీడితు లుండేవారు; మా సంతానానికి ఆ వ్యాధి సంక్రమిస్తుందా?' అనీ, 'తండ్రి తాగుబోతు; అతని సంతతి కూడా యీ వ్యసనానికి గురవుతుందా?' అనీ—ఇలాటి సవాలక్ష ప్రశ్నలు అడగబడుతూన్నవి.

వీటికి పూర్వీకులే ఒక రకంగా సమాధానాల్ని ఏర్చి కూర్చారు. ఐతే యీ జవాబులన్నీ శాస్త్రీయమైనవనీ, సకారణ వాదనలకు నిలబడేవనీ చెప్పలేము. వీటిల్లో చాలాభాగం అమ్మమ్మ కబుర్లగానూ మూఢనమ్మకాలుగానూ ఉంటూన్నవి. గర్భధారణ మొదలూ, శిశుజననం వరకూ ఏదో గొప్ప సృష్టి రహస్యమని పూర్వీకుల అభిప్రాయం. ఐతే యీ సృష్టి రహస్యాన్ని ఆధునిక మానవుడు ఛేదించ గలిగాడు.

పోతే అనేక దురభిప్రాయాలూ, మూఢనమ్మకాలూ మనకింకా వొదలలేదు ఉదాహరణకు: గ్రహణం నాడు, గర్భవతి, గ్రహణాన్ని చూసినందు వల్ల, లోని పిండంలో ఏదో విపరీతం సంభవిస్తుందనే నమ్మకం నేటికీ మనలో వుంది. ఇదే విధంగా గర్భవతికి దేనిమీదన్నా గాఢమైన కోరిక వుండి, అది తీరనట్లయితే, ఆ వస్తువు తాలూకు చిహ్నమేదో, బిడ్డ శరీరం మీద ఏ పుట్టుమచ్చగానో తయారౌతూందనే నమ్మకమూ వుంది. శాస్త్రానికి ఇలాటి నమ్మకాలతో పనిలేదు. ఇవన్నీ శుద్ధ అబద్ధాలే! శాస్త్రానికి అవసరమైనది నగ్నసత్యం కనుక, దాని ఆధారంగానే చర్చ సాగవలసి వుంటుంది.

నేటి శాస్త్రకారులు గర్భధారణకు ముందే, కలగబొయ్యే సంతానం తాలూకు గుణగణాల్ని స్పష్టంగా చూపగలరు. వంశ పారంపర్యత అనేది ఏదో దీర్ఘంగా ఆలోచించి, చప్పున చెప్పగలిగినంత తేలిక మాత్రం కాదు. సజీవకణాల్లోని సూక్ష్మాతి సూక్ష్మమైన భాగాలను ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్ కింద జాగ్రత్తగా పరిశీలిస్తూ, వృక్షజాతులమీదా, సూక్ష్మక్రిములమీదా, జంతుజాలం మీదా లెక్కలేనన్ని పరిశోధనలు జరిపి, వంశ పారంపర్యతకు ఒక పద్ధతంటూ ఉన్నదనే సిద్ధాంతాన్ని ఏర్పరిచారు. ఆ తరువాత కొన్ని వేల కుటుంబాల తాలూకు వంశపారంపర్యతను జాగ్రత్తగా పరిశీలించి జీవశాస్త్రంలోని అతని గూఢరహస్యాలకు ఒక సమాధానాన్ని లాక్కొచ్చారు.

వంశపారంపర్యత అనేది ఎవరికో కొంతమందికే సంబంధించిన, సమస్యనుకోవటం శుద్ధపొరపాటు. వంశపారంపర్యత ప్రతిమానవుడికీ, నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్య! దీన్ని గూర్చిన పరిపూర్ణ జ్ఞానాన్ని నిత్య జీవితంలో అమలు జరిగినట్లయితే, నేడు సమాజంలో ఉండదగని అనేకమంది అసలు పుట్టకుండానే

జాగ్రత్తపడే అవకాశం ఉండేది. భావిమానవ చరిత్రంతా వంశపారం పర్యత పునాది మీదనే ఆధారపడి వున్నదనటం సత్యదూరం కాదు.

జెనిటిక్స్‌ను నిత్య జీవితంలో అత్యంతోపకారిగా ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేయటంలో జగత్ ప్రసిద్ధి చెందింది అమెరికాలోని ఛార్లెస్ ఫ్రీ మౌంట్ డిగ్స్ సంస్థ. ఈ సంస్థలో కొమ్ములు తిరిగిన శాస్త్రకారులు అనేక పరిశోధనలు చేయటమే గాక, డాక్టర్లకూ, సామాజిక సేవకులకే గాక, సామాన్యుల కూడా ఉచిత సలహాలను ఇస్తున్నారు. తమ వంశపారం పర్యతనుగూర్చి తెలుసుకో గోరినవారు పోస్టులో కానీ, వ్యక్తిగతంగా కానీ, ఈ సంస్థ సహాయాన్ని కోరి, త్వరలోనే శాస్త్రీయ విజ్ఞాన సహాయంతో, తమ వంశ పారం పర్యతనుగూర్చి ఖచ్చితమైన, సత్యాలను తెలుసుకోవచ్చు.

లైంగిక విజ్ఞానలేమివల్ల నిత్యజీవితం ఎంత బాధావహంగా ఉంటుందో ఈ సంస్థకువొచ్చే ప్రశ్నల్ని చూస్తే తెలుస్తుంది. ఉదాహరణకు: ఆమె గర్భాన్ని ధరించినప్పుడు, కొన్నిరోజులుగా తన భర్తతో వాగ్వాదాలు జరిపింది; ఇద్దరూ మాట్లాడుకోకుండా, కొంతకాలం గడిపారు. ఈ మానసిక వేదనల వల్ల గర్భస్థ శిశువులో ఏమన్నా విపరీతాలు జరుగుతవేమోనని భయం. ఈ సంస్థకు తన అనుమానాన్ని తెలియపరిచినప్పుడు, శాస్త్రజ్ఞులిలా జవాబిచ్చారు. ఆమె దన్నిగూర్చి బాధపడనవసరం లేదు. ఆమె మానసిక స్థితికీ, గర్భస్థశిశువుకు ఏ విధంగానూ హానికరం అవదు.

వెనుకటిసంచికలు బైండ్లరూపాన యీక్రిందివిధంగా దొరుకుతవి:

మొదటి బైండు: 1954 జూలై నుంచీ, 1954 డిసెంబర్ వరకూ, రూ. 3-8-0.

రెండో బైండు: 1955 జనవరి నుంచీ, 1955 జూన్ వరకూ రూ. 3_8_0.

పై రెండూ ఒకేసారి కొంటే రూ. 6_0_0.

మూడో బైండు: 1955 జూలై నుంచీ, 1955 డిసెంబర్ వరకూ (సప్లిమెంటుతో సహా) రూ. 3_8_0.

నాలుగో బైండు: 1956 జనవరి నుంచీ 1956 జూన్ వరకూ రూ. 3-8-0.

పైకం ముందుగా పంపేవారికి ఖర్చులు భరించి పంపబడుతవి.

వివరాలకు:

అభిసారిక కార్యాలయం, మద్రాసు-17.

గర్భధారణ సమయంలో తల్లి మనస్తత్వాన్ని బట్టీ, గర్భధారణ సమయంలో చుట్టూ వున్న వాతావరణాన్ని బట్టీ, శిశువులో మార్పులు జరుగుతూంటవే నమ్మకము కలకాలంగా మానవ జాతిలో వుంది. యీ కారణంగానే, శోభనపు గదిని అలంకరించటం, గోడలకు మహాపురుషుల చిత్రపటాల్ని వేళ్లాడేయటం, శృంగార రసాన్ని చిందే బొమ్మలు వధూవరులకు కనిపించేట్లుంచటం, ఒక ఆచారంగా వొస్తోంది. ఇందువల్ల గర్భధారణ సమయంలో స్త్రీ కళ్ల ఎదుట ఏ చిత్రం లేదా ఏ రూపం వుంటుందో, అలాటి ఆకారమే శిశువుకు వొస్తుందని నమ్మబడింది. కాని ఇది శుద్ధ అబద్ధం. నిజానికి దాంపత్య నిర్వహణానంతరం, కొన్ని గంటలకు కాని గర్భధారణ జరగటం లేదు. అదంతా అలా వుంచి, కేవలం వాతావరణ కారణం గానూ, ఆమె మనస్సులో ఊహించుకున్నందు వల్లా శిశువు రూపురేఖవిలాసాలలో కానీ, గుణగణాల్లో కానీ ఎలాటి మార్పూ రాదు. ఐతే కేవలం దంపతుల మనసులు ఆహ్లాదకరంగా ఉండేందుకే వాతావరణం సహాయ పడుతోంది.

యీ రకం కట్టుకథలు మన పురాణాల్లో సైతం కనిపిస్తవి. మహాభారతంలో ధృతరాష్ట్రుని పుట్టుక, పాండురాజు జననం మొదలైన ఘట్టాలు, మూఢ నమ్మకాల ఆధారంగానే అల్లబడినవి. ధృతరాష్ట్రుని తల్లి, రతి సమయంలో సిగ్గుతోనూ భయంతోనూ కళ్ళుమూసుకోవటం వల్ల, ధృతరాష్ట్రుడు గుడ్డివాడయ్యాడని కథాభాగం. అదే విధంగా పాండురాజు తల్లి దాంపత్య సమయంలో తెల్లబోవటం వల్ల, పాండురాజు ధవళచ్ఛాయను కలిగి వున్నాడని (లేదా ఆమె రక్తం విరిగి పొయ్యేటంత భయానికి గురికావటం వల్ల పాండురాజు, రక్తలేమి—అంటే పాండు వ్యాధి పీడితుడు అయాడని) చెప్పబడింది. యీ రెంటికీ శాస్త్రీయంగా ఎలాటి విలువా లేదు.

ఇదేవిధంగా అభిమన్యుడు తల్లి గర్భంలో ఉండగా పద్మవ్యూహంలోకి జొరబడటాన్ని గూర్చి విన్నాడనీ, తిరిగి బైటపడటం విని ఉండలేదనీ, అందుకనే అతను పద్మవ్యూహంలో చిక్కుకున్నాడనే కథ కూడా భారతంలో వుంది. యీ కథకూడా శాస్త్రీయంగా ఎలాటి విలువా లేదు.

ఇలాటి దురభిప్రాయాల్ని మానవుడు అనాదినుంచీ ఆరాధిస్తూనే వున్నాడు. గుర్రాలను ఏం చేస్తారో చూడు:

ఉత్తమాశ్వాన్ని ఆడ గుర్రానికి ఎదురుగా ఉంచుతారు. ఆ తరువాత ఆడ గుర్రానికి కళ్లు కనిపించకుండా గంత కట్టి, సాధారణాశ్వంతో కలుపుతారు. ఇందువల్ల ఆడ గుర్రం మనసులో, తాను చూసిన ఉత్తమాశ్వపు రూపురేఖలు గాఢంగా చిత్రించబడి ఉండటం వల్ల, అది కనబోయ్యే గుర్రపు పిల్లకు ఉత్తమాశ్వ లక్షణాలుంటవనే నమ్మకం. కాని ఆరు నూరైనా ఇది జరగదు. గర్భధారణ, కన

బొయ్యే శిశువు తాలూకు రూపురేఖ విలాసాలతోబాటు, గుణపరంపర కూడా ఆయా క్రోమోజోములు, లేదా జీన్స్ నిర్ణయిస్తవి కాని, మానవుని ఇష్టానుసారం జరగ నేరదు. జరుగుతుం దనుకోవటం మానవుని మూర్ఖత్వానికి ఒక తార్కాణం.

నిత్యజీవితంలో చాలా చిత్రమైన ప్రశ్నలు వొస్తూంటవి. ఉదాహరణకు: అతను ఇంజినీరింగ్ చదవాలని ఎంతో ప్రయత్నించాడు. ఎంత ప్రయత్నించినా ఆర్థిక బాధల వల్ల అతను కాలేజీ చదువులకు వెళ్లలేక పొయ్యాడు. ఇప్పు డతను తండ్రి అవబోతున్నాడు. అతని సంతానానికి ఇంజినీరింగ్ అభకాశం ఉండగలదా? లేక ఇంజినీరింగ్ అంటే ఆ సంతానం ఇష్టపడదా? యీ ప్రశ్న డీర్గ్ సంస్థకు వేయబడినపుడు 'అలాటిది జరగ నేరదు' అనే జవాబు వొస్తుంది; ఆశించిన చదువు సంధ్యలూ, సంపాదనా లేనందువల్ల, సంతానాన్ని పెద్ద చదువులకు పంపలేని అస మర్థత ఏర్పడవొచ్చు; కాని ఒక తరంలో పరిస్థితుల వొత్తిడి వల్ల సమకూరని ఒకా నొక ఆశయం వంశం లోకి జొరబడదు.

అనాదినుంచీ మానవుడు గమనిస్తూనే ఉన్నాడు; జీవరాశి తాలూకు సంతా నము, ఆ జీవరాశినే పోలి వుంటుంది. మామిడి టెంక నాటితే, అది ఏ పరిస్థితు ల్లోనూ వేప చెట్టవదు: మామిడి మొక్కగానే పెరగాలని దానికి తెలుసు. పైతరం వారితో, ముందు తరంవారు కొద్దిగా భేదించినప్పటికీ, పోలికలే ఎక్కువ. యీ భేదం కూడా పెరిగే వాతావరణం మీదా, పొందే సంస్కారం మీదనే ఎక్కువగా ఆధారపడి ఉంటూన్నవి; అయితే వొచ్చి పడే భేదాలు పెరుగుదలలోనే కాని, పుట్టి నప్పుడు కాదనేది స్పష్టమౌతోంది.

ఐతే హఠాత్తుగా తల్లిదండ్రుల్ని పోలని శిశువులు జన్మించటం, తల్లిదండ్రుల్లో మచ్చుకైనా కనిపించని కొన్ని గుర్లక్షణాలు కనిపించటం జరుగుతూనే వుంది. పూర్వపు మానవుడు అదంతా సృష్టి వైచిత్ర్యం అనీ, దైవ సంకల్పం అనీ సరిపెట్టు కొనేవాడు. కాని ఆధునిక మానవుడు యీ సమస్యఅరూపాన్ని సమగ్రంగా పరిశీలించి, వంశ పారంపర్యతకు ఒక పద్ధతంటూ వున్నదని కనుగొన్నాడు.

ఒకానొక ఆస్ట్రియన్ మతగురువు—మాండిల్ అనే ఆయన, తన తోట లోని పసుపు పచ్చని బటానీల మొక్కల్ని, ఆకు పచ్చని బటానీ మొక్కల్లో కలిపాడు; ఫలితంగా పెద్దవీ, చిన్నవీ; పై చర్మం ముడతలు పడినవీ, నున్నగా ఉన్నవీ వొచ్చినవి. వంశపారంపర్యత ఏమిటో అర్థం గాక తలక్కిందులవు తూన్న సమయంలో మాండిల్ ఒక పరిష్కారాన్ని కనిపెట్టగలిగాడు. 'మాం డిల్ వంశ పారం పర్యతా సిద్ధాంతం' ఏర్పడి, జగత్ ప్రసిద్ధి చెందింది.

ఐతే మాండిల్ సిద్ధాంతం చాలా రోజులవరకూ వెలుగులోకి రాలేదు. 1900 ల్లో థామస్ హంట్ మార్గన్ అనే ఆయన మాండిల్ సిద్ధాంతం ఒక్క వృక్షజాతులకే గాక, ప్రతి జీవరాశికీ సరిపడుతుందనే సత్యాన్ని నిరూపించాడు.

మార్గన్ ప్రకృతి విస్తరణలో, వంశపారంపర్యతకు ఎంత గొప్ప క్రమపద్ధతి వున్నదో కూడా తెలియ చెప్పాడు.

గర్భధారణ సమయంలో క్రోమోజోముల కలయిక వంశపారం పర్యతను నిర్ణయిస్తవి. క్రోమోజోముల్లో ఉండే 'జీన్స్' కలయికలో రసాయనిక మార్పులు జెంది, బిడ్డ తాలూకు తెలివితేటల్నీ, మానసిక శారీరక ఆరోగ్యాన్నీ, వ్యక్తిత్వాన్ని కూడా నిర్ణయిస్తవి. ఐతే వంశపారం పర్యతలో ఏ గుణగణాలు సంతానానికి వొస్తవి, ఏవిరావు అనేది తేలవలసి వుంది. జెనిటిక్స్ శాస్త్రకారుడు వంశవృక్షాలను పరిశీలించి, ఖచ్చితంగా సంతానంలో వొచ్చే గుణగణాల్ని నిర్ణయిస్తాడు.

ఉదాహరణకు: ముదురు గోధుమరంగు కళ్లున్న ఒక పురుషుడు, (అతని కుటుంబీకులందరికీ అదే వర్ణమున్న కళ్లున్నవి) నీలిరంగు కళ్లున్న స్త్రీని (ఆమె కుటుంబీకులందరికీ నీలిరంగు కళ్ళు ఉన్నవి) వివాహమాడినప్పుడు, వారి సంతానం తాలూకు కళ్ళ రంగు గోధుమ రంగువేవి ఉంటవని జెనిటిస్టుకు తెలుసు.

ఇక్కడ మనకో ధర్మ సందేహం వొస్తుంది. సంతానం తాలూకు కళ్ళరంగు నీలం ఎందుకు అవదు? కనీసం గోధుమకూ, నీలానికీ మధ్యవున్న వర్ణమేదన్నా కాకూడదా? జవాబిది: యీ జీన్స్‌లో అన్నీ సమానమైన శక్తివంతాలైనవి కావు. కొన్ని అతిశక్తవంతమైనవి.'డామినెంట్' (dominant) అనబడుతూన్నవి; మరికొన్ని తక్కువ బలం కలవి 'రెసెస్సివ్' (Recessiue) అనబడుతూన్నవి. అతిశక్తివంతమైన వాటితో, తక్కువ శక్తిగలవి కలిసినప్పుడు, సహజంగా బలహీనమైనవి లొంగిపోవటం, బలవత్తరమైనవి తమ అధికారాన్ని విస్తరింప చేయటం జరుగుతుంది. కళ్ళరంగులో 'ముదురుతనం' బలవత్తరమైన జీన్స్‌కు సంబంధించింది. కనుక పై ఉదాహరణలో లేత దనంవున్న నీలిరంగు కళ్ళు ఏ పరిస్థితుల్లోనూ వొచ్చేందుకు వీల్లేదు.

వంశ పారం పర్యతను గూర్చిన పరిపూర్ణ విజ్ఞానంవల్ల ఆరోగ్య రక్షణకూడా వుంటుంది. ఉదాహరణకు: బిడ్డకు జ్వరంవొచ్చింది; జ్వరమునే మందివ్వబడుతోంది; కాని తగ్గలేదు. వైద్యుడికి ఏమీతోచదు. వంశ పారం పర్యతను పరిశీలిస్తే, తల్లిదండ్రుల్లో ఒకరు, శరీరోష్ణం కంట్రోల్‌లోని కుటుంబానికి చెందినవారు; వంశపారం పర్యతలో బిడ్డకు అది సంక్రమించింది. యీ సంగతి తెలిశాక వైద్యుడికి అసలు రహస్యం అర్థమైంది. శరీరంలో చెమటపట్టించే గ్రంథుల్లో ఏదో లోపం ఉండటం వల్ల, సకాలంలో చెమటపట్టక, శరీరోష్ణం కంట్రోల్ లేకుండా ఉంటూన్నది. ఇతర మందులవల్ల ఏమీ ప్రయోజనం ఉండదు సరికదా, పరిస్థితి మరింత విషమించ గలదు కూడాను. ఇలాటి లక్షలాది కేసుల్లో వంశపారంపర్యత సమస్యా పరిష్కార మార్గాన్ని సూచించ గలుగుతోంది.

అనేక లోపాలు వంశ పారం పర్యతలో వొచ్చి పడుతూన్నవనే విషయాన్ని శాస్త్రీయ విజ్ఞానం రుజూ చేయ గలుగుతోంది; మరో పక్క వంశ పారంపర్యతకు సంబంధం లేని లోపాలుకూడా ముందు తరం వాళ్లు గురవుతున్నారనీ రుజూ అవుతోంది. పూర్వం వంశ పారంపర్యత కారణంగానే వొచ్చి పడే లోపాలు కొన్ని, దానికి సంబంధించినవి కావని కూడా రుజూ అవుతోంది. ఉదాహరణకు—సిఫిలిస్ వ్యాధి వంశ పారం పర్యతకి సంబధించిందనే అభిప్రాయం పూర్వం ఉండేది. కాని పరిశోధనల ఫలితంగా తేలిందేమంటే—బిడ్డ సిఫిలిస్ వ్యాధిలోనే జన్మించి నప్పటికీ, అది జీన్స్ ద్వారా వొచ్చి, వంశపారంపర్యతకుసంబంధించిందని అనలేము. మరెలా వొచ్చిందనే దానికి జవాబిది: పిండంగా తల్లి గర్భంలో పెరుగుతూన్నప్పుడు యీ అంటువ్యాధి బిడ్డకు సోకింది.

అనేక వ్యాధులు వంశ పారం పర్యతను కలిగి ఉన్నవా? లేదా? అనేప్రశ్న చాలా చిక్కది. ఉదాహరణకు కాన్సర్, మధుమేహం, క్షయ, పోలియో—మొదలైన వ్యాధి పీడితులు, తమ సంతానం ఏమౌతుందనే భయానికీ, ఆతృతకూ గురవటం సహజం. ఐతే యీ ప్రశ్నలకు ఇదమిత్థమని జవాబు చెప్పే ముందు, ఇంకా అనేక పరిశోధనలు జరగవలసి వుంటుంది. ఐతే ఒక ముఖ్య విషయం—ఒక వ్యాధిని నిరోధించ గలిగే శక్తి లేని కుటుంబాల్లో జన్మించినంత మాత్రాన, ఆ వ్యాధి తప్పక వొస్తుందనే భయం అక్కర్లేదు.

ఉదాహరణకు: కీళ్ల వాతం; కీళ్ళ వాతం వంశ పారంపర్యతలో వొచ్చి, కనీసము ఆ వ్యాధిని నిరోధించగల శక్తిలేని కుటుంబంలో జన్మించినప్పుడే ఆ వ్యాధికి గురవటం జరుగుతుంది. ఐతే వంశ పారంపర్యత ఒక్కటే చాలదు. ఇతర పరిసరాలు వ్యాధి విస్తరణకు అనుకూల వాతావరణమూ ఉంటేనే కాని వ్యాధి గ్రస్థుడవడు.

ఇక్కడ మనకో అతి ముఖ్యమైన ప్రశ్న ఎదురవుతుంది. వ్యక్తిత్వాన్ని నిర్ణయించటంలో వంశ పారం పర్యతకు ఎక్కువ పలుకుబడి వుంటుందా? లేక పుట్టి పెరిగిన వాతావరణానికి ఎక్కువ పలుకుబడి వుంటుందా?

ఈ ప్రశ్నకు స్థూలంగా జవాబు చెప్పాలంటే, వ్యక్తిత్వాన్ని స్థాపించటంలో వంశ పారం పర్యతకూ, పెరిగే పరిసరాలకూడా పలుకుబడు లుంటవనే చెప్పాలి.

ఉదాహరణగా—సద్వంశంలో జన్మించి, ఎంతో తెలివి తేటలున్న తల్లి దండ్రులకు బిడ్డగా పుట్టినా, ఆర్థిక పరిస్థితుల వొత్తిడి వల్లా, చెడు స్నేహాలవల్లా—నేరస్థులై పోయిన వారెందరో వున్నారు. సాధారణమైన తెలివితేటలున్న కుటుంబంలో జన్మించి స్వశక్తి వల్ల జాగర్తగా చదువుకొని ఉన్నతోద్యోగులై, గొప్ప చాక చక్యాన్ని చూపి ప్రసిద్ధి చెందిన వారూ ఉన్నారు. దీన్నిబట్టి వంశ పారం పర్యతా పరిసరాలూ ఒక దానికొకటి సహాయకారిగా ఉండి, వ్యక్తిత్వాన్ని స్థాపిస్తవనే చెప్పాలి.

తెలివి తేటలూ, కళారంగంలో ఒకో వ్యక్తి చూపే ప్రతిభా, వంశ పారం పర్యతను కలిగి ఉన్నవా అనేది మరో గొప్ప ప్రశ్న. కొన్ని వందల కుటుంబ చరిత్రలను తిరగేస్తే—సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం మొదలైన కొన్ని లలిత కళల్లో చూపే ప్రతిభకు వంశ పారం పర్యలక్షణా లున్నవని చెప్పే అవకాశం ఏర్పడుతోంది. ఇది అందరి పట్లా యదార్ధం కాక పోవొచ్చు. 'పండిత పుత్రుడు!' అనే సామెత కూడా మనం ఎరగంది కాదు.

'కేవలం తెలివి తేటలకు వంశ పారం పర్య లక్షణం ఎంత వరకూ వుంది? యీ ప్రశ్నకు జవాబు చెప్పటం తేలిక కాదు. ఇతర లక్షణాలకన్న తెలివి తేటలు, పరిసరాల మీదా, ఆ వ్యక్తి ఆలోచించగలిగే శక్తి సామర్ధ్యాలమీదా ఎక్కువగా ఆధారపడి వుంటుంది. ఐనప్పటికీ ఆరోగ్యకరమైన మెదడు ఉండటం, అది వంశ పారం పర్యతకు సంబంధించిందే కావటమంటూ వుంది.

యీ విషయాన్ని తేల్చేందుకు శాస్త్రజ్ఞులు కవల పిల్లల్ని ఎన్నుకున్నారు! ఒకోరికి ఒకో రంగంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చినప్పటికీ, ఒకరి కన్న మరొకరు అధికులని రుజూ కాలేదు. దీన్నిబట్టి తెలివి తేట లనేవి చాలా వరకు తల్లి దండ్రుల మంచే వొస్తున్నావా అని పిస్తోంది.

ఐతే వంశ పారం పర్యత కారణంగా ఏమేమి లోపాలు ముందు తరంలో వొస్తవోనని భయపడిలాభం లేదు. కాని ముందుగానే జెనిటెస్ట్‌ను సంప్రదించి, చేసు

జులై విడుదల:

ప్రఖ్యాత డిటెక్టివ్ రచయిత దాసు గారి రచనలు.

దెయ్యాల దిబ్బ

మరపురాని మగువ

(డిటెక్టివ్ నవలలు)

ఆకర్షణీయమైన త్రివర్ణ ముఖ చిత్రాలతో, ముచ్చటైన ముద్రణలో జులై విడుదల.

ఒక్కొక్కటి **0-8-0**

ఏజెంట్లకు 25% కమీషను

వివరాలకు:

జ్యోతి కార్యాలయం, మద్రాసు-17.

కునే వివాహాలు తమ సంతానికి న్యాయాన్ని చేకూర్చటంలో శక్తి వంచనలేకుండా ప్రయత్నించినవని చెప్పగలం.

నిత్యజీవితంలో 'జెనిటిక్స్' మానవ జాతికి ఎలా మేలు చేస్తున్నదో తెలుసుకోవటం అవసరం. ఆది మానవుడికూడా మంచిజాతి జంతువుచేత పోర్లించటం వల్ల, మంచి సంతానం వొస్తుందనే సంగతి తెలుసు. ముఖ్యంగా పాడిగొడ్ల పట్ల, యీ విధానం అమలు జరుప బడుతూనే వుంది.

ఆధునిక శాస్త్రకారులు కృత్రిమ విధానంలో గర్భధారణజరగటాన్ని సాధ్యం చేశారు. మొగజంతువు తాలూకు వీర్యాన్ని, ఆడజంతువు గర్భకోశంలోకి పంపటం వల్ల ఉత్తమ జాతి పశువు ఉద్భవమవుతోంది. యీవిధానం వల్ల రెండు ఉపయోగాలుంటవి. మొదటిది.: ఒక్క స్ఖలనంలోని వీర్యంలో అనేక కోట్ల వీర్యకణాలుంటవి. గర్భధారణకు ఉపయోగ పడేది ఒక్కటే కావటం వల్ల, మిగతా వన్నీ నిరుపయోగ మౌతున్నవి. కృతిమ గర్భధారణా విధానంలో, ఒక్క స్ఖలనంలోని విర్యంతో అనేక పశువుల్ని కట్టించ వొచ్చు: ఇందు వల్ల వీర్యంలో జరిగే వృధా అరికట్ట బడింది.

సహజ మార్గంలో, ఒకే ఉత్తమ జాతి మొగ పశువు, అనేక ఆడ పశువుల్ని కట్టించ లేదు; అది కేవలం దాని కామ వాంఛమీద ఆధారపడే విషయం. విశేషించి పశు జాతులకు ఎదరొచ్చే కాలమంటూ ఉండటం వల్ల, వాటిగర్భధారణలకు ఒక ఋతువంటూ వుంది. కనుక ప్రపంచంలోని పశు సంపదను ప్రకృతే ఒకవిధంగా పరిమితం

నపుంసక తైలం;_అంగము చిన్నదై, నరముల బలహీనత కలిగి సంభోగ సౌఖ్య మనుభవించ లేనివారికి తిరిగి యథాప్రకారం అగుటకు గ్యారంటీ 1 సీసా రు. 10 లు వి. పి. 1-4-0 లు. ఇందులో స్పెషల్ రకం తైలం నేపాళ దేశపు కస్తూరీ, అంబరు హేమం కలియుటచేత బాల్యమునందు ముష్టిమైథున దోషమును పోగొట్టుటలో 40 సం॥ జగత్ప్రఖ్యాతి చెందినది. ఉద్దాపన శక్తినశించి స్త్రీనిచూచి లోలోన కృశించు హతాసుల పాలిట సంజీవి.

సీసా 1 కి రూ. 25-0-0 లు వి. పి. రూ. 1-8-0

★ కావలసిన వారు ఎడ్వాన్సు పంపేది—

డా. రత్నం సన్స్,
మలకపేట బిల్డింగ్స్, హైదారాబాద్ 2.

చేసింది. కాని మానవుడు ప్రకృతిని అధిగమించి, ఆడ పశువులు ఎదయే సమయం చూసి, అట్టి పశువులన్నీ ఉత్తమ జాతి పశువుల్నే సృష్టించేందుకు గాను కృత్రిమగర్భ ధారణా విధానాన్ని అమలు జరుపుతున్నారు. ఆడ పశువు ఎదయేకాలం ఎందుకు ముఖ్యమైనదంటే, అప్పుడే దాని అండ కోశం నుంచి గుడ్డు విడుదలవుతుంది, కనుక ఇది రెండో ఉపయోగం.

జెనిటిక్స్‌ను ఆధారంగా తీసుకోనిదే యీవిధానం విజయవంతంకాదు. సహజ గర్భధారణలో ఆడ పశువునూ మొగ పశువునూ తప్పక కలిపి తీరాలి. కాని కృత్రిమ గర్భధారణలో మొగపశువు ఆడ పశువు దగ్గరకే రానక్కర్లేదు; అసలు ఆ రెండూ ఒకదానొ్నకటి ఎరగక పోవచ్చు. మొగపశువు వీర్యం లభ్యమయితే చాలు. అందుకని ఇండియాలో వున్న మొగ పశు సంతానం, అమెరికాలో కలిగేట్టు చేయవొచ్చు. మొగపశువు అమెరికాపోనక్కర్లేదు.

ఒక్కొకప్పుడు దేశంలోని వాతావరణాన్ని బట్టే ఋతువుకు బట్టీ, ఒక దేశం లోని పశువులతాలూకు ఎదయే కాలము మరో దేశంలోని పశువు ఎదయే కాలమూ భేదించవొచ్చు. అలాటిఇబ్బందివున్నా, వీర్యాన్ని సెలైడ్‌లోఉంచి, రిఫ్రిజిరేటర్‌లో ఉంచటం ద్వారా సంవత్సరాల పర్యంతం చెడకుండా కాపాడ వొచ్చు. అంటే ఒకానొక ఉత్తమ జాతి పశువు చనిపోయినా దాని తాలూకు సంతతిని శాస్త్ర కారుడు సృష్టించ గలుగుతున్నాడు.

ఇక పంటల విషయంలో జెనిటిక్స్‌శాస్త్రం ఎలా ఉపయోగ పడుతోందో చూడు. రెండు రకాల చెరుకు వుంది. మొదటి రకం చాలా బలిష్ఠమైనదే కాని, దాని వేళ్ళు భూమిలోకి లోతుగాపాతుకోలేవు. మరొక రకం సాధారణమైన చెరుకు. ఐతే దాని వేళ్ళు చాలా పొడుగు. యీ రెండిటినీ కలపటం వల్ల బలిష్ఠమైన, పొడ వైన వేళ్ళున్న చెరుకు సృష్టించ వొచ్చునే సత్యాన్ని జెనిటిక్స్ చెప్పగలుగు తున్నాడు. అలాటి చెరకును, ఎడారిలో కూడా పెంచే అవకాశం వుండగలదు!

జెనిటిక్స్ వల్ల మానవుడు ముందుముందు ఇంకా అనేక లాభాల్ని పొందే అవకాశాలున్నవి. జెనిటిక్స్ సహాయమే వుంటే అత్యుత్తమ జాతులే ప్రపంచంలో సృష్టించ బడగల వనటం నిస్సందేహం.





# ప్రదక్షిణ

రచన: ఉషశ్రీ

[గత సంచిక తరువాయి]

—అని రెండు గుక్కలు మంచినీళ్ళు త్రాగి 'అయితే రాత్రి మనం మీమాంస పడ్డ విషయాన్ని గురించి ఏమి టాలోచించావు?' అన్నాడు, వడ్డించిన అన్నంలో వడ్లగింజ తీసి పైన పడేస్తూ.

'అదే ఈరోజు వర్జీనియా, సుశీల, కస్తూరి, ప్రమీల అందరూ అడిగారు. అప్పుడు ఇందిర చెప్పింది. దాని మేనేజిమెంటుకింద వాళ్ళు నాన్నారు ఓ ప్రెస్సు నడప బోతున్నారట. సామానంతా వచ్చేసిందిట. ఎల్లుండి నుంచి పని ప్రారంభిస్తారుట. అందులో ప్రూఫ్ రీడర్ వర్కు చూస్తూ, కాస్తంత ఉత్తరాలు టైపు చెయ్యాలిట. బహుశా ఆయన ప్రెస్‌తో పాటు పేపర్‌కి కూడా డిక్లరేషన్ తీసుకుంటారంది' అని ఆతురతతో భర్తవైపు చూసింది.

'ఇంతకీ నువ్వు ఏమన్నావు?' సాఫీగానే అడిగాడు.

'నేనే మంటానూ, మీరెలా చెప్తే అలా చేస్తాను' అని యథాపూర్వం చూడ సాగింది.

'అదేమిటి మళ్ళీ, నువ్వూ చదువుకున్న దానివి, ఓ పుష్కరం నుంచి కాపరం చేస్తున్న దానివీనూ. నీ నిర్ణయం నువ్వు చేసుకోవొచ్చు. ఒకవేళ నేనే దైనా గట్టిగా అన్నానా, నీ కొడుకుని తీసుకొని నువ్వు రాణీలా వేరే కాపరం పెట్టగలవు' అని నవ్వాడు రామారావు.

రామారావు నవ్వులో నవ్వు లేదు. అందులో ఏవో సూదులు చుట్టు తిరిగాయి. మరేవో సుడిగుండాలు గిర్రు మన్నాయి. ఇంకేవో విష వాయువులు ప్రకోపించాయి.

'అవేం మాటలండీ, మీ కేదన్నా కోపం ఉంటే రెండు తిట్టండి, మరో నాలుగు తన్నండి. అంతే కాని మనిషి మనసు నొప్పించకండి!' అంది కొంచెం కోపంగా.

'తప్పు! తప్పు! తన్నితే ఊరుకుంటారా చదువుకున్న ఆడవాళ్లు! సరేలే అదంతా దేనికి కానీ, నీ నిశ్చయం ఏమిటో చెప్పు' అన్నాడు లాలన అభినయిస్తూ.

'నాకేం నిశ్చయాలు లేవు'

'అలా అని ఇందిరతో చెప్పావా?'

'అది మీరు చెప్ప వలసిన విషయం'

'ఉద్యోగం చెయ్యమని అది నిన్నడిగితే నేనేం చెప్పనూ!'

'మీతో నేను వాదించలేను. చెయ్యి ఆరి పోతోంది. కడుక్కోండి' అంటూ చేతిమీద నీళ్లు పోసింది.

'నాతో సమానంగా ఉండాలనే గా ఉద్యోగం చేస్తానన్నావ్'

'అలా అని నేనన లేదు. అన్నీ మీరు కల్పించు కుంటున్నారు. వచ్చే జీతం చాలక ఇబ్బంది పడుతున్నామనీ, పోనీ చదివిన చదువుంది కదా, పైగా ఎవరి దగ్గరో నౌఖరీ కాదూ - స్నేహితురాలి ప్రెస్సులో ప్రూఫ్ వర్కే కదా-అదయినా అరవై రూకలు యిస్తానంది కనకా...' అని వాక్యాన్ని తుంచేసింది.

'ఇంక మరి నిశ్చయం కాలేదంటావేం?' చేతులు తుడుచుకుంటూ లేచాడు.

'అదీ కాక ఏక్షణంలో కష్టం అనిపిస్తే ఆక్షణంలో చేతులు దులుపుకు వచ్చెయొచ్చు. పిల్లలూ, మీరూ తొమ్మిదిన్నరగా అయేసరికి ఇంట్లోంచి వెళ్ళి సాయంత్రం దాకా రారు కదా. ఎటొచ్చీ నేను ఎనిమిదింటికి వెళ్ళి ఆరింటికి వస్తాను. ఒక్కగంట అటూ, ఇటూనూ' వంటింటి గడప నానుకొని నిలబడి చెప్పింది.

రామారావు వాకిట్లో పచారు చేస్తూ అంతా విని బరువుగా నిట్టూర్చి, సిగరెట్ ముట్టించి-

'ఏదయినా అనుభవానికొస్తే గాని తెలీదులే!' అన్నాడు. అప్పటికే కంచం కడగటానికి వెళ్ళిన సుందరికి ఆ వాక్యం వినబడ లేదు: ఆమె తిరిగి వస్తూండగా-

'సరే కానియ్యి, నువ్వు చేసినా నేను చేసినా పిల్లల సుఖానికే కాదూ' అని మడత మంచం మీద నే నడుం వాల్చాడు.

★

రెండు మూడు మాసాల వరకూ సంసారంలో చెప్పుకోదగ్గ మార్పులేమీ రాలేదు. అప్పుడయినా పెద్ద మార్పేమీ జరగ లేదు. కానీ పరీక్షల్లో రంగడికి సుమారు అన్ని పేపర్లలోనూ పదీ, పదిహేనూ మార్కులు రావటంవల్ల, వాడి కోసం ఓ ట్రైనింగు చదువు కుంటూన్న అమ్మాయిని ట్యూటర్ గా వేశాడు రామారావు. ఏ రిటైర్డు మేష్టారినో వెయ్యాలనుకున్నాడు గానీ, తనకు చిన్నప్పుడు చదువు చెప్పిన తెలుగు మేష్టారు స్వయంగా వచ్చి 'మా భారతి నిరుడే డిగ్రీ తీసుకుంది. ఈ ఏడాది ట్రైనింగు అయిపోతే దాని తిప్పలు అది పడుతుంది. సాధ్యమయినంత వరకూ దానికి డబ్బులోటు రాకుండా నేనే చూసుకుంటాను గానీ, వీలు చిక్కితే రెండు ట్యూషన్లు శుభ్రమయినవి కుదిర్చిపెట్టు' అని మరీ మరీ చెప్పటం వల్ల ఆ ఉపకారం తనే చెయ్యటానికి నిశ్చయించుకున్నాడు. ఈ విషయం వారం, పదిరోజుల వరకూ సుందరికి తెలీలేదు,

అసలు మూడోనాడే తెలిసేది కాని ఆ ఆదివారం ప్రెస్సుకి అర్జంటుపని తగిలి వెళ్ళి పోయింది. మరుచటి ఆదివారం తొమ్మిదింటికి పిల్లలు పుస్తకాలు తీసుకొని 'చదువుగది' లోకి వెడుతోంటే సుందరి పిలిచి అడిగింది. అప్పుడు జరిగిన విషయం రంగడు చెప్పాడు. సుందరి నవ్వేసి ఊరుకుంది. అయినా తనతో ఎందుకు చెప్పలేదా అని ఆలోచించింది. కానీ అదేమంత తెలిసికో వలసిందిగా కానీ, పనిగట్టుకు చెప్ప వలసిందిగా కానీ తోచలేదు.

ఇది జరిగిన పదిహేను రోజుల తరువాయి ఒక నాడు ఆలస్యంగా ఇంటికొచ్చేసరికి, వంటింట్లో పోపు పెడుతూన్న వాసన తగిలి, కిలకిలా నవ్వుతూ చరచరా వంటింట్లోకి నడిచింది. వంటింట్లో అడుగు పెడుతూనే తెల్లబోయి నిలబడింది. బాగా పొద్దు పోతుందేమోనని రామారావే చెయ్యి కాల్చుకుంటున్నా డనుకుంది కానీ, అక్కడ రామారావు కాక ఓ నలభై యాభై యేళ్ళ వయస్సుగల స్త్రీ ఉండడం చూసి, ఒక్క క్షణం ఆగి రామారావు గదిలోకి వచ్చింది.

పేపరు చూస్తూన్న రామారావు అడుగుల చప్పుడు విని, పేపరు కదపకుండానే కిందనుంచి చూసి, పోల్చి మళ్ళీ పేపరులోకి దృష్టి పోనిచ్చాడు. ప్రక్కనే చిన్న కుర్చీలో కూర్చుని రంగడు కంఠమెత్తి—

'త్రిజగన్మోహన నీలకాంతి తను వుద్దీపింప...' అని ఆపేసి తల్లివైపు చూసి-

'నాన్నా-అమ్మ' అన్నాడు.

ఈ సారి రామారావు తప్పని సరిగా పేపరు మడిచేసి క్రిందనుంచి, లేని నవ్వు తెచ్చిపెట్టుకుని:

'అంత కంగారు ప్రెస్సులో పని ఎక్కువ అవుతూన్నట్టుంది. అయినా వాళ్ళ కంపెనీలో గంటకు అయిదు రూపాయల చొప్పున ఎక్కువ యిస్తారనుకుంటా. అదంతా దొరల కంపెనీలాగా నడుస్తుందిలే. బహుశా ఈ నెలలో జీతం కంటె ఎక్స్ట్రా టైముకే ఎక్కువ వస్తుందేమో - అదేమిటి - అలానే నిలబడి పోయావు. ఇలారావచ్చి కూర్చో' అని ప్రక్కకు వంగి సిగరెట్ పెట్టి తీసి ఒకటి ముట్టించాడు. సుందరి డ్రాయరు దగ్గరగా వచ్చి, దాని చివర అనీ అనకుండా కూర్చుని 'రెండు, మూడు రోజులిలా ఉంటుందంతే. ఏదో గవర్నమెంటు వర్కు చేస్తున్నారు. ఈ వేళ రెండు జడ్జిమెంట్సు వచ్చాయి'

'ఔను-అన్నట్టు డిస్ట్రిక్టు కోర్టువాళ్ళు ఈ నెలనుంచి మీ ప్రెస్సులో యిచ్చారని విన్నాను. ఇంగ్లీషు స్పెల్లింగులూ అవీ నీకు బాగా వస్తాయింక' అని నవ్వాడు, వెనక్కు వాలి కన్నులెత్తి చూస్తూ.

ఒక్కక్షణం సుందరి ఏమీ మాట్లాడలేదు.

'కప్పలు బెక బెకమనును. కాకి కావు కావు మనును. ఆవుఅంబా అని అరచును అరటి చెట్టు...' అని గణగణ చదువుతోంది అక్క.

'ఇదేమిటే! అమ్మ దగ్గర నువ్వు నాలుగో క్లాసు పుస్తకం వొదలెట్టి ఇప్పుడు మళ్ళీ కప్పలు బెక బెక మంటున్నావేమిటే?' అని నవ్వాడు రంగడు.

'ఏమో, మా బళ్ళో ఇదే చదవమన్నారు' అని మూతి ముడిచింది.

'నాకీ పుస్తకం అయిపోయిందని చెప్పలేక పోయావా?' అన్నాడు రామారావు.

'అలా చేస్తే కొత్త పుస్తకంలో పాఠం నాకు రావటం లేదు. అసలు నేను స్కూలుకి వెళ్ళను నాన్నా. అమ్మ దగ్గరే చదువుతాను' అని తల్లి దగ్గరగా వెళ్ళి కాళ్ళమీద వేళ్ళాడింది.

'అమ్మ ఒక్కత్తీ అటు ఆఫీసు పనీ చేస్తుందా? మీకు చదువూ చెప్తుందా? ఇంటి పనులే చూసుకుంటుందా?' అని భార్యవైపు చూసి తల పైకెత్తి డాబా దూలాల మధ్యకు దృష్టి పోనిచ్చాడు.

'స్కూలు మానకూడదమ్మడూ. అస్తమానం ఇంటి దగ్గర కూర్చుంటే అల్లరిపిల్ల అంటారు అందరూ' అని బుగ్గలు పుణికింది సుందరి.

'అమ్మో! నాకాకలేస్తోందే' అని కుర్చీ దిగాడు రంగడు.

'వంటింట్లో ఆవిడెవరూ?' అంది మెల్లిగా సుందరి.

'దాని ఆకారం, పనీ చూస్తే తెలీ లేదూ, దాని ఉద్యోగ మేమిటో?' అని నవ్వాడు.

'ఈవిడ అవసరం?' అని కొంచెం కౌతుకంగా చూసింది.

'ఒక్కసారి గడియారం కేసి చూడు. ఎనిమిదవుతోంది. మధ్యాహ్నం ఒంటి గంటకు తినివెళ్ళారు పిల్లిద్దరూ. ఆ రింటికి నేనొచ్చాను కనక ఆగారు కానీ లేక పోతే వీళ్ళు పద్మావతిని పిలిచి అన్నం వండి పెడతావా? వస్తావా? అని అడగటానికి సిద్ధంగా ఉన్నారు. తక్షణం వెళ్ళి హోటల్ సుబ్బయ్యను పిలిచి నిమిషాల మీద వంటమనిషి కావాలన్నాను. చక్కా వచ్చింది. నువ్వో రెండువందలూ, నేనో రెండువందలూ తెస్తున్నప్పుడు మనకు మాత్రం ఒక వంటమనిషీ, ఒక ప్రైవేటు మాష్టరూ, నౌకరు కుర్రాడూ అవసరం కాదంటావా? పైగా ఇంత శ్రమ పడి వచ్చి నువ్వు మళ్ళీ వంట పొయ్యి దగ్గర కూర్చోవటం నాకిష్టం లేదు. డబ్బుంటే ఎన్ని సుఖాలయినా అమరుతాయి...ఒక్కటి తప్ప...' అని నిట్టూర్చాడు.

'ఏమిటా ఒక్కటీ?'

'అబ్బే ఏం కాదులే...చూడూ, వంటింట్లోంచి ఆవిడ పిలుస్తున్నట్టుంది. అన్నీ చూపించాను. ఉప్పు బుట్ట కనపడ లేదేమో' అని కుర్చీలోంచి లేచాడు.

'నాన్నా, అమ్మ అలా నల్ల బడిపోతోందేం?'

'అంతే నేమిటీ, నిన్న పద్మావతి పిన్ని అడిగిందీ-మీ అమ్మకి ఒంట్లో బావుంటం లేదా? అలా చిక్కిపోతోందీ?' అని. నిజం కాదూ నాన్నా' అని లక్ష్మి, రంగడు—రామారావుని నిలేసి ప్రశ్నించారు.

'మీ మొహం. అమ్మ చిక్కటమూ లేదు, నాన్న నీరసించటమూ లేదు. పద్మావతికి కొద్దిగా కంటి జబ్బున్నట్టుంది. ఒక్కసారి నేత్రవైద్యుణ్ణి కలుసుకోమను' అని నవ్వేసి లక్ష్మిని ఎత్తుకు ముద్దాడాడు.

★

ఏకాంత పఠనానికి



కోక్కోక శాస్త్రం: వశీకరణము, వివిధ రతి భంగిమలు, అత్యంతోపయుక్తమైన అనేక ఇతర వ్యాసాలతో, ఇదివరకెన్నడూ మీరు చదివి ఉండని విషయాలతో నిండివుంది.

పడక గది చిత్రాలు: స్త్రీత్వం లోని సౌందర్యాన్ని వివిధ భంగిమల్లో చూడదలుచుకుంటే, 50 ఫోటోల సెట్టుకు నేడే ఆర్డర్ చేయండి.

పై రెండూ కలిపి రూ 6/

H. H. STORES (A. M.).
Post Box 51, Meerut U. P.


ప్రతిరోజుకీ ప్రత్యేకత ఉంటుంది. ప్రతిజీవికీ ప్రతిరోజూ ప్రత్యేకంగా కనిపించదు. ఒక్కోరోజు ఒక్కో వ్యక్తి జీవితానికి ఎంతో ముఖ్య మయినదవుతుంది. అలాగే ప్రతిజీవికీ ప్రత్యేకత ఉండక పోదు. ఈ ప్రత్యేకత పరిసరాల, అవకాశాల, ఆధారాల మీద, అలంబనం మీద ప్రాకుతు పోయినప్పుడు మాత్రమే గోచరిస్తుంది. రోజును నడిపించే వ్యక్తులున్నట్టే, వ్యక్తుల్ని నడిపించే రోజులుంటాయి కాబోలు-అనుకుంటూ స్టాపింగులో బస్సు దిగింది సుందరి. ఆమె ఇంత ఆలోచించేది కాదు, మామూలుగా. బస్సు ఎక్కుతుండగా, (కాలేజీ కుర్రాడే కాబోలు) నడిచిపోతూ చెంగులాగాడు ఉదయం. ఇప్పటికిప్పుడు రద్దీగా ఉన్న బస్సులో నిలబడ్డ వెధవెవడో ఓసారి ఆగుతుండగా తూలినట్లుగా తూలి భుజంమీద చెయ్యేసి, మీదపడ్డాడు. పడింది కాక 'సారీ' అని దీనంగా చూస్తూ నవ్వాడు. ఇంతేనేమో ఈ లోకం! ఈ వెధవాయిలందరికీ సకాలంలో ఎందుకు పెళ్ళిళ్ళు చెయ్యరో. కాలేజీ అనే అచ్చోసి అంబోతుల్లా లోకం మీద వదిలేస్తారు. ఛీ! అనుకుంటూ ఇంట్లో అడుగు పెట్టింది.

'ఆరు గంటలయితే ఆకలి లేక పోవడమేమిటీ? వేసినంతే తినండి' అని వంటమనిషి పిల్లల్నిద్దర్నీ చెరో రెక్కా పుచ్చుకు తీసి కొడుతున్నది. కోపం వచ్చింది సుందరికి. ఛా, మడా రెండు కేకలు వెయ్యాలనుకుంది, వంటావిడను. కాని ఎందు చేతనో అంతపనీ చెయ్యలేక పోయింది.

'పోన్లెండి మామ్మగారూ, వాళ్ళకు ఆకలి వేసినప్పుడే తింటారు' అని జోడు గోడవార విడిచి, గదిలోకి నడిచి చీర మార్చుకుని, జాకెట్టు తీసేసి స్నానాల గది వైపు నడిచింది.

'ఆరింటి కల్లా పిల్లలకి అన్నాలు పెట్టేయమని ఓసారి చెప్పి, మళ్ళీ వాళ్ళకి ఆకలేసినప్పుడు తింటారంటే నాకు సాగదు. ఏదో ఓ తీరూ, తెన్నూ ఉండాలి' అని గొణుక్కుంటూన్నది వంటావిడ దొడ్లో తులసి కోటకి నడుం చేర్చి కూర్చుంటూ.

స్నానాల గదిలో నీళ్ళు లేక పోయే సరికి, నూతి దగ్గరకు వచ్చి తోడుకుని కాళ్ళూ చేతులూ కడుక్కుని ముఖం దిద్దుకుంటూ, 'మామ్మగారూ, ఆయన

కాలేజీనుంచి రాగానే నీళ్ళు పోసుకోవటం లేదా?' అని ప్రశ్నించింది.

'ఏమోనమ్మా, నాకేం తెలుసూ...' అని సాగదీసుకుంది.

ఈ జవాబు సుందరికి మరీ చికాకు కలిగించింది. ఏమిటీ పెడసరపు జవాబు. కూటికోసం చాకిరీ చేస్తూ ఇంటి యజమానురాలికిచ్చే జవాబిలాగేనా ఉండాల్సింది!

'అయితే ఆయన రాత్రి భోజనం చేస్తున్నారా?' అని ప్రశ్నించింది.

'చేస్తూనే ఉంటాడు. రాత్రి ఏ తొమ్మిదింటికో వస్తే నాకెక్కడ వీలవుతుందీ పెట్టడానికి! ఎనిమిదింటి కల్లా శివాలయంలో స్వాములారి గీతా సందేశము వినటానికి వెళ్ళాలి కదా. ఈ వయస్సులో నైనా ఆ పరమార్థ సాధన చెయ్యకపోతే నాకు ముక్తేదీ!' అని చెంగుచుట్ట బెట్టుకుని, తలకింద దిండుగా ఉంచుకుని నడుంవాల్చింది.

సుందరికేమీ అర్థం కాలేదు. ఎన్నాళ్ళనుంచి యిలా సాగుతున్నదో కూడా తెలీలేదు. తెలిసినా తను చెయ్యగలిగిందేమీ ఉన్నట్టుగా కనిపించ లేదు. ఇప్పు డీవిడ మీద ధూం-ధాం చేస్తే ఈ విడీ పనికాస్తా మానేసి గీతాస్వాముల వారి వెనకాలే బయల్దేరేట్టుంది. ఈ కాస్త గోడు చెడగొట్టుకోవటం దేనికి - అనుకుంటూ వాకిట్లోకి వచ్చి-

'రంగా, చెల్లాయిని తీసుకురారా, అన్నాలు తినేద్దాం' అంది, చెంపలు దువ్వుకుని బొట్టుపెట్టుకుంటూ.

'నేను నాన్నతో తింటా' అని మెల్లిగా అంది లక్ష్మి.

'నాన్న పొద్దు పోయే దాకా రారమ్మా. ఈలోగా నువ్వు నిద్రపోతావు. దాన్ని తీసుకురారా' అని వంటింట్లోకి నడుస్తూ—

'పిల్లలికీ, నాకూ అన్నాలు పెట్టండీ' అంది సుందరి.

'నువ్వుండగా నేనెందుకమ్మా. కన్న పిల్లలకి ఆర్నెల్లకో మాటయినా అన్నాలు పెట్టుకోలేక పోతే కనటం దేనికీ' అని ముసిలావిడ అరచేతిలో రామకోటి వ్రాసుకో సాగింది.

రంగడికి మాచెడ్డ కోపం వచ్చింది. వంటలక్క మాటలు అమ్మను ఎంత వేధిస్తాయో రంగడికి పూర్తిగా తెలీకపోయినా, అమ్మని అలా ఎకిరించటం రంగడికిష్టం లేదు. లేకపోయినా తనేమన్నా అంటే అమ్మ తనను కేకలేస్తుందేమోనని జంకి ఊరుకున్నాడు. సుందరి ఏమీ మాట్లాడకుండా కంచాలు పెట్టేసి అన్నాలు వడ్డించింది. మౌనంగానే భోజనా లవుతున్నాయి. భోజనా లవుతున్నంత సేపూ ఏదో ఆలోచిస్తూనే ఉంది సుందరి. తీరా లేస్తూండగా చూసే సరికి పిల్లలిద్దరూ మరీ గుప్పెడు మెతుకులు తింటున్నట్టని పించింది. అని పించింది కానీ మధ్యాహ్నం ఏదో తిని ఉంటారు. అంచేత అలా తిన్నారనుకుని వసారాలోకి వచ్చేసింది.

అప్పటి కప్పుడే అమర్చబడిఉన్న ప్రక్కమీదకుజారింది సుందరి. డ్రాయరు మీది పేపరు చూస్తూ, వక్కపలుకు నోట్లో వేసికొని తలవైపునున్న ఫాన్ స్విచ్ ఆన్ చేసింది. పేపర్లో అక్షరాలేం సుందరికి కనిపించటం లేదు. పిల్లలిద్దరూ

మరీ చిక్కి పోయినట్టు కనిపించారు. పిల్లలే కాదు-తనూ అలానే అవుతూన్నట్టుగా తోచింది. అద్దంముందుకు వెళ్ళి నిలబడింది ఒక్కక్షణం కన్న అద్దంలో తనను తాను చూసుకో లేక వచ్చి పడుకుంది.

'ఎల్లకాలం ఒక్కలా ఉంటామా?' అని తృప్తి పరుచుకుంది.

పిల్లలు నీరసంగా పుస్తకాల ముందు కూర్చుని మూలుగుతున్నారు.

'అయ్యో, నా మతిమండిపోనూ. సుందరమ్మా, మీ కన్నా తెలీలేదూ. నేను అలా భగవద్ధ్యానం చేసుకుంటుండగా అలా కునుకుపట్టేసరికి, దీనమ్మ కడుపు కాలా, దీని నాలిక గాద్దలకెయ్యా, ఆ బట్టలకుక్క అన్నం ముట్టుకుందే; ఆ గిన్ని అవతల పారేశాను. ఇప్పుడింక స్నానం చేసి అన్నమేం తగలెయ్యనూ. పైగా బియ్యం నిండుకున్నవాయె. లేచి తలుపేసుకో వమ్మా. నేను గుళ్ళోకి వెడుతున్నా' అని కదిలి పోయింది.

సుందరి తెల్లబోయింది. అసలేమిటీ వ్యవహారం! ఇప్పుడాయనొస్తే అన్నం లేదన్నమాట. స్నానానికినీళ్ళు లేవు. తిండికి అన్నంలేదు. బాగానే ఉంది వ్యవహారం. బియ్యం అయిపోయాయంటుందేమిటీ? ఎంత ఇదయినా ఇంకా గుండెత్తుండాలి. అసలీవిడ వ్యవహారం తనకేమీ బోధపడ లేదు. ఇంకా కొంపలో ఏవి ఎలా తగులడు తున్నాయో అర్థం కాలేదు. ఇలా ఆలోచిస్తూ ఉండి పోయింది.

రామారావు లోపలకొచ్చి, బట్టలు విడిచి, మంచం మీదున్న సుందరి వైపు చూచి, నూతి దగ్గరకు పోయి స్నానం చేసి వస్తూ తలుపులన్నీ వేసి-

'రంగా, ఈ రోజు కూడా అన్నం కుక్క ముట్టుకుందా? పాపం! మన వంటమామ్మ గారికి భూత దయ హెచ్చురా. ఇంతకీ ఈ యింట్లో నాకు రెండో పూట తిండి తినే యోగంలే దేమో!' అని నిట్టూర్చాడు. సుందరి కన్నులు చెమర్చాయి.

(ఐ పోయింది)





# లైంగిక స్వేచ్ఛ

ఇష్టానుసారంగా కామోద్రేకాన్ని తీర్చుకునేందుకు అనేక మంది స్త్రీ పురుషులు ప్రయత్నిస్తూండటం యీ నాటిది కాదు. ఇందువల్ల అనేకుల జీవితాలు సర్వనాశనమవటమేగాక, వారి కుటుంబాలూ, ఆత్మీయులూ అంతాశ జీవితాన్ని గడపవలసి వచ్చింది. ఇలాంటి ప్రవర్తనల కారణంగా ఎన్నో దాంపత్యాలు భగ్నమైనవి. ఐతే యీ 'స్వేచ్ఛ' మానవునికి అవసరమా? అవసరమైతే దీనికి హద్దు పద్దు లేమిటి? ఏ కారణంగా వీరు గాడి తప్పిన జీవితాలకు అలవడుతున్నారు? వీరికి తరుణోపాయమేమిటి? ఇలాంటి అనేక ముఖ్య విషయాల్ని యీ వ్యాసంలో చర్చిద్దాం:

డాక్టర్ ఆల్ ఫ్రెడ్ కిన్సీ అతని అనుచరుల పరిశీలన ఫలితంగా తయారుచేసిన రిపోర్టులో 'పురుషుని లైంగిక ప్రవర్తన'ను గూర్చి ఇలా వుంది. నూటికి 85 మంది పురుషులు వివాహానికి పూర్వమే లైంగికానుభవాన్ని పొంది వున్నారు; నూటికి 30 మంది వివాహానంతరం కూడా వేరు వేరు తావుల్లో తమ కామ వాంఛల్ని తీర్చుకుంటున్నారు.

ఐదు సంవత్సరాల తర్వాత కిన్సీ అతని అనుచరుల పరిశీలనలో 'స్త్రీ లైంగిక ప్రవర్తన'ను గూర్చిన రిపోర్టు ఇది; నూటికి 50 మంది వివాహానికి ముందే లైంగికానుభవాన్ని పొందుతున్నారు.

వ్యక్తిగతమైన స్వేచ్ఛకోసం మానవులు మొదటి నుంచీ పోరాడుతూనే వున్నారు. సమాజం ఏర్పరచిన హద్దుల్ని అతిక్రమించయినా సరే, వ్యక్తిగత సౌఖ్యం కోసం చాటుమాటుగా పాల్పడుతున్నారు; మరికొంత మంది తెగించి, సమాజాన్ని ఎదిరించైనా సరే, తమ వాంఛల్ని తీర్చుకుంటూనే వున్నారు. యీ స్వాతంత్ర్య పిపాస యువ్వనంలో, లైంగిక పిపాసగా పరిణమించటం సహజం. కట్టుకు అనేవి స్వాతంత్ర్యానికి ప్రతిబంధకాలు కనుక, వాటిని ఎదిరించటం జరుగుతోంది.

నేటి యువతీ యువకులు ప్రణయానికి ఎంతో విలువ నిచ్చి, ప్రణయ కారణంగా తమ తమ కుటుంబీకుల్ని, అవసరమైతే సమాజాన్ని కూడా ఎదిరించి వివాహాలాడటం మనం చూస్తూ నేవున్నాం. అలాటి పవిత్ర వైవాహిక జీవితాన్ని గూర్చిన చర్చ అనవసరం. కాని ఇదే స్వేచ్ఛను హద్దు పద్దులేకుండా ఆరాధించటం వల్ల సామాజిక జీవితం ఎలా కలుషిత మవ గలదో తెలుసుకోవలసిన అవసరం వుంది. అందుకని లైంగిక స్వేచ్ఛా స్వరూపం ఎలా వుంటుందో, కొన్ని కొన్ని సమాజాలవారు యీ స్వేచ్ఛను ఎంత వరకూ అనుమతించారో, అందుకు కారణాలూ, లేదా లాభనష్టాలు ఏమిటో ముందుగా తెలుసుకుందాం:

కొన్ని ఆదిమ సమాజాలువారికి మునుకు లైంగిక స్వేచ్ఛను ఆమోదించినవి బహుశా తనకు అనుకూలమైన వధువును, లేదా వరుణ్ణి అనుభవ పూర్వకంగా ఎన్నుకునే ఉద్దేశ్యమే కావొచ్చు. ఆయా సమాజాల్లో వ్యభిచారం నిరశించబడి, కఠినంగా శిక్షించబడట మంటూ వుంది; ఐతే దాంపత్యం ఆరంభమైన తర్వాత, లైంగిక వాంఛల్ని దాంపత్యం పరిధికి బైట తీర్చుకోవటాన్నే వారు వ్యభిచారంగా పరిగణిస్తున్నారు.

మరికొన్ని సమాజాల్లో బహుభార్యాత్వం నేటికీ ఆమోదించబడుతూనే వుంది; మతప్రవక్తలే బహుభార్యాత్వాన్ని ఆదేశించారు. మతైక ఆచారంగానే ఆయాసమాజాలు బహుభార్యాత్వాన్ని అమలు జరుపుతున్నారు. ఇదికూడా లైంగిక స్వేచ్ఛకు సంబంధించిందే. పోతే నాగరికత మాత్రం ఏక పత్నీత్వాన్ని విధిగా అనుసరించాలని శాసిస్తోంది. డా కిన్సీ రిపోర్టులు చూశాక, సమాజంలో స్త్రీ పురుషుల లైంగిక

నేడే చదవండి!

ఉమ్మర్ ఖయ్యాం

త్రివర్ణ ముఖచిత్రంతో, భావస్ఫోరకమైన 18 వర్ణ చిత్రాలతో, మధురమైన పద్యాలతో, ఆర్టు పేపరుపై ముద్రించబడి, ఆకర్షణీయంగా తయారయింది. మొదటి ముద్రణ కాపీలు అందని వారంతా నేడే తమ కాపీని రిజర్వు చేసుకోండి.

వెల 0-8-0 మాత్రమే!

ఏజెంట్లకు 25% కమీషను.

జ్యోతి కార్యాలయం, మద్రాసు-17.

స్వేచ్ఛ పెచ్చు పెరుగుతూనే వుంది కనుక, చివరకు సమాజం ఒక విధంగా దీన్ని అంగీకరించి తీరవలసిన పరిస్థితులు ఏర్పడుతవేమోననే భయం కొంత మందికి కలగటంలో ఆశ్చర్యం లేదు.

సమాజాలుసాధారణంగా లైంగికస్వేచ్ఛను అరికట్టి,సామాజికశాంతి,కుటుంబ విస్తరణ, బాధ్యతల్ని అమలు జరిపేందుకే ప్రయత్నించినవి. ఐతే ఏ పండుగ పబ్బాలలోనో, తిరునాళ్లలోనో, మతైక ప్రాధాన్యత గల వేరొక సందర్భంలోనో, సమాజము తన నిబంధనలను సడలించి, లైంగిక స్వేచ్ఛనివ్వటంకద్దు. గ్రీకులో ఎలూసినియన్ పండుగలో ధనికులందరూ స్వేచ్ఛాను సారంగా కామ తృప్తి తీర్చుకోవటం ఒక ఆచారంగా వుండేది. ఇండియాలో వసంతోత్సవం యీ జాతికి చెందిందే! ఇలాగే ప్రతి సమాజంలోనూ సంవత్సరంలో కొన్ని రోజులు లైంగిక స్వేచ్ఛకొరకు ప్రత్యేకించబడినవి. క్రమేణా ఆయాపండుగల స్వరూపం మారి, లైంగిక స్వేచ్ఛకు ప్రాధాన్యము తగ్గిపోయింది.

లైంగికస్వేచ్ఛకొరకు మానవుడు ఎందుకు ప్రయత్నించాలి అనేప్రశ్నను రెండు కోణాలనుంచి పరిశీలించవలసింది. కారణాలు పురుషుల పట్ల ఎలా ఉంటవో, స్త్రీల పట్ల ఎలా ఉంటవో, వాటి స్వరూపాలు జీవితంలో తమ పలుకు బడులతో ఎలా పెడదార్లు తొక్కిస్తవో చూద్దాం.

ముఖ్యంగా పురుషుని తత్వం, జీవితమంతా ఒకే స్త్రీతో గడపటానికి అనుకూలంగా లేదు. సృష్టి విస్తరణకు ఇదొక ప్రధానాంశమే కావొచ్చు. పురుషుడు తన స్త్రీని విసర్జించాలనీ, వేరొక స్త్రీతో సంబంధాన్ని ఏర్పర్చుకోవాలనీ ప్రయత్నించటం సహజంగా కనిపిస్తుంది. ఇక స్త్రీ తాను నమ్మిన పురుషుడి కోసం ఎంత త్యాగానికైనా వెనుదీయక, అతన్నే ఆరాధించాలని ప్రయత్నించటం సహజం. నాగరికతతోపాటు వొచ్చి పడిన సాహిత్యం, చిత్రాలు, నాటకాలు, ప్రణయాల్ని సులభ సాధ్యం చేసిన వాహనాలూ మొదలైన వాటితో పాటు, ఆర్థిక సంబంధమైన ఇబ్బందులు కూడా కలిసి, లైంగిక స్వేచ్ఛ కొరకు పురుషుల్ని పురిగొల్పుతున్నవి. ఆరోగ్యకరమైన ప్రణయ పూరిత దాంపత్యం ఎలా సాధ్య పడుతుందో గమనిస్తే, ఏయే కారణాలుగా లైంగికానుభవాల కోసం సంసారులు వేరుమార్గాలను అన్వేషిస్తున్నారో తేలికగా అర్థమవగలదు.

మానవునిలో సహజంగా, విరుద్ధజాతిలో ఒక వ్యక్తిని హృదయపూర్వకంగా ప్రేమించటం సహజమే గాక, సుసాధ్యంకూడాను. ఆ తర్వాత తన అభిరుచులకూ తత్వాలకూ సరిపడే వ్యక్తిని ఎన్నుకోవటం, ఆ వ్యక్తి ద్వారా తాను పొందే వివిధ అనుభూతులకు శారీరకంగానూ, మానసికంగానూ విడుదలను పొందటం. ఇలాటి ప్రణయం పరిపక్వమయేందుకు ముఖ్యంగా చిన్నతనంలో వ్యక్తి పొందిన శిక్షణ, చిన్ననాటి అనేక అనుభూతుల సారాంశమూ పెద్ద కారణాలు,

ఉదాహరణకు—చిన్న తనంలో ఎంతో ఆపేక్షతో చూడబడి, తల్లిదండ్రుల మధ్య అనురాగమున్న కుటుంబంలో పెరిగిన వ్యక్తికి, ప్రణయమంటే ఏమిటో పరిపూర్ణంగా అర్థమౌతుంది; అతను పెద్ద వాడయాక నిత్య జీవితంలో ఆ అనురాగాన్ని ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నించి సఫలీ కృతుడౌతాడు. అతను ప్రేమించగలడు: ప్రేమించిన వ్యక్తి ద్వారా తన అనుభూతులను తృప్తి పరుచుకోనూ గలడు. ఇలాటి వ్యక్తికి లైంగికానుభవం, తన యొక్క ప్రణయాన్ని వెలిబుచ్చేందుకు ఒక అడ్డదారి లాటిది.

చిన్నతనంలో తల్లి దండ్రుల నుంచి సరైన అనురాగాన్ని పొందలేక, వారి మధ్య నిత్యం జరిగే సంఘర్షణలకు ప్రేక్షకుడైన వ్యక్తి, పెరిగి పెద్దయాక, అనురాగమంటేనే నమ్మలేని వాడుగా తయారౌతాడు. అతని లైంగికానుభవం అసంతృప్తికరంగానూ, బాధాకరంగానూ తయారౌతుంది. ప్రేమించబడని వానికి, ప్రేమించటమంటే ఏమిటో అర్థమవదు. దాంపత్యంలో అతను పొందే అసంతృప్తి ఫలితంగా, నిజమైన అనురాగం కోసం అతను ప్రపంచాన్ని గాలించ సాగుతాడు. దాని రూపమేమిటో తెలియదు; ఎక్కడున్నదో తెలియదు; సాధించే మార్గమేమిటో తెలియదు. గుడ్డివాడి మాదిరి నడక సాగిస్తాడు. ముందు వెనుకలు చూడకుండా, అనేక మంది స్త్రీలతో సంబంధాల్ని ఏర్పరుచుకుంటాడు. ఐతే ఇందువల్ల రోజు రోజుకూ అశాంతి పెరగటం తప్ప, తన సమస్య తీరదు. స్వేచ్ఛానుసారంగా లైంగికానుభవాల కోసం పరుగులెత్తే వ్యక్తుల్లో—మానసిక సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తుంది; అనురాగాన్ని వెల్లడించేందుకు శక్తిలేదు. ఇదొక వ్యక్తిగతమైన లోపమనే చెప్పాలి.

విశేషంగా వ్యభిచరించే వ్యక్తుల్ని గూర్చి వారిలో 'కామవాంఛ చాలా అధికము' అనే అభిప్రాయాన్ని మనం సర్వసామాన్యంగా వింటూంటాం. ఇది నూటికి కనీసం 90 పాళ్లు అసత్యం. ఏ కొద్దిమందిలోనో ఇది నిజం కావొచ్చు. అథవా ఒక వ్యక్తిలో కామవాంఛ ఉండవలసిన దానికి కొన్ని రెట్లు ఉన్నదను కున్నప్పటికీ, అతనా వాంఛను దాంపత్య జీవితంలోనే ఎందుకు తృప్తి పరచడు? అంత కామవాంఛా అతని స్త్రీలో లేనందువల్ల, లేదా దాంపత్యంలో పరిపూర్ణ తృప్తిని పొందలేని కారణంగా, ఆ వ్యక్తి వ్యభిచారిగా మారుతున్నాడనే వాదనకు తావున్నది. ఐతే కామవాంఛ కేవలం శారీరకమైనదని ఏ శాస్త్రజ్ఞుడూ ఒప్పుకోలేడు. మానసిక, శారీరక సమ్మేళనమైన యీ వాంఛను, కేవలం శారీరకంగానే చూసినట్లయితే, శారీరకంగా శక్తి నశించే వరకూ, ఆ వ్యక్తి వ్యభిచారాన్ని మానలేడు; అప్పటికి అతనికి సంపూర్ణ కామతృప్తి కలిగి ఉండాలి. కాని అలా జరగటం లేదు, సరికదా, అతను రోజు రోజుకూ అశాంతికి గురవుతున్నాడు. దీన్నిబట్టి, మానసికమైన తృప్తి కూడా లేనిదే ఏమీ ప్రయోజనం ఉండదని నిర్థారణగా చెప్పవలసి వుంటుంది.

అమెరికాలో సుఖవ్యాధి నివారణ శాఖ అంచనాల ప్రకారం, అవివాహితులకన్న, వివాహితులే వ్యభిచారం అధికంగా చేస్తున్నారని తేలింది. యీ 'అధికం'

ఎక్కువ మంది వ్యక్తుల్తో ఎక్కువ సార్లన్నా కావొచ్చు. లేదా తక్కువ మంది వ్యక్తుల్తో ఎక్కువ సార్లన్నా కావచ్చు. అంచనాల్ని బట్టి చూస్తే దాంపత్య జీవితంలో ఆయా వ్యక్తులు ఆశించిన, లేదా ప్రయత్నించి విఫలులైన తృప్తి కొరకు, వ్యభిచారాన్ని సాధనంగా ఉపయోగిస్తున్నారని తేలుతుంది. ఐతే వ్యభిచారం యీ సమస్యను ఏ విధంగానూ తీర్చలేదు సరి కదా మరింత క్లిష్టపరుస్తుంది. అన్నిటికన్న విచిత్రమైనదేమంటే ముందు వెనుకలు చూడకుండా వ్యభిచారులైన వారిలో అత్యధికులకు లైంగిక విషయాల్ని గూర్చి తమ తల్లి దండ్రుల నుంచి ఏ విధమైన శిక్షణా లేదు; దీన్నిబట్టి తమ చుట్టూవున్న కలుషితమైన వాతావరణ ప్రభావం వల్లనో, లేదా తమకు తామే పిచ్చి పిచ్చిగా ఆలోచించుకొనే వీరు వక్రమార్గాల పడ్డారు; ఒక విధంగా వారి అమాయకత్వమే వారి జీవితాలకు హాని చేసిందనే చెప్పాలి.

లైంగిక స్వేచ్ఛను అమలు జరిపే కారణం విశేషంగా తాగటమనే వాదన వుంది. కాని విశేషంగా తాగే వ్యక్తి; తన బాధల్ని మరిచి, మత్తుగా వుందామనే వుద్దేశ్యంతో బయలుదేరటం సర్వ సామాన్య విషయం. నిజానికి ఎక్కువగా తాగిన వాడు వొళ్ళు తెలియక పడిపోవటం వల్ల, వ్యభిచారి కాలేడు; అథవా లైంగికానుభూతిని కోరినట్లయితే, పూర్తిగా తెలివిలో ఉన్నవాడికన్న హానికరంగా వ్యభిచరించలేడు; ఎందుకంటే మత్తెక్కిన శరీరానికి జ్ఞానేంద్రియాలు సరిగా పని చేయవు కనుక/ అలా కాక, మత్తు పదార్థాల సేవవల్ల, కామవాంఛల్ని పెంపొందిస్తే పెంపొందించవచ్చు; లేదా అలా అనిపించవొచ్చే కాని, అది నిత్యజీవితంలో కామాన్ని ప్రజ్వరిల్ల చేయుమనేది కాచి వడబోసిన సత్యం. అందువల్ల త్రాగుడు కారణంగా లైంగిక స్వేచ్ఛ అమలు జరుపబడుతోం దనటం సబబనిపించదు.

పెరిగి పెద్దవ సాగాక, వ్యక్తిగత స్వాతంత్ర్యం కోసం ఉవ్విళ్లూరటం, ఎలాగైనా దాన్ని సాధించాలని గట్టి ప్రయత్నాలు చేయటం సర్వ సామాన్య విషయం. ఐతే మరొక పక్క యీ స్వాతంత్ర్యానికి అర్థం 'బాధ్యత' అనే జ్ఞానం వుంటుంది. తాను తల్లి దండ్రుల అజమాయిషీ నుంచి బైటపడేందుకు ప్రయత్నించినప్పటికీ, బైట ఎలా బతకాలో తెలియదు; ఒకసారి బైటికి వెళ్ళటం జరిగినా, బైటి ప్రపంచం తనపట్ల ఎంత క్రూరంగా ప్రవర్తిస్తుందో తెలిసిపోతుంది. యీ పరిస్థితిలో స్వేచ్ఛా బానిసత్వాల మధ్య సంఘర్షణ ఆరంభమౌతుంది.

తీవ్రమైన స్వాతంత్ర్య వాంఛ కారణంగా ఇంటిలో నుంచి పారిపోవటం జరుగుతుంది. తన మేలుకోరే వారూ, తనకు రక్షణను ఇచ్చే వారూ ఉండనందు వల్ల, తాను సాధించాననుకునే ఆ స్వాతంత్ర్యం ఎంత కీడు చేయగలిగేది తెలిసి రాకుండానే, వక్ర మార్గాల పడతాడు. తన వలెనే బాధ్యత నెరుగని వారి స్నేహం సంపాయించి, స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తూ, లైంగిక వాంఛల్ని ఇష్టానుసారం తీర్చుకోవటానికి అలవడటం జరుగుతుంది.

ఇలా ఇంటి నుంచీ, బంధు మిత్రుల నుంచీ దూరమై పోవటం ఒకొకప్పుడు శారీరకమైన వాంఛగా గాక, మానసికమైన సంఘర్షణ కారణంగానూ, తల్లి దండ్రుల పట్లా, వారి ప్రవర్తనల పట్లా, తాను చూపే నిరసనగానూ జరుగుతుంది. అంటే చిన్న తనంలో పిల్లలు చెడిపొయ్యే కారణం, తల్లి దండ్రులు వాడి పట్ల వర్షించ లేని అనురాగమేనని తెలుతుంది. యీ విధంగా మానవ జీవితంలో అనురాగ మనేది, చాలా చిన్న తనం నుంచే అర్థమవ సాగుతుంది. ఆ అర్థాలు, అపార్థాలు కాకుండా కాపాడవలసిన అవసరం ప్రతి తల్లి దండ్రులకూ వున్నది.

చిన్న తనంలో అనురాగాన్ని పొందలేని పిల్లల జీవితాలు, యవ్వనంలో ఎలా పరిణమిస్తవో యీ కింది కేస్ హిస్టరీలు చూస్తే అర్థమౌతుంది:

ఆమె చిన్నతనంలో తల్లి దండ్రుల మధ్య అనురాగం లేక పోను, ప్రతిరోజూ వారు పోట్లాడుకోవటం గమనిస్తూండేది. తల్లి కఠిన విమర్శలతో చాలా ఖచ్చితంగా మాట్లాడేది; ఆమె ఏమి చేసినా, తల్లిని సంతోష పెట్టాలని ఎంత ప్రయత్నించినా, తల్లి ఏదో వొక లోపాన్ని ఎత్తి చూపి కఠినంగా మాట్లాడుతూండేది. బహుశా తల్లి దాంపత్య జీవితంలో సుఖపడలేక, పరిసరాల మీద విసుగు చెంది, చిరాకుగానూ, ఇతరుల మనసులు కష్టపడేట్లు గానూ మాట్లాడుతూండేదేమో? ఆమె హృదయము ఎంతో గాయ పడుతూండేది; ఆమె తల్లిదండ్రుల చేత ప్రేమించబడ లేదు. అనురాగమనే దానికి ఆమె హృదయంలో తావు లేకుండా పోయింది. ఆమె హృదయము ఎలా మారుతూన్నదీ తల్లి దండ్రులు గ్రహించనే లేదు.

పెరిగి పెద్దయాక, ఆమె తన ఒంటరి తనాన్ని గ్రహించింది. తన నెవరన్నా హృదయ పూర్వకంగా ప్రేమించాలి; అలాటిది సాధ్యం కాదని ఆమె నమ్మకం; ఎందు కంటే ఆమె ఏళ్ళ తరబడిగా పొందిన అనుభూతుల ఫలితమది! నిజంగా ఎవరన్నా ప్రేమించినప్పటికీ, అదంతా నటనేనని ఆమె అనుకుంటూంది; ఎవరినీ నమ్మ లేదు; నమ్మక చేసేదీ లేదు.

ఈ సంఘర్షణ నుంచి బైట పడేందుకు ఆమె స్వేచ్ఛానుసారంగా లైంగిక అనుభవాల్ని పొంద నారంభించింది; ఇందువల్ల ఆమె కొంత వరకూ జనామోదాన్ని పొందింది. ఆమె నోడి అనుభవాల్ని కోరే వారందరూ, ఆమెను ఆకాశానికి ఎత్తే వాళ్ళు. ఐతే ఆమె పొందే యీ అనుభవాలేవీ ఆమెకు కామతృప్తిని ఇవ్వలేదు; కేవలం పురుషుల అవసరార్థం, తనను ఉపయోగించు కుంటున్నారనే నగ్న సత్యం ప్రతి సంఘటనలోనూ స్పష్టంగా అర్థమయేది. ఆమె ఎంతకూ శారీరకమైన అనుభవంతో తృప్తి పడగలనని భ్రమించింది. కాని ఆమె హృదయాంత రాళంలో అనురాగం కోసం ప్రత్యేకించబడిన భాగం, జీవితంలో ఎంత దూరం సాగినా ఖాళీగానే ఉండి పోయింది. అందుకనే స్వేచ్ఛా జీవితం ఆమెను తృప్తి పరచలేదు సరికదా, ఎంతో అశాంతిని పెంచింది. యీ కేస్ హిస్టరీనిబట్టి చిన్నతనంలోని వాతావరణం,

పెద్దయాక తన పలుకుబడుల్ని ఎంత క్రూరంగా బలంగా, విశాలంగా, విస్తరించగలదో చాలా సులభంగా అర్థం చేసుకోవొచ్చు.

ఒక్కొక్క సమయంలో అతి స్వల్ప విషయంకూడా పిల్లలు చెడి పొయ్యేందుకు కారణం కావొచ్చు. ఉదాహరణకు, దురుద్దేశం లేకుండానే కూతురు ఏ సహ విద్యార్థితోనో మాట్లాడిందనే దాన్ని, గోరంతలు, కొండంతలు చేసి, ఆమె వ్యభిచరించినట్లే, తల్లి నిందించటం జరిగినప్పుడు—కూతురి హృదయం గాయపడక తప్పదు. ఆ అపవాదు ఎలాగూ రానే వొచ్చింది కనుక, అనుభవమన్నా దక్కుతుందనే ఆశకు పాల్పడుతుంది; ఇప్పుడు తిరిగి తల్లి దండ్రులు తనను దూషించినా, ఒక కారణమనేది ఉన్నది కనుక, ఆమె బాధ పడక్కర్లేదు. కనుక అనవసరంగా పిల్లల్ని నిందించటం, బాధించటం వల్ల వారిని పెడమార్గాలకు తోయుట దూతుంది.

ఆడపిల్లను పెంచటంలో జరిగే లోపాలవల్ల కూడా ఆమె స్వేచ్ఛా విహారాన్ని ఎన్నుకోవొచ్చు. ఉదాహరణకు-మొగపిల్లలు లేనందువల్ల, ఆమెను మొగపిల్ల వాని వలెనే పెంచారు. ఆమెచనువు సంధ్యలు చాలా సక్రమంగా ఉన్నవి. ఐతే ఆమెకు ఆడపిల్లల స్నేహం చాలాతక్కువ. కాలంజరుగుతూన్న కొద్దీతనకూడా స్నేహితులు ఉండాలనేతీవ్రవాంఛ ఆమెనవేధించింది. ఆడపిల్లలస్నేహాన్ని తృణీకరించిఆమె మొగ పిల్లల్తో కలవ సాగింది. కేవలం తన స్త్రీత్వాన్ని రుజూ చేసుకునేందుకు ఆమె స్వేచ్ఛా విహారిగా మారి పోయింది. యీ విధంగా మారటమనేది చాలా క్రమ పద్ధతిలో, కొన్ని సంవత్సరాల కాలంలో జరిగినప్పటికీ, విషాద ఫలితాల్ని చూసినట్లయితే అసలు కారణం ఎంత అల్పమైనదో ఆశ్చర్యపడేట్లు ఉంటుంది.

మరి కొన్నాళ్ళు గడిచాక, దాంపత్య జీవితంలో తన సమస్యలు తీరుతయ్యని ఆమె భ్రమించి వివాహ మాడింది; కాని దాంపత్యం ఒక కలలాగే కరిగి పోయింది. ఆమె భర్తను చూసి భయపడుతుంది; దాంపత్యంలో తన పాత్రను నిర్వహించలేదు. నిశ్చలంగా ఉండి పోతుంది; కేవలం 'కర్మ'గా ఉండటం వల్ల, ఆమె సుఖపడలేదు సరికదా, బాధపడ సాగింది. తిరిగి ఆమె స్త్రీత్వం ఆమె మీద తిరుగుబాటు చేసి దాన్ని రుజూ చేసుకొని తీరాలని ఛాలెంజ్ చేసింది.

వెంటనే ఆమె మరొక పురుషుడికి లొంగి పోయింది. ఇతనితోనన్నా తన నిశ్చలత పోయి, తన స్త్రీత్వం రుజూ కాగలదని ఆమె ఆశ; కాని అది సఫలమవలేదు. ఇంకో పురుషుడికి లొంగి పోయింది. యీ విధంగా ఎన్ని చేతులు మారినా, ఆమె తన స్త్రీత్వాన్ని రుజూ చేసుకోలేక పోయింది; తనను స్త్రీ వలె ఉద్రిక్త పరచగల వ్యక్తి కోసం ఆమె గాలించ సాగింది. కాని అసలు లోపం ఆ పురుషుల్లోలేదు; తనలోనే ఉన్నదని ఆమెకు తెలియదు! ఇలాటి విచిత్రాభిప్రాయాల కారణంగా స్వేచ్ఛా జీవితం కొనసాగుతోంది.

ఇతర కారణాలు, మనందరికీ తెలిసినవీ, తేలిగ్గా అర్థం చేసుకోగలిగినవికూడా ఉన్నవి. ఉదాహరణకు నపుంసకుడైన భర్తకు భార్య ఐన అభాగ్యురాలు: ఆమె తన కామ వాంఛల్ని దాంపత్య పరిధికి బైట తీర్చుకునేందుకు ప్రయత్నించటం జరుగు

తుంది. ఐతే పుంసత్వమున్న భర్తకు భార్యగావున్న అనేకమంది స్త్రీలుకూడా వ్యభిచరిస్తూనే వున్నారు. ఇక్కడ పైన చెప్పుకున్న కారణం అతకదు. స్త్రీ శారీరక తృప్తిని భర్త నుంచి పొంద గలుగుతూన్నప్పటికీ, భర్త ఆమెను సక్రమ మార్గంలో ఉద్రిక్త పరిచి, తన అనురాగాన్ని అర్థమయేట్లు తెలియ పరచలేని అసమర్థుడవటమే ముఖ్య కారణం. ఇలాటి సంసారాలకు అత్యవసరమైనది ప్రణయ కళా రహస్యాలు; వాటిని అర్థం చేసుకొని, నిత్య జీవితంలో ప్రవేశ పెట్టగలుగుతే, దాంపత్యంలో లభ్యమయే సౌఖ్యం, బైట ప్రపంచంలో ఎక్కడా దొరకదనే నగ్న సత్యం తెలిసి వొస్తుంది.

భర్తల ఇతర లోపాలు భార్యల స్వేచ్ఛా విహారాలకు కారణమౌతోంది. ఉదాహరణకు—ఆమె తాను ప్రేమించి, పరిపూర్ణంగా అర్థం చేసుకున్నానని నిశ్చయించు కొన్న పురుషుణ్నే వివాహ మాడింది. అతనికి శీఘ్రస్ఖలన వ్యాధి వుంది; అందువల్ల ఆమె దాంపత్యంలో తృప్తి పడలేదు. డాక్టర్ను చూడమని ఆమె అనేక సార్లు భర్తను వేడుకుంది. కాని అతను పెడచెవిని పెట్టాడు; బహుశా తన యీ లోపం వేరొకరికి తెలియటం అనవసరమని అతను అపోహపడి వుంటాడు.

యువతికి ఉండవలసిన కామవాంఛలన్నీ ఆమెకు ఉన్నవి. ఆ వాంఛలు దాంపత్యంలో ఆమెకు తీరలేదు. వేరొక పురుషుడు తన కోసం ప్రయత్నిస్తూండగా, ఆమె నిరోధించ లేక పోయింది. ఆమె శారీరకమైన తృప్తి కలుగుతోంది; అందుకని తాను భర్తకు ద్రోహందం చేస్తున్నాననే బాధ ఉన్నప్పటికీ, ఆమె కామవాంఛలకు సహజంగా లొంగి పోయింది. ఆమె ప్రియుడు వేరొక పట్టణానికి వెళ్ళిపొయ్యాడు. ఆమె సమస్య తిరిగి యధారూపాన్ని దాల్చింది; ఐతే ఇంతకు పూర్వమే ఆమె ఆ సమస్యకు ఒక మార్గాన్ని అనుసరించింది. తిరిగి వేరొక పురుషుడితో తన కామ వాంఛలు తీర్చుకో సాగింది. యీ విధంగా ఆమె జీవితం ఒక వ్యభిచారిణి బతుకుగా తెల్లవారింది. విశాలంగా చూసినట్లయితే ఇలాటి అభాగ్యరాండ్రు 'తమ భర్తల అసమర్థతవల్ల, వారి బలాత్కారంతోనే పెడమార్గాలు పట్టాము' అనగలరు. అది ఎంత వరకూ నిజమో, కొస్త ఆలోచిస్తే తెలుస్తుంది. ఆమె ఆదర్శ గృహిణిగా, సంసారాన్ని చక్క దిద్దుకోగల ఇల్లాలుగా రూపొంద వలసింది—అభాగ్యురాలుగా, తాను సుఖపడ లేక, సంసారాన్ని ఉద్ధరించలేక పతనమౌతోంది.

ఇలాటి లోపాల కారణంగానే పురుషులుకూడా స్వేచ్ఛా విహారాలకు పాల్పడటం జరుగుతోంది. భార్య దగ్గిర తన పురుషత్వాన్ని రుజూ చేసుకునేందుకు, ఇతర స్త్రీలను సాధనంగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తాడు. ఐతే ఇది సమస్యను భేదించ లేదు. తాను అనుభవాల కోసం ప్రయత్నించే ప్రతి స్త్రీతోనూ తాను విఫలుడౌతూనే వుంటాడు; యీ విఫలత అతన్ని మరింత ముందుకు తోస్తుంది. యీ విధంగా అతనొక వ్యభిచారిగా, అశాంతితో, ప్రపంచాన్ని గాలించటం జరుగుతుంది.

లైంగిక విషయాల్ని గూర్చి పరిపూర్ణ జ్ఞానంలేని కారణంవల్లకూడా వ్యభిచారము కొనసాగుతోంది. ఉదాహరణకు: చాలా మంది ప్రణయం వేరు; కామతృప్తి

పొందటం వేరు అనే అభిప్రాయంలో ఉన్నారు. ప్రణయం ఆరాధించేదే కాని నీచమైన కామానికి బలయినప్పుడు, దాని విలువలు భగ్నమౌతయ్యనే దురభిప్రాయం నేటి యువతీ యువకుల్లో గాఢంగా వుంది. సాహిత్యపరంగానూ, చలన చిత్రాల ద్వారానూ, అనేక లలిత కళల ఆధారంగాను, ప్రణయ పవిత్రత తగినంతగా ప్రచారము పొందే వుంది. ఇలాటి దురభిప్రాయంవల్ల అనేకమంది జీవితాలు తలక్రిందులై పోవటం చరిత్రకు కొత్త కాదు. ఉదాహరణగా—

అతను చిన్నతనం నుంచీ ప్రణయం హృదయానికీ, ఆత్మకూ సంబంధిందనీ, దాన్ని శారీరక వాంఛలతో మిళితం చేసి నీచపరచ కూడదనీ, లైంగికానుభవం గొప్ప పాపమనీ, నీచమనే భావనలో ఉండేవాడు. తాను మనసారా ప్రేమించిన స్త్రీతో కామవాంఛలు తీర్చుకోవటం వల్ల, ఆ ప్రణయం పతన స్థితికి వొస్తుందని అతని అభిప్రాయం. ఐతే ఇలాటి ఆశయాలనైతే ఆలోచించటం తేలికే కాని, నిత్య జీవితంలో అమలు జరపటం ఎన్నటికీ తేలిక కాదు. ఎప్పుడైతే అతను మనస్సునూ, శరీరాన్ని స్పష్టంగా విడదీసుకున్నా ననుకున్నాడో, శారీరక వాంఛల్ని తీర్చుకున్నందువల్ల మనస్సు కలుషితంకు కావటం లేదని భావించసాగాడు. ప్రణయం ఒక చోటా, శారీరక తృప్తి వేరొక చోటా ఐనప్పుడు, తనకు ఇష్టం లేని అనేక మంది స్త్రీలతో వ్యభిచరించటం జరిగింది. ఇక తాను మనసారా ప్రేమించిన స్త్రీ దగ్గిర కామతృప్తి తీర్చుకోవటం వల్ల, ఆ ప్రణయ పవిత్రత తగ్గుతుందేమోననే భయంతో, నిర్లిప్తంగా ఉండటం జరుగుతోంది. ఇందువల్ల ఆ ప్రణయం విలువ ఎంత గొప్పదైనా, ముఖ్యంగా ఆ స్త్రీ కామవాంఛలు తనను మనసారా ప్రేమించిన ప్రియుని దగ్గిర తీరే అవకాశం లేనందువల్ల, ఆమె సమస్య తీరదు; కనుక ఆమె యీ ప్రియుణ్ని విడనాడటమో, లేక, వేరొక పురుషుణ్ని ఎన్నుకోవటమో తప్ప మరి మార్గం లేదు. అలాటి కేసులో అటు స్త్రీ, ఇటు పురుషుడు కూడా వ్యభిచారాన్ని ఆరాధించటం జరుగుతోంది. ఇదంతా ఒకానొక దురభిప్రాయానికి ఫలితమే!

నిజమేమిటంటే—శరీరాన్ని మనసునూ విడదీయగలగటం, విడదీయటంలోనే ఇలాటి వ్యక్తులు పొరబడుతున్నారు. మనసు శరీరంలోనే ఉన్నప్పుడు, అది ఒక శారీరక భాగమైనప్పుడు, యీ విడదీయటంలో అర్థం లేదు. ఇందువల్ల తాను వ్యభిచరించినా, నిష్కల్మషమైన మనస్సు ఉంటనే ఉన్నదనే అభిప్రాయం ప్రోత్సాహాన్నిస్తోంది. వ్యభిచారం తప్పని తెలిసినా, దురభిప్రాయం దాన్ని కమ్మి మభ్య పెడుతోంది. మానసిక సంచలనానికి విడుదల ఉండి తీరాలి; ఇలాటి విడుదల శారీరకంగానే జరగాలి కాని, వేరు మార్గం లేదు. అందుకని ఎంత పవిత్ర ప్రణయానికైనా, లైంగికానుభవం లేనిదే, దానికొక రూపం లేదు; అందువల్ల ప్రణయంలోని పవిత్రత తగ్గుతుం దనుకోవటం శుద్ధ పొరపాటు; నిజానికి ఆ ప్రణయానికి ఒక సుస్థిరరూపు ఏర్పడుతుంది; ప్రణయాన్ని ప్రకటించగలగటం సాధ్యమై తన అనురాగాన్ని ఎదుటి వ్యక్తికి అర్థమయేట్లు చేయటానికి అవకాశం ఏర్పడుతోంది. ఒక వేళ తాను కేవలం ఆ 'ప్రణయం'తోనే తృప్తి పడినా, తన ప్రేయసి మనస్తత్వమూ, నమ్మకాలుకూడా

అలాగే ఉంటవని ఎలా చెప్పగలం! కనుక ఇలాటి దురభిప్రాయం చాలా ప్రమాద కరంగా పరిణమిస్తూంటుంది.

స్వేచ్ఛా జీవితానికి మరో ముఖ్య కారణం ఆత్మతృప్తి. ఉదాహరణకు: అతని వయస్సు ముదిరి పోతోంది. సహజంగా అతను ముసలివాడై పోతున్నాడు; కాని ఆ విషయాన్ని ఒప్పుకునేందుకు, కనీసం, తలిచేందుకే సిగ్గు పడతాడు; భయపడతాడు. తాను ముసలి కాలేదని, తనకు తానే రుజూ చేసుకోనిదే అశాంతి చల్లారదు. అందు కని స్వేచ్ఛా జీవితం ఒక మార్గమని భ్రమిస్తాడు. వయస్సు ముదిరిన కారణంగా అతను బజారు వేశ్యల పొత్తుకు పాల్పడుతాడు.

దాంపత్య జీవితం నిస్సారమైన కారణంగా అనేకులు, దాంపత్య పరిధులు దాటి కామతృప్తి పొందేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తారు. తమకు లభ్యం కాని సౌఖ్యాన్ని సాధించేందుకు అనేక దురభ్యాసాలు-తాగుడు, జూదం, వ్యభిచారం మొదలైనవి అలవరుచుకుంటారు. కాని ఇవేవీ అసలు సమస్యను ఛేదించవు సరి కదా, మరింత జటిల పరుస్తవి. జీవితంలోని ఒకో ఓటమి, ఒకో మెట్టుగా వ్యక్తిని దిగ జారుస్తుంది. ఎలాగైనా దాంపత్యాన్ని సరిదిద్దుకో గలగట మొక్కటే యీ సమ స్యను తీర్చగలదు.

సమాజంలో తన అభిరుచులకు దరిదాపుల్లో వుండే అనేక మంది వ్యక్తులు, తన కళ్ళకు అతిరూప సౌందర్యవతులు కనిపించటం జరుగుతూనే వుంటుంది; అట్టి సమయంలో మనస్సు చలించటమనేది అతి సహజం; అలాటి సంచలనం లేనట్లయితే ఆ వ్యక్తి జడుడు. ఐతే మానసికంగా ఆరోగ్యంగా వున్న వ్యక్తి ఇలాటి 'షాక్'లకు తట్టుకోగలడు; సామాజిక జీవనంలో ఉద్రేకాలకు బానిసకాకుండా, కొంత ఆత్మ నిగ్రహాన్ని సాధించవలసిన అవసరం ప్రతి వ్యక్తికీ వుంది.

దంపతులు చాలా కాలంగా విడివడి ఉండటంకూడా స్వేచ్ఛా జీవనానికి ఒక కారణం. ఐతే తెలివిగల వారు, తిరిగి దాంపత్యంలో ప్రవేశించే సావకాశం లభించగానే, స్వేచ్ఛా జీవితాన్ని విడనాడ గలుగుతారు; అంత వరకూ పోకుండా ఆత్మనిగ్రహమున్న వారు నిజంగా అదృష్టవంతులే! భర్త వ్యభిచరిస్తున్నాడు కనుక, కసి తీర్చుకునేందుకు భార్య కూడా అదే పద్ధతిని అనుసరించ వొచ్చు; ఇందువల్ల వ్యభిచారమనేది రెండింత లవుతోంది. ఒకవేళ ఆమె భావించిన ఆ ప్రతీకారాన్ని సాధించ గలిగినా, దాంపత్య జీవితమే పతనమై, దంపతుల మధ్య అగాధాల్ని ఏర్పరుస్తోంది.

మొత్తంమీద మానసికాందోళన, సంఘర్షణల కారణంగా స్వేచ్ఛా జీవితం అలవడుతోందని స్థూలంగా చెప్పవొచ్చు. ఐతే ఇలాటి స్వేచ్ఛ వ్యక్తికి ఆనందాన్ని వ్యటానికి మారుగా, తాను చేయరాని తప్పు చేస్తున్నాననే బాధ కలగజేస్తుంది. ముఖ్యంగా లైంగిక విషయాల్లో దురభిప్రాయాలు లేకుండా ఉండటం అవసరం. అప్పుడే తాను సుఖపడి; సమాజానికి తానుఏమన్నా సహాయపడగలడు; లైంగికవిజ్ఞాన లేమివల్ల తనగోతినితానుతవ్వుకొని, సంసారాన్ని దుఃఖభాజనం చేయటమౌతుంది. ★




ఈ శీర్షిక పాఠకుల సందేహాలను ఆహ్వానిస్తుంది. సెక్సుకూ శరీర శాస్త్రానికీ సంబంధించిన సమస్యలు ఎన్నో, సమాధానాలు లేకుండానే చాలా కాలంగా మానవుల మనస్సుల్లో ఉండిపోయినవి. వాటిని తీర్చేందుకే ఇక్కడ ప్రయత్నం జరుగుతుంది.

అనుభవశాలి ఐన ఒక డాక్టర్ శరీరతత్వ రీత్యానూ, మానవ మనస్తత్వ శాస్త్రరీత్యానూ, ఈ జవాబుల్ని ఇస్తున్నాడు. ఒక్కొక్క చోట జవాబు సూచన మాత్రంగానే ఉండి పోతుంది. ఇతర కారణాలు ఎన్నోవున్నా, ఒక వ్యక్తి నమ్మగలిగే కారణం మాత్రమే ఇవ్వబడుతూంది. శాస్త్ర స్వరూపం పరిపూర్ణ రూపం దాల్చేనంత వరకూ ఇలాటిది తప్పదు.

పాఠకులు పంపే ప్రశ్నలన్నిటికీ జవాబులివ్వటం కష్టం. సాధ్యమైనన్ని ప్రశ్నలకు జవాబులు ఇవ్వబడుతవి. మీరు త్వరపడినందువల్ల లాభంలేదు. క్రమపద్ధతిలో ఇది జరుగవలసి వుంటుంది. సం॥ అభిసారిక]

1. నా వయస్సు 30 సం.లు. గత ఐదేళ్లుగా దాంపత్య జీవితాన్ని గడుపుతున్నాను. ఏ కారణం చేతో, ఏపదిరోజులో దాంపత్యంలో పాల్గొన లేకుంటే, బీజాలు వాచి బాధ పెడుతూంటవి. దాంపత్య నిర్వాహణ జరుగుతే, ఆ వాపు తగ్గిపోతుంది. ఒక్కొకప్పుడు స్వప్నస్ఖలనము వల్ల కూడా మేలు జరుగుతూనే వుంటుంది.

బీజాల వాపుకూ, దాంపత్యానికీ సంబంధం వున్నదని నాకో గట్టి నమ్మకం ఏర్పడింది. వీర్యం బీజాలలోనే తయారవటం వల్ల, అది సకాలంలో విడుదల కాని కారణంచేత, బీజాలు వాయటం జరుగుతుందేమో? అదీగాక సహజ రతి ద్వారా కానీ, స్వరతివల్ల కానీ కామతృప్తి పొందుతే, యీ వాపు మాయ మాతోంది. నా నమ్మకాలు శాస్త్రీయమైనవేనా? విశదీకరించండి.

మీరు కేవలం లోకజ్ఞానంతో కొన్ని అభిప్రాయాలను ఏర్పరుచుకొని నమ్ముతున్నారు; ఐతే అవి శాస్త్రీయమైనవి కావు. వీర్యం బీజాలలోనే తయారవుతుంది. ఐతే యీ తయారైన వీర్యం బీజాలకు పై భాగంలో వున్న వీర్యస్థానాల్లో (Seminal Vesicles) నిలవ వుంటుంది. దాంపత్య సమయంలో సరాసరి బీజాలనుంచి వీర్యం స్ఖలన మవదు.

మరో విశేష మేమంటే స్ఖలనంలోని దంతా వీర్యం కాదు; చాలా కొద్ది భాగమే వీర్యం. మిగతాది ప్రాస్టేట్ గ్రంధి, కౌపర్ గ్రంధి — మొదలైన అనేక గ్రంధుల తాలూకు ద్రవ పదార్థాలు. అసలు వీర్యం అర్థ ఘనపదార్థం (Semi-Solid) స్వతహాగా దానికి చలనం లేదు. మిగతా సెక్సు గ్రంధుల తాలూకు ద్రవాలలో కలవందే దానికి చలనం, వీర్యకణాలకు సజీవ శక్తి రాదు. అదేవిధంగా వీర్యకణాలులేని, ఇతర సెక్సు గ్రంధుల తాలూకు ద్రవాలు, గర్భధారణకు నిరుపయోగం.

సకాలంలో నీరుడు కానట్లయితే బ్లాడర్ పెరిగి కడుపు ఉబ్బుతుంది. బహుశా ఇదేవిధంగా వీర్యస్థానాల్లో, బీజాలు నిండి వాపులాగు వొచ్చి బాధ పెడుతుందనేది ఒక దురభిప్రాయం. బ్లాడర్ నిండి కడుపుబ్బి నప్పుడు, నీరుడు చేయటం ద్వారా ఆబాధ తగ్గినట్లే, బీజాలు బాధ పెట్టినప్పుడు వీర్యస్ఖలనం ద్వారా రిలీఫ్ను పొందవొచ్చని చాలా మంది నమ్మకం; ఇలాటి నమ్మకాలలోనే వారు స్వరతిని ఆచరిస్తూ దానికొక కారణాన్ని, తన ఆరోగ్యాన్ని కాపాడుకొనే పద్ధతిగా భావించుకుంటున్నారు. కాని ఇది తప్పు, బీజాలు వాచేటంత వీర్యం ఎప్పుడూ తయారవదు. తయారైన వీర్యం నిలవ వుండేందుకు వేరే వీర్య స్థానాలున్నవి.


మరి యీ వీర్య స్థానాలుకూడా నిండుతే ఏమౌతుందనే సందేహం రావచ్చు. బ్లాడర్కూ, వీర్యస్థానాలకూ పనిచేసే పద్ధతిలో చాలా భేదం వుంది. బ్లాడర్ నిండుతే, అది ఖాళీ ఐతీరాలి. కాని వీర్యస్థానాలు నిండినట్లయితే, మన ప్రయత్నం లేకుండానే ఏ స్వప్నస్ఖలనం గానో వీర్యం దానంతటదే బైట పడుతుంది. లేదా తయారైన వీర్యం తిరిగి రక్త ప్రవాహంలో కలిసిపోతుంది. దానికై విచారించ వలసిన పనిలేదు.

ఐతే బీజాల వాపుకు కారణం ఏమిటనేది ఒక వైద్యుడు చెప్పగలడు. అనేక కారణాలుండొచ్చు. ద్రవ పదార్థా లేవన్నా చేరటం వల్ల బీజాలు వాయవొచ్చు. బీజాలు అతిముఖ్యమైన గ్రంధులు కావటం వల్ల వాటిని కాపాడు కోవటం అవసరం, దానికీ దాంపత్యం నిర్వహించ బడనందుకూ గల సంబంధం ఏమీలేదు. కనుక యీ సారి అలాటి స్థితివస్తే, డాక్టరును తప్పక చూడండి.

2. కవలలు గర్భకోశంలో ఎలాఇమిడి వుంటారు? గర్భకోశంలో కవల లున్నారనే విషయాన్ని ఎక్స్రే ఫోటోతప్పక నిర్ణయించగలదా? ఒకే పోలిక వున్న కవలలు ఒకరిమీద మరొకరుగా గర్భకోశంలో ఉంటారా? సాధారణ శిశువులుపుట్టే విధాన నికి కవలలు పుట్టే విధానానికీ

భేదం ఏమన్నా వుంటుందా? కవలల తాలూకు మాయ (Placenta) గుర్రపు నాళం ఆకారంలో వుంటుందా? ఒకే పోలికవున్న కవలలు; తల్లి శరీరంలో, ఒకే పక్క పెరుగుతారా?

ఈ క్రింది బొమ్మలో తల్లి గర్భంలో కవలలు ఎలా పెరిగేదీ చూపబడింది.




వివరాలివి: 1—వ బొమ్మ: రెండు పిండాలూ ఒకే సారి పెరిగేందుకు అనుకూలంగా వున్న గర్భకోశం. ఇవి రెండు గుడ్ల తాలూకు పిండాలు కనుక, రెండు మాయలూ విడివిడిగా ఏర్పడుతవి. రెండు వీర్య కణాలు, రెండు గుడ్లనూ పొదిగినవి.

2—వ బొమ్మ: ఒకే గుడ్డులో పెరిగే పోలికలున్న కవలలు. గుడ్డు ఒక్కటే కనుక ఒకే మాయవుంది. యీ కవలలు ఏర్పడేందుకు ఒకే వీర్య కణం చాలు; ఐతే ఆ వీర్య కణంలో రెండు సెట్ల క్రోమోజోములు ఉండాలి. లేదా రెండు న్యూక్లై వున్న ఒకే గుడ్డు కారణంగా కూడా ఇది సంభవము.

3—వ బొమ్మ: కవలలు గర్భకోశంలో ఇలాగూ పెరగవొచ్చు. వారితలలు విధిగా కిందికే ఉండాలనే నియమంలేదు. వీరుకూడా ఒకేగుడ్డు లోనుంచి వొస్తున్నారు కనుక, ఒకే మాయనుంచి తమ ఆహారాన్ని తీసుకుంటారు.

4—వ బొమ్మ: రెండు విడివిడి గదులున్న ఒకే గుడ్డులో పెరిగే కవలలు. ఒక్క వీర్య కణం వల్ల యీ కవలలు రూపొందారు. ఇద్దరికీ వేరువేరు మాయలున్నవి; వీరికి పోలికలు తప్పక.

కవలల్లో పోలికలున్నా, లేకున్నా, వారు గర్భ కోశంలో ఒకే విధాన మంటూ వుంటే కవలలు విషయంలో ఎక్కువగా ఆలోచించ వలసిన పని డాక్టర్లకు ఉండదు.

ఎక్స్‌రే బొమ్మలో కవలలు తప్పక కనిపిస్తారు: గర్భధారణా నంతరం ఏ 3, 4, నెలలోనో స్పష్టంగా తెలుస్తుంది.

కవలలు ఒకరి మీద మరొకరు ఉంటారని చెప్పలేము. అంతకన్న ఒకరి వెనుక ఒకరు, అనటం సమంజసం. కవలలు పై బొమ్మలో చూపిన విధానాల్లోగాక, తమకు అనుకూలమైన ఏవిధానంలో నైనా సరే పెరగవొచ్చు. ఏ స్థితిలో ఉన్నారనేది ఎవ్వరూ చెప్పలేరు.

సాధారణంగా కాన్పులో బిడ్డ ముందుగా తలను బైట పెడతాడు. ఐతే అనేక కేసుల్లో ఏకాలో, చెయ్యో ముందుగా బైటపెట్టటం జరుగుతూ వుంటుంది: అలాటి కాన్పు జరగదు; జరిగినా చాలా కష్టంగానూ పరిణమిస్తుంది. అలాటి సమయంలో డాక్టర్ బిడ్డను గర్భంలోకి తోసేసి, తల భాగమే ముందుగా బైటపడేట్లు తిప్పు తుంటాడు; లేదా శస్త్రచికిత్స ద్వారా కాన్పు జరుపుతాడు, ఇకకవలల విషయంలో బిడ్డ ఎలా బైట పడతాడనేది, ఏడాక్టరూ ముందుగా చెప్పలేడు. సాధారణంగా పుట్టే ఒకే బిడ్డవలెనే శరీరంలోని ఏభాగాన్నయినా ముందుగా బైట పెట్టే అవకాశం కవలల్లో వుంది.

కవలల తాలూకు మాయకు ప్రత్యేకమైన రూపంలో ఒకటి లేదు. దానికొక ఆకారాన్ని కల్పించటం మన భ్రమ.

కవలలు తల్లి శరీరంలో ఒకే వైపుకు వొరిగి ఉండటం సామాన్యమే కాని, సామాన్యంగా అలా జరగదు. వారు ఒకరి వెనుకగా మరొకరుండి, శరీర మధ్య భాగంలోనే ఉండటం జరుగుతూ వుంటుంది.

కవలల్ని గూర్చిన అనేక నమ్మకాలు కలకాలంగా మానవుల్లో పనిచేస్తున్నవి. యీ నమ్మకాలన్నీ నిజాలు కావు. వీటిల్లో ఏవి శాస్త్రీయ సత్యాలో, ఏవి కావో ముందుముందు అభిసారికలో తెలుసు కుందాం.

౪. మానవుల్లో వలెనే గొడ్లలో కూడా సుఖవ్యాధులంటూ ఉన్నవా?

వర్జీనియా రాష్ట్రానికి సంబంధించిన శాస్త్రకారులు పశువులు కూడా సుఖవ్యాధుల్తో బాధపడటం కద్దని అంటున్నారు. ఐతే. యీ వ్యాధుల్ని వెనువెంటనే

కనిపెట్టటం కష్టం; అనేక లేబరేటరీ పరీక్షలు చేయవలసి వుంటుంది. వ్యాధి ప్రథమ దశల్లో చికిత్స నివ్వనట్లయితే, పశువు జననేంద్రియ యంత్రాంగానికి వ్యాధి సోకటం, వంధ్యత్వం ప్రాప్తించటం, గర్భస్రావమవటం జరుగుతుంది. పశు సంపదను కాపాడేందుకు మరికొన్ని పరిశోధనలు అవసరం.

4. కృత్రిమ గర్భధారణా విధానాన్ని పశ్చిమ దేశీయులు ఎక్కువగా అమలు జరుపుతూంటారు; ఎందుకని? పిల్లలు లేనివారు పెంచుకో రాదా?

ఇలాంటి ప్రశ్నలకు ఆ విధానాన్ని అవలంబించిన వారే జవాబులు చెప్ప గలరు. ఆ మధ్య, భర్తలు వంధ్యులవటం వల్ల, కృత్రిమ గర్భధారణలో బిడ్డలను పొందిన 38 మంది దంపతుల్ని వివిధ ప్రశ్నలు వేయగా, వారు చెప్పిన జవాబులు చూడు:

'పెంచుకునేందుకు మారుగా, పరపురుషుని ద్వారా కృత్రిమ విధానంలో బిడ్డను కనేందుకు మీరెందుకు ఒప్పుకున్నారు?' అనే ప్రశ్నకు జవాబిది! బిడ్డను పెంచుకుంటే, గర్భధారణానుభవం ఉండదు; ఆ అనుభవం కోసం స్త్రీత్వం తహ తహ లాడింది. పెంపక పద్ధతుల్లో కలిగే అసంతృప్తిపై కృత్రిమ గర్భధారణ తండ్రి పోలికలూ, వంశపారంపర్యతా రాకున్నా, కనీసం తల్లి తాలూకు వంశపారం పర్యత వొస్తుంది; ఇందువల్ల తల్లికీ బిడ్డకూ చాలా దగ్గరి సంబంధం వుంటుంది. తాను గొడ్రాలు కాదని తల్లి రుజువు చేసుకో గలుగుతుంది. తనకు వీర్యదానం చేసిన వ్యక్తిలోగల గాఢ నమ్మకం; తక్కువ కాలం సంతానం కలగదనే ధైర్యం.

ఇదే విధానంలో మరో బిడ్డను కనాలని వున్నదా? అనే ప్రశ్నకు - 38 మంది దంపతులూ తమ అంగీకారాన్ని తెలిపారు. దీన్నిబట్టి యీ కృత్రిమ గర్భ ధారణా విధానం, సామాన్యులు తలచినట్లు అసంతృప్తికరంగా లేదు సరికదా, దంపతులు మానసికారోగ్యం ఉన్నతస్థాయిలో వుంది. దీన్నిబట్టి కృత్రిమ గర్భ ధారణా విధానం బిడ్డలు లేని అనేక దాంపత్యాలకు ఒక కలగా పరిణ మిస్తోందనే చెప్పవలసి వుంటుంది.

5. నా వయస్సు 21 సం.లు నేను కాలేజిలో చదువుతున్నారు. నా మొహం మీద ఎక్కడా ఒక్క వెంట్రుక కూడా లేని కారణాం వల్ల, నా పురుషత్వాన్ని శంకించవలసిన పరిస్థితి ఏర్పడింది. నాతోటి విద్యార్థులు గడ్డం చేసుకుంటూరు, నా మొహం అద్దంవలె ఉండి, స్త్రీ మొహంవలె ఉండటంవల్ల చాలా చాలా సిగ్గుపడుతున్నాను: మిగతా విద్యార్థులతో సమానంగా ఉండలేక 'ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు' లోనవుతున్నాను.

హార్మోనులు తీసుకున్నందువల్ల నేను పురుషునివలె ఉండగలనా? వివాహం చేసుకుంటే, దాంపత్యం ఎలా వుంటుందోననే బాధకూడా వుంది. సంతానం కలుగుతుందా? ముఖ్యంగా స్త్రీ అంటే భయం ఏర్పడింది; అసలు స్త్రీలు నన్ను పురుషుణ్నిగా చూడరేమోనని అనుమాన వేధిస్తోంది. ఇంతర్వాతా నేను చాలా ఆరోగ్యంగా వున్నాను. కామవాంఛలు కూడా కలుగుతూంటవికాని, అంతరాత్మ 'నీవొక అసమర్థుడివి. పడి వుండు!' అని హేళన చేయటంతో దిగ జారి పోతుంటాను. మీరేదన్నా తరుణోపాయాన్ని చెప్పండి.

ఆదిమ మానవుడికి శరీరమంతటా విపరీతంగా వెంట్రుక లుండేవి. ప్రకృతి బాధలనుంచి కాపాడు కునేందుకు యీ వెంట్రుకలు ఉపయోగ పడుతుండేవి. క్రమంగా మానవుడు బట్టకట్టటం నేర్చి, గృహ నిర్మాణం చేసుకో సాగాక, కొన్ని తరాలు గడవగా, శరీరంమీది వెంట్రుకలు శ్వేతగ్రంధులు విడుదలచేసే చెమటను బైట పడేసి, శరీర ఉష్ణాన్ని కాపాడేందుకు ఉపయోగ పడుతున్నవి.

స్త్రీ పురుషుల మధ్యనున్న భేదం వెంట్రుకల పెరుగుదలలో కనిపిస్తుం దనేది నిజమే! ముఖ్యంగా ముఖంమీద యీ భేదం స్పష్టమాతూ వుంటుంది. ఐతే ముఖంమీద వెంట్రుకలొచ్చే స్త్రీలు ఉన్నారు: ముఖంమీద వెంట్రుకలు రాని పురుషులూ వున్నారు. ఆ ఒక్క కారణంవల్లా మొదటివారు స్త్రీలు కాకుండానూ పోరు; రెండోవారు పురుష లవకుండాను పోరు.

కొన్ని కుటుంబాలలో తరతరాలుగా ముఖంమీద ఉండవలసినంత వెంట్రుకలు పెరగకుండటం కద్దు; ఒకొకప్పుడు అద్దంలాటి ముఖమున్న పురుషులే జన్మి స్తుండటం కూడా జరుగుతూ వుంటుంది. అంటే దీనికొక వంశపారంపర్యత వున్నదా అనిపిస్తుంటుంది.

ఇలాటి లోపం ఎందుకు జరుగు తుందనేది ఎవ్వరూ చెప్పలేరు. సాధారణంగా పురుషుని తాలూకు గ్రంధుల్లో-ఇవి సెక్సుయంత్రాంగానికే సంబంధించినవయి ఉండొచ్చు-ఏదో లోపంవుండి, హార్మోనుల్ని విడుదల చేయనందు వల్ల యీ స్థితి ఏర్పడుతోందని భావించ బడుతోంది. అందుకని డాక్టర్లు హార్మోనుల చికిత్సను ప్రయత్నిస్తున్నారు.

ఐతే హార్మోనులు అతిశక్తివంతమైన రసాయనిక పదార్థాలు కావటం వల్ల, మోతాదులోని ఎక్కువ తక్కువల వల్ల ప్రమాదం జరగొచ్చు. ఇంకో ఇబ్బంది ఏమిటంటే ఏహార్మోను శరీరానికి సరఫరా కావటం కాలేదో తెలుసుకో గలగటం. అన్నిటినీమించి శరీరంలో గ్రంధులు సరఫరాచేసే హార్మోనుల్ని శారీరక యంత్రాంగము ఉపయోగించు కుంటుం దనేందుకు సందేహం లేదు; కాని బైటినుంచి వొచ్చే హార్మోనులు శరీరం ఎంతవరకూ స్వీకరి స్తుందో ఎవరికీ తెలియదు. హార్మోనుల

చికిత్స ఒకొకప్పుడు విజయవంతం కావొచ్చు కాని, ఖచ్చితంగా మేలు జరుగుతుందని చెప్పలేము.

ముఖ్యవిషయ మేమంటే-ముఖంమీద వెంట్రుకలు లేనంతమాత్రాన పురుషత్వంలో లోపం ఉన్న దనుకోవటం పొరపాటు. ఒక్క మీసాలూ, గడ్డాలే పురుషత్వాన్ని నిర్ణయించవు. సామాన్యాభిప్రాయం ముఖంమీది వెంట్రుకల్లే పురుషత్వానికి సాక్ష్యమనే నమ్మకం కావొచ్చు కాని అది సత్యదూరం. ముందుగా మీరు మీరే అలాటి పిచ్చి అభిప్రాయాలను నమ్మి కుంగిపోతుండటం చాలా అనవసరమే గాక, అసత్యాన్ని నమ్మట మౌతుంది.

స్త్రీలు కేవలం పురుషుల గడ్డాల్నీ మీసాల్నీచూసి అనురాగ వతు లవుతారనుకోవటం శుద్ధపొరపాటు. విశేషించి దాంపత్యంలో యీ గడ్డాలూ, మీసాలూ, చాలా ఇబ్బందుల్ని కలుగజేసి, స్త్రీని బాధ పెడుతూంటవనే సంగతి మనకు తెలియంది కాదు.


ముందుగా మీరు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సును వొదిలించు కోవాలి. ప్రతి వ్యక్తికీ ఏదోవొక లోపం, ఏదోవొక రూపంలో వుంటుంది; అంత మాత్రానికే తనకు వ్యక్తిత్వం లేదను కోవటం ఆత్మవంచన; మొహంమీద వెంట్రుకలు రానంత మాత్రాన రోజూ క్షవరం చేసుకొనే బాధమీకు లేదని ఎందుకు సంతోష పడరు? మీరు జీవితంలో సాధించ వలసిన దానికి అడ్డొచ్చే దేమిటి? ఏదన్నా లోపం ఉన్నప్పటికీ, అనేక ఇతర సుగుణాలు ఆ లోపాన్ని కప్పివేయ గలవు.

సహజ కామవాంఛలు ఉంటూన్న వన్నారు కనుక, మీ పురుషత్వాన్ని ఏవిధంగానూ సందేహించ వలసిన పనిలేదు. మీ ఆత్మ చెప్పేది శుద్ధ అబద్ధం. అది అబద్ధమనే విషయాన్ని ముందు నమ్మి తరువాత అనుభవ పూర్వకంగా దాంపత్యంలో తెలుసుకో గలుగుతారు. మీదాంపత్యం సౌఖ్యమయం మవ గలదు.

మీకు సంతానం కలగటం, కలగకుండటం అనేది దంపతుల ఆరోగ్యం మీదా, స్త్రీ అండవాహికలూ, అండాశయం ఆరోగ్యంగా ఉండటం మీదా, ముఖ్యంగా మీస్ఖలనంలో తగినన్ని వీర్యకణాలు ఉండటం మీదా-అన్నీ వున్నా యాదృచ్ఛికంగా గర్భధారణ జరగటం మీదా ఆధారపడిన విషయాలు కనుక వాటిని గూర్చి అసలు ఇప్పుడు ఆలోచించ వలసిన పనే లేదు.



సీరియల్ నవల:




'ఏం లేదు...బాబుగారు అర్జంటుగా పిలుచుకు రమ్మన్నారు—'

బహుశా మళ్లీ ట్యూషన్ సంగతి మాట్లాడేందుకే ఐవుంటుందనుకున్నాడు. కాని తానీ స్థితిలో ప్రపంచంలో ఏం చేయాలో నిర్ణయించుకో లేదు సరికదా, అసలు ఉండటమా? ఊడటమో కూడా తేల్చుకోలేదు. అందుకని బ్రహ్మదేవుడు కబురు చేసినా తాను పట్టించుకో నవసరం లేదు.

ఈ సంగతులన్నీ గోపయ్యకు చెప్పటం అనవసరం. అందుకని 'గోపయ్యా! నిన్న అమ్మ చనిపోయింది!' అన్నాడు, ఆవుర్న వొచ్చే ఏడ్పును బలవంతాన తొక్కిపడుతూ.

'ఎప్పుడు బాబూ!' అన్నాడు వాడు.

'నిన్న మధ్యాహ్నం!'

'పాపం' అని గోపయ్య మౌనంగా కూర్చున్నాడు.

కాస్సేపాగి 'బాబుగారు మిమ్మల్ని తీసుకురమ్మన్నారు బాబూ!' అన్నాడు వాడు.

తనకు విసుగెత్తినమాట నిజమే కాని, తానీ ప్రపంచం నుంచి విరమించ దలచనంత కాలం, ప్రాపంచిక విషయాలకు అతీతుడు కాలేదు. అప్పుడే బాబుగారి గొప్పతనం, తన తక్కువతనం గుర్తుకొస్తున్నాయ్. ఆయన మాటల విలువను, తన బోటి నిర్భాగ్యులు పాటించి నిర్ణయిస్తున్నారు.

'గోపయ్యా! ఇప్పుడు రాలేను...'

'కాదు బాబూ! వెంట పెట్టుకొని రమ్మన్నారు!'

గోపయ్యకు తన స్థితి అర్థం కావొచ్చు కానీ, పద్మనాభం గారికి—బహుశా తెలుసుకుంటే ఏమైనా అర్థమౌతుందేమో?

'బయలు దేరండి బాబూ!' అన్నాడు గోపయ్య లేచి నిలబడుతూ.

ఇక తనకు తప్పదు; బలశాలురు, బలహీనుల మెడక్కలకు తాళ్లు వేసి నడిపించటమే లోకంలో జరుగుతుంది. యీ బలహీనులు బతక దల్చుకుంటే, శాశ్వత దాస్యమే కాని వేరు దారి లేదు...

ఇంత అర్ధాంతరంగా పద్మనాభం గారు తన నెందుకు పిలిపించి ఉంటారో అర్థం కాలేదు; అమ్మపోయిన దుఃఖంలో తాను తీవ్రంగా ఆలోచించలేదు కూడాను. మంత్రి ముగ్ధునివలె, గోపయ్యను అనుసరించాడు. దారిలో ఎవ్వరూ మాట్లాడ లేదు.

పద్మనాభం గారు కాళ్లు కాలిన పిల్లివలె తోటలో పచార్లు చేస్తున్నారు; ఆయన వాలకం చూస్తే ఏదో తీవ్రమైన సమస్యతో ఊపిరాడినట్లుంది. అల్లంత దూరంలో చెట్ల నీడలో పడక కుర్చీ వేసుకొని రమణమ్మగారు మామూలుగానే కలలు కంటున్నారు. ఆమెను నిద్ర నుంచి లేపటం తనతరం కాదని అనుభవపూర్వకంగా తెలుసు కనుక చూసి వూరుకున్నాడు.

తా నాయనకు నమస్కరించాడు. ఆయన కోపంతో రైలు ఇంజనల్లే ఊపిరి వొదిలి, బుస కొట్టాడు.

'రాత్రి...అమ్మపోయింది!' అన్నాడు తనే ముందుగా. తనకు సానుభూతి ఎక్కడ దొరుకుతుందా అని గాలిస్తున్నాడు.

ఆయన వాలకంలో కోపం కొంత తగ్గింది. తనకు తాను సంబాళించుకుంటూ 'సరే...' అని కాస్త ఆగి 'లలిత ఎక్కడుంది?' అన్నాడు.

లలిత! ఎక్కడుండట మేమిటి? ఏమిటో అయోమయంగా వుంది తనకు; అసలు ప్రశ్నే అర్థంగాక, గుడ్లు తేలేసి పద్మనాభం గారి వొంక చూశాడు.

'ఎక్కడున్నది? చెప్పు—' అన్నాడాయన కఠోరంగా.

'నాకేం తెలుసు? లలిత నాకు కనిపించే చాలా రోజులైంది...'

'అబద్ధం!' అన్నారు పద్మనాభం గారు 'నాకంతా తెలుసు. వెధవ వేషాలు వేయవొద్దు...అది నీతోనే లేచిపోయి ఉండాలి. దాన్నెక్కడ దాచావో చెప్పు---' అన్నారు, ఉద్రేక పూర్వకంగా.

లలిత! లలిత లేచి పోయిందా? ప్రపంచంలో జరగ కూడనివి జరుగుతూంటవనేందుకు, తల్లి చనిపోవటం ఒక ఉదాహరణైతే, ఇది రెండోది! లలిత అలాంటి పని చేసి ఉంటుందంటే తాను, కలలో కూడా నమ్మలేడు. ఐతే వీళ్ళందరూ పొరబడటమే జరిగి ఉండొచ్చు. పోతే ఆమె ఒక వేళ నిజంగానే అంత నీచానికి వొడిగట్టి

నట్లయితే, ఆ అదృష్టం తనలాటి వాడికి పట్టదు. ఎందుకంటే తన బతుకూ, యోగ్యతకూ లలిత తనను ప్రేమిస్తుందంటే, ఎండమావులో నీళ్ళు దొరికినట్లే!

'మాట్లాడవేమయ్యా! ఎక్కడ దాచావ్?' అన్నారు పద్మనాభం గారు కోప తీవ్రతను సూచిస్తూ.

ఇంత విషాదంలోనూ తనకు నవ్వొచ్చింది.

'నేనా?' అన్నాడు వికటంగా నవ్వి 'నా బతుక్కు ఆమెను దాయ గలగటమా?'

'అదీ ఆలోచించాను...ఆమె వొట్టి చేతుల్తో వెళ్ళలేదు. పది పన్నెండు వేల విలువగల ఆభరణాల్తోనే వెళ్ళింది. నీ దరిద్రమంతా తీరేందుకు అది చాలు!'

ఇంతకన్న అభాండం ఏముంటుంది? తన బోటివాడు బతకటమే సమాజానికి భారమైతే, వధించటం వల్ల అటు తనకూ, ఇటు సమాజానికూ కూడా మేలు కల గొచ్చు. అంతే కాని యీ చిత్ర వధ దేనికి?

'పద్మనాభం గారూ! నా కంత తెలివి తేటలూ, యోగ్యతా లేవు. లలిత విషయం నాకేమీ తెలియదు!' అన్నాడు. వాదించి లాభం లేదు. తన వాదనలోని సత్యం కన్న, ధనవంతుల ఆరోపణలోని అసత్యమే బలవత్తర మైనది.

పద్మనాభం గారు చప్పున చల్లబడి పొయ్యారు. మెత్తగా మాట్లాడ సాగారు.

'నీకు డబ్బు కావాలంటే తీసుకో...కాని ఆమె ఎక్కడున్నదో చెప్పు' అన్నా డాయన.

డబ్బుతో తను తల్లిని బతికించుకోగల ననుకున్నాడు; తీరా ఆమె పొయ్యాక, ఆ డబ్బు స్వరూపం ఎలాటిదో ఎంత నీచానికి మానవత్వాన్ని దింపగలుగుతుందో తను తెలుసుకో గలుగుతున్నాడు. అంతే కాదు; ధన సంపాదన ఎంత కష్టసాధ్య మని తాను భ్రమించాడో, ఇప్పుడు అంత సులభసాధ్యంగా తోస్తోంది...కాని తాను, మానవుడు: కేవలం మానవుడుగా బతక గలిగితే చాలు. యీ సమాజం ఆ అవకాశాన్నయినా తనకు ఇవ్వలేదా?

'నాకేం తెలియదు...నన్ను బాధ పెట్టకండి' అన్నాడు తను రోత వేసి.

'చూడు మిష్టర్' అన్నా డాయన 'ఆమె పరువు ప్రతిష్టలున్న వంశంలోది; పెళ్ళి కావలసింది. తెలిసో, తెలియకో కాలు జారినా, ఆమెను పతితను చేసేం దుకు నీకు చేతు లెలావొచ్చినయో ..ఐనా ఇప్పుడంతా మించి పోలేదు. నీకు నాలుగు వేలిస్తాను. ఇంతవరకూ పోలీస్ రిపోర్టు కూడా ఇవ్వలేదు. ఇవ్వను కూడాను. ఐన దానికి నిన్నేమీ అనను...ఆమె ఎక్కడున్నదో చెప్పు. మా అవస్థ మేం పడి తీసు కొచ్చుకుంటాము' ప్రార్థనా పూర్వకంగా.

పరువు ప్రతిష్ఠల నేవి, డబ్బుకు అమ్ముడయ్యేవీ, డబ్బుతో కొనగలిగేవీ కూడా నన్నమాట! తన దగ్గిరా డబ్బులేదు కనుక, తనకా పరువు ప్రతిష్ఠలు లేవు; లేని దాన్ని నిలబెట్టుకోవలసిన అవసరం అసలే లేదు. ఆ పెద్ద మనిషి తరిచేదంతా నిజమై నప్పటికీ, యీ గొప్పింటి రహస్యాలు ఎంత నీచస్థితిలో ఉంటవో అర్థ మౌతోంది.

'అయ్యా! నాకేమీ తెలియదు. నా సమస్యల్లోనే నేను ఛస్తున్నాను. నిన్ననే అమ్మ పోయింది; ఆ విచారంలో వున్న నన్ను మీరిలా వెంటాడటం—'

ఆయనకు కోపం వచ్చింది. మధ్యలోనే అందుకొని 'మెత్తగా అడుగుతే అవుతుందా? సరే ఫో...పోలీసులే నీ పని పడతారు...కాకపోతే గోలవుతుందని ఊరుకున్నాను. కానీ ఏం చేస్తాం...బీదరికం ఎంతెంత ఘోరాల్ని చేయిస్తుంది!' అన్నాడాయన.

తన హృదయం లోని అగ్నిగుండం ప్రజ్వరిల్లుతోంది. మరీ ఆయన అన్న మాటలు 'బీదరికం'లోని నీచత్వం సంగతి! మరి ధనికుల్లో వున్న నీచత్వ మేమిటి? ఇంతకు ముందే, తాను లలితను లేవదీసు కెళ్ళాడని భ్రమించి, తనలాంటి అల్పుని కాళ్ళు పట్టుకునేందుకూ, తనకు లంచ మిచ్చేందుకు కూడా ఆయన సిద్ధపడ్డాడు కదా! మరి ధనికుల గొప్పతనం ఎక్కడ? యీ ఎక్కువ తక్కువలు మానవత్వాన్ని బట్టి గాక, ధనాన్ని బట్టి ఉండటమనేది ఎంత హాస్యాస్పద మైనదో తనకు తెలుసు. ఒకవేళ బీదరికం ఘోరాల్ని చేయించగలిగే దయితే, ధనికులు తమ చేతుల్ని మలినం చేసుకునే అవసరం లేకుండా బతికిపోగలుగుతున్నారు. యీ బురదంతా తలా కాస్తా పంచుకొని, వొంటికి పట్టించుకునేందుకు బీదలు సర్వదా సిద్ధంగానే వున్నారు. ఇంత మేలు చేస్తున్న బీదల్ని, ధనికులు ఎందుకు ద్వేషిస్తారు?

తానేమో చెప్పనూ లేదు; చెప్పినా ఆయన నమ్మేట్లూ లేడు. అదీగాక, ఏ నేరమూ చేయని తనను బెదిరించే వరకూ దిగాడు. న్యాయమనేది ఎక్కడన్నా వుందేమో? తనకు మాత్రం కనుచూపు మేరలో లేదు. ఐనా తను మథనపడట మెందుకు?

'నేను వొస్తానండీ!' అన్నాడు నమస్కరిస్తూ.

రమణమ్మగారు చప్పున మేలుకుంది. ఒక్కసారి కళ్లు బాగా తెరిచి అసహ్యం ఉట్టి పడేట్లుగా తనను చూసి, యీ పాడు ప్రపంచంతో తనకేమిటని అలిగినట్లు, వెంటనే తన స్వప్నసీమల్లో కరిగిపోయేందుకు కళ్ళు మూసింది. నిజంగా యీమె ఎంత అదృష్టవంతురాలు! ప్రాపంచిక విషయాలకూ యీమెకూ వున్న సంబంధం, తామరాకుకూ నీటికీ వున్న స్నేహాన్ని గుర్తుకు తెస్తోంది.

'సరే వెళ్ళు-' అన్నాడాయన చీదరించుకుంటూ 'పోలీసులు విరగ్గొడితేనే కాని నీ నోటినుంచి నిజం రాదు!'

అదెంత అల్పవిషయమో అర్థమైంది. నిజమనేది బలాత్కారం వల్ల వొస్తుందేమో? ఏమో, తనూ కథలు విన్నాడు; ఏమైనా తాను చేయగలిగిం దేమిటి?

దారి పొడుగునా ఆలోచిస్తూనే వున్నాడు. లలిత ఇంత ఘోరాని కెలా వొడిగట్టింది? యీనాడు ప్రపంచం తనను అనుమానించటం మరీ అర్థం లేనిదేమీ కాదు. ఆమె స్నేహం తనతో కాక, ఆమె తాహతుకు సరిపోయిన వారితో ఐతే ఇంత రభస జరిగేదీ కాదు; యీ అపవాదులు తన మీదింత తేలిగ్గా ప్రయోగించబడేవీ కావు.

లలిత ఒక నైచ్యానికి పాల్పడిందంటే, ఆమె వెనుక మహత్తర దుష్టశక్తులుండి ఉండాలి. ఆ శక్తులేమిటో, వాటి వికృతరూపం ఎలాటివో తనకు తెలుసు. కాని లలితకు తెలియలేదు; తెలిసినా తనను తాను వంచించుకొనివుంటుంది. ఆమెమీద ఎవ్వరూ సానుభూతి చూపరు. ముందున్న మాధుర్యాన్ని చూసి ఆమె భ్రమించింది కాని, దానివెనుక వున్న హాలాహలాన్ని చూడలేని మైకంలో పడి పోయింది. 'లలితా! ఎంత అగాధంలో పడ్డావు! నిన్ను రక్షించేందుకన్నా నాకు శక్తిలేక పోయింది కదా!' అనుకున్నాడు. నిన్నా, ఇవాళ జరిగిన రెండు దుస్సంఘటనల విషాదంతో కడుపు నిండి పోయింది.

## 34

కొన్ని స్వప్నాలు నిజమైతే ఎంత బాగుండునోనని మానవుడు భ్రమిస్తుంటాడు; అలాగే కొన్ని నిజాలు, కేవలం కలలై, స్వాప్నికానుభవం వలె అలలల్లే కరిగి పోతే ఎంత బాగుండోననీ అనుకుంటాడు; ఇప్పుడు తానీ రెండో దశలో కొట్టు మిట్టాడుతున్నాడు.

ప్రపంచంలో తను కాస్త ప్రశాంతంగా వుండే స్థలమేదన్నా వుంటే తన గదే! కాని, ఇప్పుడీ గది నరక సమానంగావుంది. తన మనసులోలేని శాంతి బైటి ప్రపంచంలో ఎక్కడో వున్నదని వెతకటం ఎంత నిష్ప్రయోజనం!

ఒకే దుస్సంఘటన జరుగుతే, ఒకపక్కకు వొరిగి పోవటం జరిగేదేమో? కాని రెండు దుస్సంఘటనలు, కావిడి కుండవలె తనను అటు ఇటు కూడా కుంగదీస్తున్నవి. తానింకో కర్ణుని రథంవలె భూమిలోకి కుంగిపోలేదెందుకనో!

లలిత!—ప్రపంచంలో లలిత ఒక్కతే అమ్మ తర్వాత తనను అర్థంచేసుకున్నదని భ్రమించాడు. ఆమె సంస్కారాన్ని తాను అపార్థం చేసుకున్నాడు. ఇలాటినైచ్యాన్ని తాను ఆమోదించగలడా? చివరకు తన స్నేహం కోరిన సమయాల్లో కూడా తాను లలితను హెచ్చరించి, దూరానికి నెట్టాలని ఎంత ప్రయత్నించలేదు కనుక? తన మనసేమిటో ఆమె అర్థంచేసుకున్నట్లే కనిపించింది. కాని, తీరా ఇప్పుడు బంధు మిత్రులందర్నీ విడనాడి, ఎక్కడో దూరంగా వెందుకు పారిపోయిందంటే, తాను ఏ విధంగా కారకు డవుతాడు? బైటి లోకం తనను నమ్మలేకపోతే నమ్మలేక పోవొచ్చు. కాని, కనీసం తన అంతరాత్మ కన్నా తాను నచ్చ చెప్పుకొనే స్థితిలో లేడాయె. నిజానికి తా నామె పరువు ప్రతిష్ఠన్ని సమాజంలోని ఆమె స్థాయిని కావాలని విశ్వ ప్రయత్నం చేశాడు. కాని అందర్నీ, చివరకు తనను కూడా కించపరిచే విధంగా ఆమె ప్రయత్నించింది!

ఆడ దాన్ని నమ్మ కూడదనే కథలు విన్నప్పుడు తన మనసు నొచ్చుకునేది. కొంతమంది పని కట్టుకొని ఆడ జాతిని తక్కువ చూపు చూసేందుకు గాను, ప్రచా

రానికి అలాటి కథల్ని సృష్టించారనుకుంటూ ఉండేవాడు. కాని...అలాటి కథలన్నీ సత్యమనేది ఒక్కొక్క సమయంలో నూటికి నూరు పాళ్లుగా వున్నదని నమ్మ వలసిన పరిస్థితి ఏర్పడింది—

కాదేమో? రెండో వైపు కూడా ఆలోచిస్తే, 'తనకు లలిత మీద వుండే అనురాగ కారణంగా కొంత పక్షపాతంతో చూసి ఉండొచ్చు— ఆమె కారణాలు ఆమెకు ఉండొచ్చు. అవి ఏమిటో పైవాళ్లకు, తనకూ కూడా తెలియదు; ఆమె చెప్పినా అర్థం కావు; ఆమె చెప్పలేదేమో కూడాను. ఐతే ప్రతి నీచ కార్యానికీ, కర్తకు తగిన కారణాలే ఉంటవి. అంతమాత్రాన అది నీచకార్యం కాకుండా పోతుందనటం కన్న హాస్యాస్పద మైన విషయం ఏమిటి?

లలిత తెలివి గలదే—కాని, సమయానికి ఆ తెలివి తేట లామెకు ఉపయోగపడి ఉండవు. ఎన్ని విద్యలు నేర్చినా సమయానికి అవి ఉపకరించకుంటే ఏం ప్రయోజనం? తాను సమాజంనుంచి బైటపడి, స్వేచ్ఛా జీవనం కొరకు ప్రయత్నిద్దామనే స్వాతంత్ర్యేచ్ఛ ఆమెను తరిమి ఉండొచ్చు. కాని బతికినంత కాలమూ యీ ప్రపంచానికి తనతోనూ, తనకీ ప్రపంచంతోను సంబంధమనేది విడిపడదనే నగ్నసత్యం ఆమెకు తట్టి ఉండదు. చూస్తూ చూస్తూ అగాధంలో పడి పోయింది. తాము మరో అగాధంలో ఉన్నాడు. తామిద్దరా ఒకే స్థితిలో వున్నా, ఒకరికొకరు దూరమయే పొయ్యారు!

ఐనా లలితను గూర్చి తనెందుకు బాధ పడాలి? తనమీద యీఘోరాపవాదు వేసేందుకు వీలయేట్లుగా ప్రవర్తించింది. లలిత తన కసలు జీవితంలో ఎదురు పడినట్లయితే, ఆ జీవిత విధానమే వేరుగా ఉండేది. కొన్నాళ్ల క్రితం తనకు టైఫాయిడ్ జ్వరం వొచ్చి నప్పుడే, తా నీ ప్రపంచాన్ని శాశ్వతంగా వొదలటం వల్ల బతికి పొయ్యేవాడు! అలా జరక్కుండా తనకూ, అమ్మకూ ఎంతో మేలుచేసే దేవకన్యల్లే వొచ్చి, తనపాలిట దెయ్యమై విరమించింది. బహుశా తనను ఇరుకున పడేద్దామనే దురుద్దేశ్యం ఆమెకు లేకపోవొచ్చును. కేవలం స్వార్థంతోనే ఆమె యీ దుస్సాహసము చేసి ఉండొచ్చు. కాని ఎవరి స్వార్థాన్ని వాళ్ళు చూసుకొని, ఎవరి సుఖం కోసమై వాళ్లు యత్నించివుంటే, మానవుల మధ్య యీ స్నేహాలూ, త్యాగాలూ, సానుభూతులూ ఉండేవా? తన స్వార్థాన్ని చూసుకొని, పద్మనాభం గారు అనుమానించినట్లు, లలితను చెడుమార్గాన నడిపినట్లయితే, యీ అభాండం తా లూకు బాధన్నా తప్పేది. కాని తానలా చేయలేదే! మరి లలిత, తన సంబంధీకుల కష్ట సుఖాలను ఆలోచించకుండా, ఇంత తొందరపాటుతో ఎందుకు సుడిగుండంలో పడింది?

లలితఎక్కడున్నదో తెలుస్తే, వెళ్ళి, ఆమె పాదాలపై పడయినాసరే, ఆమెను తిరిగి ఇంటికి తీసుకొని రాగలడు. కాని యీ విశాల ప్రపంచంలో ఎక్కడని! అర్థ

జలం, అంగబలం వున్న ఆమె కుటుంబీకులకే ఆమె అంతు చిక్కలేదు. ఇక తనలాంటి ఏకాకికా ఆమె కనిపించేది? యాదృచ్ఛికంగా తనకు ఎదురైతే, జీవితంలో ఒక్క సత్కార్యాన్ని చేయగలిగాననే ఆత్మతృప్తిని పొందేందుకైనా సరే, ఆమెను బతిమాలి, భంగపడి, వాళ్ల వాళ్ళకు అప్ప చెప్పుతాడు.

తనకెందుకీ లోకసేవ! ఎవరో చేతులు కాల్చుకునే వాళ్ళకు అడ్డం పడటం వల్ల తన చేతులే కాలుతవి. తానామెతో మాట్లాడటాన్నే సమాజం సహించదు. దాని వెనుకవున్న సదుద్దేశ్యం సంగతి ఎవరికీ అక్కర్లేదు; చీకటిని చూడ గలిగినంత స్పష్టంగా వెలుగును చూడలేక పోవటం సమాజం తాలూకు లోపమే; కాని, తానాలోపాన్ని సరిచేయ లేడు.

ఇప్పటి వరకూ అమ్మ బతికివుంది. యీ సంగతి విన్నట్లయితే, గుండె పగిలి మరణించేది. ఒక విధంగా ఆమె అదృష్ట వంతురాలు. తనబాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చి కన్నుమూసింది. ఇక తనెలా బతికినా, ఎన్ని అవస్థలు పడినా, ఎన్ని అపనిందల్ని భరించినా, తనకోసం కన్నీరుకార్చే ప్రాణిలేదు కనుక, ఆమె బాధపడుతోందే అనే బాధ తప్పుతుంది: తన బతుకును తనకే అప్ప గించిం దామె!

తనెక్కడ వున్నాడో తనే పూర్తిగా ఇంకా, తెలుసుకోకముందే ఎదుట రెండువిగ్రహాలు ప్రత్యక్షమైనవి. కళ్లభైర్లు కమ్మి ఉండటంవల్ల అమ్మనూ, లలితనూ మనను ఒక్కక్షణం భ్రమించింది కాని, కళ్లుపూర్తిగా తెరిచిచూస్తే, ఒకరు ఇంటి యజమానీ, రెండోవారు ధర్మాన్ని నాలుగు పాదాల మీదా నిలబెట్టేందుకు పూనుకున్న రక్షక భటుడూను!

'ఈయనే...' అన్నాడు ఇంటి యజమాని.

'లేవవయ్యా! ఇనస్పెక్టర్ గారు పిలుచుకు రమ్మంటున్నారు'-అన్నాడుపోలీసు కటువుగా. తానేదో గొప్పనేరం చేసినట్లే పోలీసులు అనుమానించటం కాదు-నమ్మటమే-అందుకు తగినట్లుగానే వారు ప్రవర్తిస్తారు.

నిజానికి మొదటిసారి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళటమంటే తను వొణికిపోయి ఉండ వలసింది; తను నిర్దోషి ఐనప్పటికీ, దోషిగా నిలబడేందుకే వెళ్ళాడ వలసింది కాదు. కాని ఇప్పుడు యీ రెండు దుస్సంఘటనల ముందూ, మిగతా విషయా లన్నీ అత్యల్పాలుగా ఉన్నవి.

తనను చూస్తూనే ఇనస్పెక్టర్ హుంకరించాడు. అదృష్ట వశాత్తు ఇన్‌స్పెక్టర్ తెలుగు వాడవటం వల్ల కొంత మేలైంది.

'తెలుసుగా-గోళ్ళు ఊడగొడుతాము...ఎక్కడుందో చెప్పేస్తే, పెద్దమనిషిగా వొదులుతాను' అన్నాడు ఇనస్పెక్టర్.

వికటంగా నవ్వాడు తాను. 'నాకెలా తెలుస్తుంది? నిన్నల్లా అమ్మ శవం ముందు పడి వున్నాను. ఇవాళ తెల్లారి లేచినప్పటి నుంచీ లలిత ఎక్కడున్నదని నన్ను అడుగు తున్నారు...'

ఇనస్పెక్టర్ ఒక్క క్షణం ఆలోచించాడు.

'లోపల వేయిస్తాను—తెలిసిందా?' అన్నాడు.

'మహా ప్రసాదం ఇనస్పెక్టర్ గారూ!'అన్నాడు తను.'జీవితం మీద ఏవగింపు కలుగుతోంది. జైల్లో నన్నా వుంటే ఆత్మహత్య చేసుకునే దుస్సంఘటనన్నా సంభవించకుండా వుంటుంది'

క్షణంలో కరిగి పోయ్యాడు ఇనస్పెక్టర్. 'కూర్చో' అన్నాడు. ఎదురుగా వున్న బెంచీ మీద తను కూర్చున్నాక, టేబిల్ మీదనుంచి వొంగి 'అదే కాదయ్యా! నిజంగా నీకు తెలుస్తే ఆ అమ్మాయి ఎక్కడుందో చెప్పేసెయ్...యీ ప్రేమా, గీమా అన్నీ వొట్టి మాటలు. వాటిని నమ్మ వొద్దు. నిప్పుమీద ఎంత మమకారం వున్నా, కాలకుండా వుంటుందా?... చెప్పేసెయ్. మాఅవస్థ మేంపడి ఊరంతా తెలియక ముందే సర్దేస్తాము. నీవంటే నాకు జాలికలుగుతోంది. నిన్న నీవు ఇంట్లోనే ఉన్నట్లు కూడా తెలుసనుకో. ఐతేనేం, అవతల పలుకుబడి వున్న పెద్ద మనుషుల మాటల్ని నమ్మకుండా ఎలా ఉండేది? చెప్పు...ఆమె నీ కోసం ఎక్కడో ఉండి ఎదురు చూస్తూ వుంటుంది. ఆచోటు తెలియజెయ్—చాలు!'

'నాకోసమా? లలిత నాకోసం ఎదురు చూస్తూ వుంటుందా?' అని నవ్వి 'అలాటి దేవన్నా సాధ్య మనుకుంటే ఆ స్వర్గంలోనే సాధ్యం!' అన్నాడు.

'చూడు—నాతో కవిత్వం మాట్లాడొద్దు. నేను బాధ్యతవున్న ఆఫీసర్ని. ఐనా చెపుతున్నాను. నీకు నిజంగా లలిత మీద ప్రేమవుంటే, ఆమె చెడిపోయేందుకు ఒప్పుకోవు. ఆమె పరువు ప్రతిష్టల్ని కాపాడుతావు. కనుకనే అనురాగానికి ఇదొక పరీక్ష తెలిసిందా?.—'

'నాకు అనురాగాలే అక్కర్లేదు; అలాటప్పుడు పరీక్ష లెందుకూ? ఆమె చెడిపో కూడదనే నేను మనస్ఫూర్తిగా కోరుతున్నాను. కాని నేను కోరేవి నిజంగా జరిగేందుకు నాశక్తి సామర్థ్యాలు చాలవు.' అన్నాడు తను.

బహుశా యీ మెతకతనం లాభం లేదనుకున్నాడేమో, ఇనస్పెక్టర్ అన్నాడు: 'తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభంలేదు. ఇదిచాలా పెద్ద నేరం. ఒక పక్క కిడ్నాపింగ్; రెండోపక్క దొంగతనం! ముందు వృద్ధిలోకి రావాల్సిన యువకుడివి. ఒక్కసారి క్రిమినల్ కేసులో శిక్షపడితే మళ్ళీ తలెత్తలేవు. నీ మేలు కోరి చెపుతున్నాను...ఆమెను ఎక్కడ కలుసుకునేందుకు నిర్ణయించుకున్నారో చెప్పేసెయ్. నీకు అపకారం జరక్కుండా చూసే బాధ్యతనాది!'

'నిజాన్ని నమ్మించటం కూడా కష్టం ఇనస్పెక్టర్ గారూ! నన్ను జైల్లో పడెయ్యండి. ఆమె నాకోసం ఎక్కడో నిరీక్షిస్తోందనే అనుమానంలో ఉన్నారు కనుక, నేను రాకపోవటం చూసి ఆమె నాకోసం సరాసరి ఇక్కడికైనా వొస్తుంది; లేదా ఇంటికన్నా వెళ్తుంది కదా!' అన్నాడు తను.

ఇనస్పెక్టర్ దిమ్మెర పొయ్యాడు. బహుశా మరి మాట్లాడేది కూడా ఏమీ లేదేమో? నిట్టూర్చాడు; విసుక్కున్నాడు. టోపీ నెత్తిన పెట్టుకొని, చిరాగ్గా, మళ్ళీ టేబిల్ మీద పెట్టాడు.

'మిష్టర్! నీవు కథలూ అవీ రాస్తావటగా?' అన్నాడు.

'ఔను-'

'మరి యీ ఖర్మ ఏమిటీ? యీ అపవాదులు నీకు చుట్టుకోవట మేమిటీ? ఇంతో అంతో చదువుకున్న వాడివి, ఏదో విధంగా పొట్ట పోసుపోక, యీ ధనిక కుటుంబాలతో స్నేహ మేమిటి?'

'ఏం చెప్పమంటారు ఇనస్పెక్టర్ గారూ! నా జీవితం నాకే అర్థం కాని అయోమయాల్లో, అగాధాల్లో పడి పోయింది. మనం కోరేవి జీవితంలో సిద్ధించ కుంటే మానె, కోరనివి, కలలో కూడా తలవనివివొచ్చి పడుతూంటవి: వాటిని తట్టు కునేందుకు సిద్ధంగా ఉండం కనుక, తలక్రిందులవుతూ వుంటాం' అన్నాడు తను.

(ఇంకా వుంది)


నేడే చదవండి :

## ఆహుతి

### భరద్వాజ కథల సంపుటి

ఉత్తమ కథలుగా పాఠకుల ప్రశంసల నందుకొన్న కథలను సంపుటీకరించాము. కథా వస్తువులోను రచనా సంవిధానములోనూ, నూతన పద్ధతులు అనుసరించ బడినాయి. ఇందులోని ప్రతి పాత్రా, మీకళ్ళల్లో మెదులుతుంది. మీ గుండెల్ని కదిలిస్తుంది. మీ మనస్సులో దాగిన రహస్యాలను, గూడు కట్టుకొన్న ఈర్ష్యా ద్వేషాలను, కరడు వారిన అన్యాయాలను, వెల్లివిరిసే, కారుణ్య సహృద యత్వాలను, స్పష్టంగా, స్ఫుటంగా, వెలికి లాగి, మీ ముందు ఉంచుతుంది.

ముచ్చటైన ముఖ చిత్రం:

వెల **0-8-0** మాత్రమే:

ఏజెంట్లకు 25% కమీషను.

జ్యోతి కార్యాలయం, మద్రాసు-17.


Edited & Published by Dhanikonda Hanumantha Rao, at Abhisarika Office, 4, Balu Mudali St., Madras-17. and Printed by M. Venkateswarulu at M. V. S. Press 72, Govindappa Naicken St, Madras-1.

Regd. No. M. 6516 ABHISARIKA July '56

# చిత్రసీమ

ఎడిటర్:

ధనికొండ హనుమంతరావు

★

కొత్తపత్రికలో తారల పరిచయం, విజ్ఞానవిశేషాలు, శంఖారావం, లోకోభిన్నరుచిః, ప్రశ్నోత్తరాలు, చిత్రసీమలో సంచారం, కొత్తస్టిల్సు, సెట్టుమీద దృశ్యాలు ఇంకెన్నో వింతలు, విశేషాలతో, ఆకర్షణీయమైన త్రివర్ణ ముఖచిత్రంతో శరవేగాన వస్తోంది.

★

48 పేజీలు 8 అణాలు

డిపాజిట్ కట్టగలిగినవారికి ఏజెన్సీలు ఖాయంచేయబడుతవి.

★

వివరాలకు:

జ్యోతి కార్యాలయం

మద్రాసు-17

Wrapper Printed at The Asian Printers, Madras-5